సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 256

గురువారం 30-5-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



కసరత్తులు షురూ!

అమెరికాలో తొలిరోజు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన టీమిండియా - 12లో



భారత్ అవుట్ లుక్.. పాజిటివ్

పదేళ్ల విరామం తర్వాత స్టేబుల్ నుంచి పాజిటివ్‌కు.. ఎస్‌అండ్‌పీ ప్రకటన -13లో



బెంగాల్‌లో అక్రమ వలసలు

బెంగాల్‌లో అక్రమ వలసలు కొనసాగుతున్నాయని, చొరబాటుదార్లు ప్రజల ఆస్తులను లాక్కుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. వివరాలు 6లో ▸



ఢిల్లీలో 52.3 డిగ్రీలు

దేశ రాజధాని ఢిల్లీ నార్త్ సిటీకి 50 కి.మీ దూరంలోని ముంగేష్‌పూర్‌లో బుధవారం 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వివరాలు 6లో ▸



ప్రాణాలు బలిగొన్న కరణ్ కాన్వాయ్

వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ తనయుడు కరణ్ కాన్వాయ్ ఢీకొని యూపీలోని గోండా జిల్లాలో ఇద్దరు మరణించారు. వివరాలు 6లో ▸



పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం

పాక్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో లోయలో బస్సు పడటంతో 28 మంది దుర్మరణం చెందగా మరో 22 మంది గాయపడ్డారు. వివరాలు 6లో ▸

'సడలింపు'ని సరిదిద్దండి

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

పోస్టల్ బ్యాలెట్ నిబంధనల మినహాయింపులపై ఆక్షేపణ

- ఈసీఐ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సడలింపులు
- అటెస్టింగ్ అధికారుల స్పెసిమన్ సంతకాల సేకరణ ఈసీఐ నిబంధనలకు విరుద్ధం
- ఇది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తిరస్కరించేందుకు దారితీస్తుందంటూ ఆందోళన
- సడలింపు ఉత్తర్వులను తక్షణమే సమీక్షించి, తగు నిర్ణయం తీసుకోవాలని వినతి



సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నిబంధనలను ఏపీలో సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఈనెల 25న జారీచేసిన ఉత్తర్వులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. అటెస్టింగ్ అధికారుల స్పెసిమెన్ సంతకాల సేకరణ గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలకు విరుద్ధమని గుర్తుచేసింది. ఇది పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఓట్ల తిరస్కరణకు కారణమవుతుందని.. పైగా తీవ్ర వివాదాలకు సైతం దారితీస్తుందని మిగతా 2వ పేజీలో ▶

ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి
- ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల పట్ల అత్యంత అప్రమత్తతతో ఉండాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి

2 లో

ఈసీ సడలింపుపై హైకోర్టుకు వెళ్తాం

- ఎన్నికల కమిషన్ వ్యవహార శైలిపై కోర్టులోనే తేల్చుకుంటాం
- దేశమంతా ఒక రూల్.. ఏపీలో కూటమి కోసం ప్రత్యేక రూలా?
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

2 లో



నేడు కేరళకు నైరుతి ఆగమనం

2 రోజుల్లో రాయలసీమలో ప్రవేశించే అవకాశం

స్వల్పంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతు పవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఒక రోజు ముందుగా అంటే గురువారానికే అవి కేరళను తాకుతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత రెండు రోజుల్లో ఏపీలోకి ప్రవేశించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నెల 31 లేదా వచ్చే నెల ఒకటో తేదీకల్లా రుతుపవనాలు రాయలసీమలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు దక్షిణ అరేబియా సముద్రంలోని ఎక్కువ ప్రాంతాలు, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతాల్లో విస్తరించాయి. వీటి పురోగమనం ఆశాజనకంగా ఉండడంతో గురువారం లక్షద్వీప్‌లోని కొన్ని ప్రాంతాలు, కేరళ, మరికొన్ని భాగాలు నైరుతి, మధ్య బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశం ఉంది. వారం ముందుగానే మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

పీపీఏ సీఈవోగా అతుల్ జైన్



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవోగా అతుల్ జైన్‌ను కేంద్రం నియమించింది. పీపీఏ ప్రస్తుత సీఈవో శివ్‌నందన్‌కుమార్ ఈనెల 31న పదవీ విరమణ చేయనుండటంతో కేంద్ర జల్ శక్తి శాఖ కమిషనర్(ఎఫ్ఎం) అతుల్ జైన్‌కు పీపీఏ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఉత్తర్వులిచ్చారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పు



ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో పాలిసెట్–2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. జూన్ 3న జరగాల్సిన సర్టిఫికెట్ పరిశీలనను 6వ తేదీకి (ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు సైతం) మార్చారు. అలాగే 7 నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చు. 11న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుంది. 13న సీట్లు కేటాయించనున్నారు. వివరాలు 14లో ▸

ఎక్కడా విద్యుత్ కోతలు లేవు



విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం రాజీ పడటం లేదు. టీడీపీ హయాంలో గృహాలకు పెట్టిన ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్‌లు, పరిశ్రమలకు పవర్ హాలిడేలు ఇప్పుడు ఎక్కడా లేవు. గత ఐదేళ్లలో ప్రజలు వేసవి విద్యుత్ కష్టాలను మర్చిపోయేలా సీఎం వైఎస్ జగన్ చేశారు. వివరాలు 3లో ▸

75,000 దిగువకు సెన్సెక్స్

23,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ

ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు

13 లో

ఇదం జగత్



మధ్యాహ్నం 2 గంటలకే 111 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాల వెల్లడి

- 111 నియోజకవర్గాల్లో 20 లోపు రౌండ్లు.. 61 నియోజకవర్గాల్లో 21 నుంచి 24 రౌండ్లు
- 3 నియోజకవర్గాల్లో 25 రౌండ్లకు మించి ఓట్ల లెక్కింపు
- రాత్రి 9 గంటల్లోగా అన్ని నియోజకవర్గాల ఫలితాల ప్రకటన
- సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్ వ్యాస్‌కు ఏపీ సీఈవో మీనా వెల్లడి
- జాప్యం లేకుండా లెక్కింపు జరగాలి.. ఫలితాలు కచ్చితంగా ఉండాలి

2 లో



- ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులు, ఏజెంట్లకు అవగాహన కల్పించండి
- గుర్తింపు కార్డులు ఉన్నవారినే లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించాలి
- రాష్ట్ర అధికారులకు నితీష్ వ్యాస్ ఆదేశం

సరిగ్గా ఐదేళ్ల క్రితం.. ప్రజా పరిపాలనకు శ్రీకారం

2019లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం

- అదే ఏడాది మే 30న 'జగన్ అనే నేను'.. అంటూ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం
- రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా ఐదేళ్లుగా ఆయన పరిపాలన
- ఈ పాలన కొనసాగాలని కోరుకుంటూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి దన్నుగా నిలిచిన జనం
- గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో అధిక స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం ఖాయమంటున్న రాజకీయ పరిశీలకులు

2 లో



రుద్ర క్షిపణి పరీక్ష విజయవంతం



ఆకాశంలో నుంచి భూమి పైనున్న లక్ష్యాలపైకి ప్రయోగించే రుద్ర ఎం–2 మిస్సైల్‌ను భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం నుంచి ఎస్‌యూ–30 ఫైటర్ జెట్ ద్వారా ప్రయోగించిన రుద్ర నిర్దేశించిన అన్ని లక్ష్యాలను అందుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రుద్ర ఎం–2 మిస్సైల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు.

6 లో


ప్రాణాలు తీస్తున్న గజరాజులు



- గత ఐదేళ్లలో దేశంలో 2,657 మంది మృత్యువాత
- అత్యధికంగా ఒడిశాలో 542 మంది బలి
- మానవులు–వన్యప్రాణుల సంఘర్షణల తగ్గింపునకు చర్యలు
- కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ వెల్లడి

3 లో

లయ తప్పుతున్న గుండె



ఏటా పెరుగుతున్న గుండె జబ్బులు

ఇటీవల కాలంలో తరచూ వినిపిస్తున్న మాట.. 'హార్ట్ ప్రాబ్లమ్'. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం వెరసి గుండె జబ్బులు ఏటా పెరుగుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లలు సైతం గుండె పోటుతో మరణిస్తున్నారు. దేశంలో ఏటా సంభవిస్తున్న మొత్తం మరణాల్లో 27 శాతం గుండె జబ్బుల వల్లేనని తేలింది. దీంతో 'గుండె ఘోష'ను ముందే పసిగట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.

3 లో

ప్రతి విద్యార్థికీ 'పెన్'

ఆధార్‌లాగే పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ కేటాయింపు

- దేశంలో ఎక్కడ చదువుతున్నా ఒకే సంఖ్య
- విద్యార్థుల ట్రాకింగ్ కోసం కొత్త విధానం
- టీసీ, కులధ్రువీకరణ, మైగ్రేషన్ సర్టిఫికెట్స్ లేకుండా క్లిక్‌తో బదిలీ
- డిజీ లాకర్‌లోని సర్టిఫికెట్లు తీసుకునేందుకూ ఇదే నంబర్
- 2022–23లో ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ
- ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా తప్పనిసరి చేసిన కేంద్ర ప్రభుత్వం
- యూడైస్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేస్తే ప్రత్యేక నంబర్

14 లో



కోనసీమ 'పనస'కు గిరాకీ

అంబాజీపేట మార్కెట్‌కు రోజుకు 500కు పైగా కాయలు



చూడగానే నోరూరించే పనస పంటకు కోనసీమ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తేనెలూరే రుచి ఉండే ఈ పనస తొనలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. కొబ్బరి, అరటి తరువాత కోనసీమలో పండే విలువైన పంటల్లో పనస ఒకటి. ఈ కారణంగా తూర్పు, పశ్చిమ ఏజెన్సీలలో పండే పనసకన్నా కోనసీమలో పండే పనసకు మంచి డిమాండ్ ఉంది.

5 లో

ఆ నివేదికలను వెంటనే ఇవ్వండి..

- నీతి ఆయోగ్‌కు సమర్పించాల్సిన నివేదికలపై సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: గత డిసెంబర్ 27 నుంచి 29 వరకూ ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్నచర్యలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే ఎస్.జవహర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సీఎస్‌ల సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత శాఖలు సకాలంలో వెంటనే నివేదికలివ్వాలని ఆదేశించారు. భూమి, ఆస్తులు, విద్యుత్, తాగునీరు, వైద్య ఆరోగ్యం, విద్యా శాఖలకు సంబంధించి సీఎస్‌ల సమావేశంలో చర్చించిన అంశాలపై చర్యల నివేదికను నీతి ఆయోగ్‌కు సమర్పించాల్సి ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో తాగునీటి సంరక్షణకు ఒక చాప్టర్‌ను పెట్టాల్సిన అవసరం ఉందని, దానివల్ల తాగునీటి సంరక్షణపై అవగాహన ఏర్పడుతుందన్నారు. పగటిపూట సోలార్ విద్యుత్‌తో రక్షిత మంచి నీటి పథకాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షయ, బోదకాలు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆ జనసేన కార్పొరేటర్‌కు త్వరలో లీగల్ నోటీసులు

- సీఎస్‌పై పలుమార్లు నిరాధార, అవాస్తవ ఆరోపణలు

సాక్షి, అమరావతి: ఇటీవల విశాఖపట్నంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్.. ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అసైన్డ్ భూములు కొనుగోలు చేశారంటూ అవాస్తవ ఆరోపణలు చేసిన నేపథ్యంలో మూర్తియాదవ్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బుధవారం న్యాయ నిపుణులను సీఎస్ సంప్రదించారు. గతంలో పలువురు ప్రముఖులపైనా ఇలాంటి ఆరోపణలొచ్చిన సందర్భంలో ఏ విధమైన చర్యలు తీసుకున్నారో.. అదే రీతిలో చర్యలు తీసుకుందామని న్యాయ నిపుణులు వివరించారు. ఆ కార్పొరేటర్‌కు త్వరలో లీగల్ నోటీసు ఇవ్వనున్నట్టు సీఎస్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

ఏ రాష్ట్రంలో లేని ఎన్నికల రూల్స్ ఏపీలోనే ఎందుకు?

- మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా



నెహ్రూనగర్: ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం అన్ని రాష్ట్రాలు పనిచేయాల్సి ఉంటుందని..కానీ అందుకు విరుద్ధంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో ఏపీ సీఈఓ ప్రత్యేక రూల్స్ పెట్టి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించడం విస్మయంగా ఉందని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా అన్నారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి లేఖతో అధికారులను మారుస్తూ వస్తున్న ఎన్నికల కమిషన్.. మొదటినుంచీ పక్షపాతంతో వ్యవహరిస్తుందనే అనుమానం కలుగుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో ఎన్నికల రూల్స్ అన్ని రాష్ట్రాలకు ఒక విధంగా ఉంటే.. ఏపీలో మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ తీరు చూస్తుంటే కూటమికి కొమ్ము కాస్తున్నారనే అనుమానాలు రేకెత్తుతున్నాయని తెలిపారు. ఇలాంటి నిర్ణయాల వలన కౌంటింగ్ రోజున అలజడి రేపేందుకు కారణం అయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి ఏపీ సీఈఓ ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని, జూన్ 4న జరిగే కౌంటింగ్‌ను ఎటువంటి వివాదాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

మధ్యాహ్నం 2 గంటలకే 111 నియోజకవర్గాల ఫలితాలు

111 నియోజకవర్గాల్లో 20 లోపు రౌండ్లు.. 61 నియోజకవర్గాల్లో 21 నుంచి 24 రౌండ్లు

సాక్షి, అమరావతి: వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపారు. సత్వరమే ఫలితాల ప్రకటనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని మొత్తం 175 శాసన సభ నియోజకవర్గాల్లో 111 నియోజకవర్గాల్లో 20 రౌండ్ల లోపు లెక్కింపు జరుగుతుందని, వీటి ఫలితాలు మధ్యాహ్నం 2 గంటల్లోపే ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. 61 నియోజకవర్గాల్లో 21 నుండి 24 రౌండ్లు లెక్కింపు జరుగుతుందని, వీటి ఫలితాలు సాయంత్రం 4 గంటల్లోపు వస్తాయన్నారు. మిగిలిన 3 నియోజకవర్గాల్లో 25 రౌండ్లకు పైబడి ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సాయంత్రం 6.00 గంటల్లోపు వీటి ఫలితాలు రావొచ్చని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు టేబుళ్లను పెంచి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. రాత్రి 8 - 9 గంటల మధ్య అన్ని నియోజకవర్గాల తుది ఫలితాలు ప్రకటించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. న్యూఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ బుధవారం రాష్ట్ర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమీక్షించారు. లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో కౌంటింగ్‌కు చేపట్టిన ఏర్పాట్లను సీఈవో మీనా వివరించారు. ఎన్నికల అనంతరం హింసాత్మక ఘటనలు జరిగిన జిల్లాల్లో ఓట్ల లెక్కింపు రోజు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 144 సెక్షన్ అమలుతో పాటు ఆ జిల్లాల్లో సీనియర్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. డీజీపీతో పాటు తాను కూడా పల్నాడు జిల్లాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించామని, అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.



ఓట్ల లెక్కింపులో లోపాలు జరగకూడదు

ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో ఎటువంటి లోపాలు, జాప్యం జరగడానికి వీల్లేదని, అందుకోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, త్వరితగతిన కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ రాష్ట్ర అధికారులకు చెప్పారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపును విజయవంతంగా పూర్తి చేయాలని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, సీపీలకు సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం-21 సీ, 21ఈలను అదే రోజు ఫ్లైట్‌లో ఈసీకి పంపాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థులు, ఏజెంట్లు ఎటువంటి అవాంతరాలు కలిగించకుండా లెక్కింపు ప్రక్రియపై వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల్లో కూలీల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులను ఎవ్వరినీ అందుకు వినియోగించొద్దని చెప్పారు. గుర్తింపు కార్డులు ఉన్నవారినే లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఎన్నికల అనంతరం పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనలు జరిగినందున, ఈ జిల్లా అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసర్, అడిషనల్ డీజీ ఎస్ బాగ్చీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలను, సీపీలను అప్రమత్తం చేశామని, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాల ప్రకటనకు చేపడుతున్న చర్యలు, శాంతి భద్రతల పరిరక్షణకు చేస్తున్న బందోబస్తు ఏర్పాట్లను ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు నితీష్ వ్యాస్‌కు వివరించారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో హరేంధిర ప్రసాద్, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు తదితరులు వారి నియోజకవర్గాల నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

■ సరిగ్గా ఐదేళ్ల క్రితం..

ప్రజాపరిపాలనకు శ్రీకారం

- 2019 ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం
- అదే ఏడాది మే 30న 'జగన్ అనే నేను'.. అంటూ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలనకు చరమగీతం పాడి.. ప్రజాపరిపాలనకు సీఎం వైఎస్ జగన్ నాంది పలికి నేటికి సరిగ్గా ఐదేళ్లు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు.. 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించింది. కేవలం 23 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలకు పరిమితమైన టీడీపీ ఘోర పరాజయం పాలైంది. వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడంతో 2019, మే 30న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంచేసి.. ప్రజాపరిపాలనకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం అధికారం చేపట్టిన తొలి ఏడాదే అమలుచేశారు. మొత్తం మీద 99 శాతం హామీలు అమలుచేసి మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు.

సువర్ణాక్షరాలతో లిఖించేలా

గత ఐదేళ్లుగా సంస్కరణలు, వికేంద్రీకరణ, సంక్షేమం, అభివృద్ధి పథకాలతో రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా సీఎం జగన్ సుపరిపాలన అందించారు. నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా.. వివక్ష చూపకుండా.. లంచాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా పేదల ఖాతాల్లో డీబీటీ రూపంలో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు జమచేశారు. నాన్ డీబీటీ రూపంలో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. దేశ చరిత్రలో ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనాన్ని పేదలకు చేకూర్చిన దాఖలాలు ఎక్కడాలేవు. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించారు. ఇంటిగుమ్మం వద్దకే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు.

మంచి చేసిన ప్రభుత్వానికి దన్నుగా..

ఈ నేపథ్యంలో.. ఇప్పటికే అమలవుతున్న పథకాలను కొనసాగిస్తూ.. ఏటా అమ్మఒడి పథకం కింద ఇస్తున్న సొమ్మును రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంచుతామని.. రైతుభరోసా కింద ఇస్తున్న రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంచుతామంటూ కొత్తగా హామీలిచ్చిన సీఎం జగన్.. మీ బిడ్డ ప్రభుత్వంవల్ల మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే.. ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రజలకు వినమ్రంగా విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ వినతికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా తీర్చిదిద్దేందుకు.. రాష్ట్రం రూపురేఖలను మరింతగా గొప్పగా మార్చేందుకు వైఎస్సార్‌సీపీకి ప్రజలు దన్నుగా నిలిచారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లోనూ అధిక స్థానాలు చేజిక్కించుకుని వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించడం ఖాయమని రాజకీయ పరిశీలకులు స్పష్టంచేస్తున్నారు.

ఈసీ సడలింపుపై హైకోర్టుకు వెళ్తాం

- దేశమంతా ఒక రూల్.. ఏపీలో కూటమి కోసం ప్రత్యేక రూలా?
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం సడలింపుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున హైకోర్టుకు వెళ్తామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. దేశమంతా ఒక రూల్.. ఏపీలో కూటమి కోసం ప్రత్యేక రూలా? అని ఆయన ప్రశ్నించారు. ఈ కొత్త నిబంధనలు ఏపీలోనే అమలుచేయడానికి ఎన్నికల కమిషన్ ఎందుకు తాపత్రయపడుతుందో అర్థంకావడం లేదన్నారు. ఈసీ వ్యవహారశైలిపై కోర్టులోనే తేల్చుకుంటామన్నారు. విశాఖలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అంటేనే తప్పుడు వ్యక్తి అని.. దానికి తోడు తప్పుడు పనుల కోసమే బీజేపీతో టీడీపీ జతకట్టిందని మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ సంతకం సడలింపుపై ఈసీ నిర్ణయం మార్చుకోకపోతే హైకోర్టులో ఫిర్యాదు చేస్తామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని వైవీ అన్నారు. ఎన్నికల నియమావళిలో ఎలాంటి నియమ నిబంధనలు ఉన్నాయో వాటి ప్రకారమే ఈసీ వ్యవహరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ అధికారి సంతకం లేకుంటే దానిని తిరస్కరించడం ఎన్నికల నిబంధన అని.. దానికి తూట్లు పొడిస్తే సహించేదిలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలా సడలింపులు ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలను జారీచేసిందని.. ఇందుకు విరుద్ధంగా ఒక రాజకీయ పార్టీ వినతికి తలొగ్గి నిబంధనలు ఎలా మారుస్తారో.. ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని వైవీ డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోమారు భారీ విజయం వైపుగా దూసుకెళ్లనుందని.. సీఎంగా వైఎస్ జగన్ రెండోసారి ... వైస్తారని చెప్పారు. వచ్చేనెల 9న విశాఖలోనే ప్రమాణస్వీకారం చేయడం తథ్యమన్నారు.

ఈసీ సడలింపులతో శాంతిభద్రతల సమస్య

- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల సందర్భంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఒక నిబంధనావళి రూపొందించిందంటే అది దేశవ్యాప్తంగా అమలు జరగటం ఇంతకాలంగా చూశామని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. కానీ, కూటమి కుటిలయత్నాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా 'పచ్చ'పాతంతో వ్యవహరిస్తున్నట్లు కనపడుతోందని బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండిపడ్డారు. డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ అధికారి స్టాంప్ లేకపోయినా, సంతకం ఉంటే చాలు ఆమోదించాలన్న టీడీపీ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి 25న సడలింపు ఇస్తూ అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంపై అనుమానం వస్తే ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వద్ద సంతకంతో సరిపోల్చుకోవాలని ఆదేశాలిచ్చారని.. ఇది పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు సమయంలో వివాదాలకు దారితీస్తుందని, కౌంటింగ్ కేంద్రం బయట శాంతిభద్రతల సమస్యగా పరిణమిస్తుందని కొరముట్ల శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు.

ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి
- ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల పట్ల అత్యంత అప్రమత్తతతో ఉండాలి
- వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తుంది
- జూన్ 9న సీఎంగా జగన్ మరోసారి ప్రమాణ స్వీకారం చేస్తారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తతతో వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్ల వర్క్‌షాప్, జూమ్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల సందేహాల నివృత్తికి కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఎటువంటి సమస్య ఉన్నా కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో కూడా చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో గుంటూరులో వేల ఓట్లు మన పార్టీ నష్టపోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి ఓటూ విలువైనదేనని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, దానికి సంబంధించి ఆదేశాలు రాగానే తెలియజేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వారికి అనుకూలంగా నిర్ణయాలు వచ్చేలా చేస్తున్నారని అన్నారు. ఇటీవలి కాలంలో ఈసీ తీరు అనుమానాలకు తావిచ్చేలా ఉన్నందున, అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నియమ నిబంధనల పట్ల పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వస్తుందని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని, ఇందులో ఎటువంటి అనుమానమూ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విస్పష్టంగా చెప్పారు. వచ్చే నెల 9వ తేదీన వైఎస్ జగన్ మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. సమావేశానికి హాజరైన వారికి విశ్రాంత ఆర్డీవో ముదిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఏజెంట్ల సందేహాలు నివృత్తి చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి, శాసన మండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కించే విధానం

- ■ ఎన్నికల అధికారి నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో మొదట విధిగా పోస్టల్ బ్యాలెట్లని లెక్కించాలి
- ■ మొదటి కవరు-బి పైన నియోజకవర్గం పేరు, ఎన్నికల అధికారి అడ్రెస్సు, ఓటరు సంతకం ఉండాలి. (ఓటరు సంతకం తప్పనిసరికాదు).

➤ మొదటి కవరు-బి (ఫారం - 13సి) తెరిచి చూసినప్పుడు అందులో 13 - ఏ డిక్లరేషన్, ఫారం 13-బి (కవరు - ఏ) విడివిడిగా ఉండాలి. లేకపోతే అది చెల్లుబాటు కాదు. అందులో కవరు - ఏ లేకపోయినా, 13-ఏ డిక్లరేషన్ లేకపోయినా, 13-ఏ డిక్లరేషన్ మీద ఓటరు సంతకం లేకపోయినా, 13-ఏ డిక్లరేషన్ మీద పోస్టల్ బ్యాలెట్ క్రమ సంఖ్య నమోదు చేయకపోయినా, నమోదు చేసినట్లయితే అది 13-బి (పోస్టల్ బ్యాలెట్ కవరు) మీద ఉన్న క్రమ సంఖ్యతో సరిపోలకపోయినా, 13 - ఏ డిక్లరేషన్ మీద గజిటెడ్ అధికారి సంతకం లేకపోయినా, ఒకవేళ సంతకం ఉండి హోదా తెలియజేసే స్టాంప్ లేదా హోదా తెలియజేసే విధంగా చేతితో రాసి కాని లేకపోతే ఆ పోస్టల్ బ్యాలెట్ చెల్లనిదిగా పరిగణించాలి.

➤ 13- ఏ డిక్లరేషన్లో అన్ని అంశాలు సరిగా ఉన్నట్లయితే, ఫారం 13 - బి పోస్టల్ బ్యాలెట్ కలిగి ఉన్న కవరు(కవరు - ఏ)ను పరిశీలించాలి. 13- ఏ డిక్లరేషన్లో పేర్కొన్న బ్యాలెట్ పేపర్ క్రమసంఖ్య, 13 - బి పోస్టల్ బ్యాలెట్‌లో ఉన్న క్రమసంఖ్య ఒకటి కాకపోయినా, ఓటరు ఎవ్వరికీ ఓటు వేయకపోయినా, ఓటరు తమ ఓటుని ఒకరికంటే ఎక్కువ మందికి వేసినా, బ్యాలెట్ పేపరు చిరిగిపోయి పూర్తిగా సమాచారం కనిపించకపోయినా, ఓటరు ఓటుని ఎవరికి వేశారో పూర్తి సందిగ్ధంగా ఉన్నప్పుడు, ఓటరు తనే ఓటు వేసినట్లుగా గుర్తించినప్పుడు (ఉదాహరణకు ఓటరు పేరు రాసినా, సంతకం చేసినా) దానిని చెల్లని ఓటుగా పరిగణించాలి. ప్రతి బ్యాలెట్ పేపర్‌లో నమోదు చేసిన అంశాలను పోటీ చేసే అభ్యర్థుల ప్రతినిధిగా ఉన్న ఏజెంట్/అభ్యర్థికి విధిగా సంబంధిత ఎన్నికల అధికారి చూపించి నిర్ణయం తీసుకోవాలి. బ్యాలెట్ పేపరు లెక్కించిన తరువాత రిజల్ట్ షీట్ (ఫారం-20)లో నమోదు చేయాలి.

ఖరీఫ్ సాగు లక్ష్యం 85.65 లక్షల ఎకరాలు

- 6.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, 17.50 లక్షల టన్నుల ఎరువులు సిద్ధం
- ఆర్బీకేల్లో 5.60 లక్షల టన్నుల ఎరువులు.. సబ్సిడీ విత్తనాల పంపిణీ
- రూ.99,600 కోట్ల పంట రుణాలివ్వాలని నిర్ణయం
- కౌలు రైతులకు ప్రత్యేకంగా రూ. 5 వేల కోట్ల రుణాలు



సాక్షి, అమరావతి: నైరుతి పవనాలు కమ్ముకొస్తున్నాయి. మృగశిర కార్తె మొదలు కానుండడంతో రైతన్నలు తొలకరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల మేరకు ఈ సారి సాగు లక్ష్యాలను నిర్దేశించిన వ్యవసాయ శాఖ అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేసింది. ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తన పంపిణీ జోరుగా సాగుతుండగా, అవసరమైన ఎరువులు, పురుగు మందులను కూడా అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో మరిన్ని పంట ఉత్పత్తులకు గ్యాప్ సర్టిఫికేషన్ జారీకి సన్నాహాలు చేస్తున్నారు.

167.15 లక్షల టన్నుల దిగుబడులు

ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 81.25 లక్షల ఎకరాలు కాగా ఖరీఫ్- 2023లో వర్షాభావ పరిస్థితుల వల్ల 73.45 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. మూడో ముందస్తు అంచనాల ప్రకారం 144.85 లక్షల టన్నుల దిగుబడులొచ్చాయి. రబీ కోతలు దాదాపు పూర్తి కావడంతో రైతులు ఖరీఫ్ దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్-2024లో సాగు లక్ష్యం 85.65 లక్షల ఎకరాలుగా నిర్దేశించారు. 52.9 లక్షల ఎకరాల్లో ఆహార ధాన్యాలు, 16.45 లక్షల ఎకరాల్లో నూనె గింజలు, 8.35 లక్షల ఎకరాల్లో అపరాలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా పంటల వారీగా చూస్తే 39.07 లక్షల ఎకరాల్లో వరి, 14.80 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 14.67 లక్షల ఎకరాల్లో పత్తి, 6.35 లక్షల ఎకరాల్లో కందులు, 3.55 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న,1.62 లక్షల ఎకరాల్లో చెరకు సాగు చెయ్యాలని నిర్ణయించారు. అలాగే ఖరీఫ్‌లో 167.15 లక్షల టన్నుల దిగుబడులు సాధించాలన్నది లక్ష్యం. వాటిలో ప్రధానంగా వరి 85.47లక్షల టన్నులు, 43.99 లక్షల టన్నుల చెరకు, 18.78 లక్షల టన్నుల పత్తి, 7.84 లక్షల టన్నుల మొక్కజొన్న, 6.49 లక్షల టన్నుల వేరుశనగ, 1.72 లక్షల టన్నుల కందులు దిగుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆర్బీకేల ద్వారానే పురుగు మందులు

ఖరీఫ్-24 సీజన్‌కు 17.50 లక్షల టన్నుల ఎరువుల అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం 7.66 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మరో వైపు 5 లక్షల నానో యూరియా, 2 లక్షల నానో డీఏపీ బాటిల్స్‌ను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత 4 ఏళ్లలో ఆర్బీకేల ద్వారా 10.51 లక్షల టన్నుల ఎరువులను సరఫరా చేయగా, ప్రస్తుత సీజన్‌లోనే 5.60 లక్షల టన్నుల ఎరువుల సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్బీకేల ద్వారా పురుగు మందులు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రూ.2.64 కోట్ల రుణ లక్ష్యం

గత సీజన్‌లో రూ.1.48 లక్షల కోట్ల పంట రుణాలు, రూ.83 వేల కోట్ల టర్మ్ రుణాలు ఇవ్వాలని ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. 99.60 లక్షల మందికి 2.08 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేశారు. 2024-25 సీజన్‌లో 1.66 లక్షల కోట్ల పంట రుణాలు, 98 వేల టర్మ్ రుణాలు ఇవ్వాలని, వీటిలో ఖరీఫ్‌లో 99,600 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. కౌలు రైతులకు 10 వేల సీసీఆర్సీ కార్డులు జారీ లక్ష్యం కాగా, కనీసం 5 వేల కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు.

1300 పొలం బడులు

గత ఖరీఫ్ సీజన్ నుంచే గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ సర్టిఫికేషన్ తొలిసారి ఇచ్చారు. ఈ సారి ఖరీఫ్‌లో వరిలో 776, అపరాలలో 260, వేరుశనగలో 130, పత్తిలో 58, మొక్కజొన్నలో 54, చిరుధాన్యాల్లో 22 చొప్పున పొలంబడులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత 4 సీజన్లలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించే వారిని ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో క్లస్టర్ పరిధిలోకి తీసుకొచ్చి వారు పాటించే యాజమాన్య పద్ధతులను బట్టి గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేయాలని నిర్దేశించారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. విత్తు నుంచి కోత వరకు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచేలా చర్యలు తీసుకున్నాం. విత్తన పంపిణీ జోరుగా జరుగుతోంది. ఎరువులతో పాటు నానో యూరియా, నానో డీఏపీను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. మరిన్ని ఉత్పత్తులకు గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– చేవూరి హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

జోరుగా విత్తన పంపిణీ

ఖరీఫ్-24 కోసం 6.32 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను సిద్ధం చేశారు. వీటి కోసం ప్రభుత్వం రూ.199.95 కోట్లు సబ్సిడీ రూపంలో ఖర్చు చేయనుంది. ప్రధానంగా 2.24 లక్షల టన్నుల వరి, 2.99 లక్షల టన్నుల వేరుశనగ, 84 వేల టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేశారు. విపక్షాల ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. పోలింగ్ ముగిసి ఇటీవలే ఆంక్షలు సడలించడంతో విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాల పంపిణీ జోరుగా సాగుతోంది. మిగిలిన విత్తనాలను జూన్ 1వ తేదీ నుంచి ఆర్బీకేల్లో నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 4 లక్షల నమూనాల సేకరణ లక్ష్యంగా భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టారు.

'సడలింపు'ని సరిదిద్దండి

▶ మొదటి పేజీ తరువాయి

ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఎస్. నిరంజన్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా నిబంధనలను సడలిస్తూ జారీచేసిన ఉత్తర్వులను తక్షణం సమీక్షించి.. సముచిత నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశవ్యాప్తంగా ఒకలా.. రాష్ట్రంలో మరోలా..

నిజానికి.. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం చేసి, స్టాంప్ లేకపోయినా.. తన పేరు, డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాస్తే ఆమోదించాలని గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. కానీ.. రాష్ట్రంలో టీడీపీ నేతల విజ్ఞప్తి మేరకు ఈ మార్గదర్శకాలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఈనెల 25న ఉత్తర్వులు జారీచేశారు. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి (ఆర్వో) నిర్దేశించిన అటెస్టింగ్ ఆఫీసర్ సంతకాలు (స్పెసిమెన్) సేకరించి.. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్వోలకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలు.. డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాయకపోయినా సరే.. ఆ సంతకంపై ఏమైనా అనుమానం వస్తే రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ అధికారి సంతకం (స్పెసిమెన్)తో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకునేలా సడలింపు ఇచ్చారు.

గోప్యతకు.. శాంతిభద్రతలకు విఘాతం..

ఇక పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో స్పెసిమెన్ సంతకంపై రాజకీయ పక్షాల ఏజెంట్ల మధ్య భేదాభిప్రాయాలు వ్యక్తమవుతాయి. ఇది చిలికిచిలికి పెను వివాదంగా మారి శాంతిభద్రతల సమస్యగా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ నిబంధనలవల్ల ఓటు గోప్యత ఉండదని రాజకీయ పక్షాలు, ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో టీడీపీ నేతలు విజ్ఞప్తి చేయగానే.. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా ఉత్తర్వులు జారీచేయడంపై నివ్వెరపోతున్నారు.

నిబంధనల సడలింపుపై న్యాయపోరాటం..

ఇదిలా ఉంటే.. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా జారీచేసిన ఉత్తర్వులపై దుమారం రేగుతోంది. వాటిని సమీక్షించి.. సముచిత నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సముచిత నిర్ణయం తీసుకోని పక్షంలో.. మీనా సడలింపు ఉత్తర్వులపై న్యాయపోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది.

క్లుప్తంగా...

ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగుల సస్పెన్షన్లు ఎత్తివేయాలి

ఎన్నికల సంఘానికి ఎస్టీయూ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయుల విషయంలో తగిన కారణాలను పరిశీలించి సస్పెన్షన్ చర్యలను ఎత్తివేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. బుధవారం ఎస్టీయూ ప్రథమ కార్యవర్గ సమావేశం విజయవాడ దాసరి భవన్‌లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు, వితంతువులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటర్నింగ్ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే విధులకు గైర్హాజరయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ఎన్నికల సిబ్బంది గతంలో మాదిరిగా రీపోలింగ్ అవకాశమే లేకుండా అర్ధరాత్రి వరకు పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ సిబ్బంది కృషితోనే ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకుని సస్పెన్షన్లను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో నిర్ణయాల మేరకు పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులు, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతిరోజు ఎస్పీ కార్యాలయంలో హాజరవ్వాలి

టీడీపీ అభ్యర్థి అరవిందబాబుకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్

నరసరావుపేట టౌన్: హత్యాయత్నం కేసులో నరసరావుపేట టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు 13వ అదనపు జిల్లా కోర్టు బుధవారం షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. జూన్ 6 వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దని పేర్కొంది. పోలింగ్ రోజున అరవిందబాబు ఆధ్వర్యంలో టీడీపీ వర్గీయులు మారణాయుధాలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడికి పాల్పడి కారు అద్దాలు ధ్వంసంచేసి.. రామకోటిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. కేసులో ప్రధాన నిందితుడైన అరవిందబాబు హౌస్ అరెస్ట్‌లో ఉండగా.. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు. కాగా.. తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని స్థానిక అదనపు జిల్లా కోర్టును అరవిందబాబు ఆశ్రయించారు. దీనిపై న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఎస్పీ కార్యాలయంలో హాజరు కావాలని, కేసుపై మీడియాతో మాట్లాడకూడదని, పోలీస్ అధికారుల నియంత్రణలో ఉండాలని సూచించింది. కౌంటింగ్‌కు హాజరయ్యేలా షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కాగా.. ఎమ్మెల్యే గోపిరెడ్డి కారు డ్రైవర్ చట్టి హరేంద్రపై హత్యాయత్నం కేసులోనూ అరవిందబాబుకు బెయిల్ లభించింది. ఈ కేసులో కూడా తనను అరెస్ట్ చేయకుండా బెయిల్ మంజూరు చేయాలని అరవిందబాబు చేసుకున్న అభ్యర్థనపైనా షరతులతో కూడిన బెయిల్‌ను 13వ అదనపు జిల్లా కోర్టు మంజూరు చేసింది.

లయ తప్పుతున్న గుండె

ఏటా పెరుగుతున్న గుండె జబ్బులు

- రాష్ట్రంలో 2022-23లో ఆరోగ్యశ్రీ ద్వారా లక్ష మందికి పైగా చికిత్స
- ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని హెచ్చరిస్తున్న వైద్యులు
- గుండె జబ్బు లక్షణాలను పసిగట్టి ముందే వైద్యులను సంప్రదించాలి

సాక్షి, అమరావతి: ఇటీవల కాలంలో తరచూ వినిపిస్తున్న మాట.. 'హార్ట్ ప్రాబ్లమ్'. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం వెరసి గుండె జబ్బులు ఏటా పెరుగుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లలు సైతం గుండె పోటుతో మరణిస్తున్నారు. దేశంలో ఏటా సంభవిస్తున్న మొత్తం మరణాల్లో 27 శాతం గుండె జబ్బుల వల్లేనని తేలింది. దీంతో 'గుండె ఘోష'ను ముందే పసిగట్టాలని వైద్యులు సూచిస్తున్నారు. ఛాతీలో నొప్పి, అసౌకర్యం, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది ఎదురైతే తాత్సారం చేయొద్దని హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యలు ఉన్న వారంతా గుండె జబ్బులేనని నిర్ధారణకు రాకుండా.. అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.



అండగా నిలిచిన ఆరోగ్యశ్రీ, ఈసీసీ

రాష్ట్రంలో ఏటా గుండె జబ్బులు పెరుగుతున్నాయి. గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారందరికీ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోంది. 2019-20వ సంవత్సరంలో ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా కార్డియాలజీ, కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాల్లో 59,700 చికిత్సలు జరిగాయి. 2022-23 నాటికి ఈ చికిత్సల సంఖ్య ఏకంగా లక్ష దాటింది. అలాగే 2023-24లో కూడా ఈ ఏడాది జనవరి నాటికి 84 వేల మందికి ప్రభుత్వం గుండె జబ్బులకు ఉచితంగా చికిత్సలు చేయించింది. ఏటా పెరుగుతున్న గుండె జబ్బులను పరిగణనలోకి తీసుకుని వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్(ఈసీసీ) కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో సైతం ఛాతీనొప్పితో వచ్చే బాధితులకు ఈసీజీ తీసి, కార్డియాలజిస్ట్‌ల సూచనలతో థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌లు చేసి ప్రాణాపాయం నుంచి రక్షిస్తున్నారు.

జీవన విధానం మారాలి

- 40 ఏళ్లు దాటిన వారు, రిస్క్ ఫ్యాక్టర్స్(బీపీ, షుగర్, ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు) ఉన్నవారు తరచూ జనరల్ చెకప్ చేయించుకోవాలి.
- రోజుకు కనీసం 30 నిమిషాలు వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్ వంటివి చేయాలి.
- ఆకుకూరలు, చిరుధాన్యాలు, తాజా పళ్లు, కూరగాయలు, గుండె ఆరోగ్యాన్ని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి.
- రెడ్ మీట్ తినడం తగ్గించాలి. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి.
- ధూమపానం, మద్యపానం మానేయాలి.
- శరీర బరువు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలి.
- మానసిక ఒత్తిడి తగ్గించేందుకు యోగా, ధ్యానం చేస్తుండాలి.

మనం మారితేనే గుండె పదిలం



గతంలో గుండె జబ్బులు వయసు పైబడిన వారికి లేదా వంశపారంపర్యంగా మాత్రమే ఎక్కువగా కనిపించేవి. ప్రస్తుతం అన్ని రకాల వయసు వారిలోనూ గుండె జబ్బులు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం మారిన జీవన విధానమే. అధిక మొత్తంలో ఆహారం తీసుకోవడం, అధిక ఒత్తిడికి లోనవ్వడం, శారీరక శ్రమ లేకుండా జీవించడం వంటి విధానాలను మనం వీడాలి. మనం మారినప్పుడే గుండె పదిలంగా ఉంటుంది. అలాగే గుండె జబ్బులకు సంబంధించిన లక్షణాలున్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇప్పటికే సమస్యలున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

– డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి, కర్నూలు జీజీహెచ్

ఆరోగ్యశ్రీ కింద గత ఐదేళ్లలో జరిగిన గుండె సంబంధిత చికిత్సల వివరాలు


సంవత్సరం	గుండె సంబంధిత చికిత్సలు	కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీలు
2019-20	23,797	35,903
2020-21	24,243	25,779
2021-22	36,724	35,815
2022-23	66,333	43,159
2023-24	71,474	13,078

(ఈ ఏడాది జనవరి వరకు)

ఎక్కడా విద్యుత్ కోతలు లేవు

డిమాండ్ భారీగా పెరిగినా నిరంతరాయంగా సరఫరా

- విద్యుత్ డిమాండ్ రోజుకు 236 మిలియన్ యూనిట్లుగా నమోదు
- కొన్నిచోట్ల పిడుగుపాట్లు, చెట్లు విరిగిపడటం, చిరు ప్రాణుల వల్ల సాంకేతిక సమస్యలు
- వ్యవసాయ విద్యుత్ ఫీడర్లను వేరు చేసే పనుల వల్ల కొంత ఆటంకం
- అయినా 23 నుంచి 45 నిమిషాలకి మించి అవాంతరాల్లేకుండా సరఫరా



సాక్షి, అమరావతి: విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ, ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడటంలేదు. మండు వేసవి వస్తే గత ప్రభుత్వంలో గంటల తరబడి విద్యుత్ కోతలు గుర్తొస్తాయి. టీడీపీ హయాంలో గృహ వినియోగదారులకు పెట్టిన ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ (ఈఎల్ఆర్)లు, పరిశ్రమలకు విధించిన పవర్ హాలిడేలు ఆందోళనకు గురిచేస్తుంటాయి. కానీ గత ఐదేళ్లలో ప్రజలు వేసవి విద్యుత్ కష్టాలను మర్చిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. ముందస్తు ప్రణాళికలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ సంస్థలను తీర్చిదిద్దారు. దీని ద్వారా ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందుతోంది. ఈ వేసవిలో రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ విద్యుత్ డిమాండ్ భారీగా 236 మిలియన్ యూనిట్లకు పెరిగింది. అయినప్పటికీ, ఎక్కడా విద్యుత్ కోతలు, అవాంతరాలు లేకుండా సరఫరా జరుగుతోంది. అయితే వేసవిలో సబ్ స్టేషన్లు, లైన్ల మరమ్మతులకు చేపట్టాల్సిన సాధారణ మెయింటెనెన్స్, వ్యవసాయ ఫీడర్లను ఇతర ఫీడర్లతో వేరుచేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు, భారీ ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటం, సబ్ స్టేషన్లపై పిడుగులు పడటం, ఉడుతలు, బల్లులు, పక్షులు, పాములు వంటి చిరు ప్రాణులు ఫీడర్లను దెబ్బతీయడం వంటి కారణాల వల్ల పలు ప్రాంతాల్లో స్వల్ప కాలం పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది. అది కూడా 23 నిమిషాల నుంచి 45 నిమిషాల వరకే. ఇది మినహా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీఎండీ ఐ.పృథ్వీతేజ్, ఆంధ్రప్రదేశ్ మధ్య, దక్షిణ ప్రాంత డిస్కంల సీఎండీ కె.సంతోషరావు స్పష్టం చేశారు. వారు 'సాక్షి'కి బుధవారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

- అనంతపురం సర్కిల్ పరిధిలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా ఆ మండల పరిధిలోని గ్రామాల్లో 28వ తేదీన విద్యుత్ సరఫరా ఉండదని ఈనెల 27న పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశాం. మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరాను పునరుద్ధరించాం.
- కదిరిలోని 132/33 కెవి సబ్‌స్టేషన్ సమీపంలో పిడుగుపాటు కారణంగా సబ్ స్టేషన్ మరమ్మతుకు గురవడంతో దాని పరిధిలోని తొమ్మిది 33/11 కెవీ సబ్‌స్టేషన్లకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వెంటనే మరమ్మతులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించాం.
- వ్యవసాయ విద్యుత్ ఫీడర్లను వేరు చేయడం ద్వారా గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తును సరఫరా చేసే పనులు జరుగుతున్నాయి. అందుకోసం లైన్ క్లియరెన్స్ తీసుకోవడం కారణంగా కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.
- రాజమహేంద్రవరం 33/11 కేవీ తాడితోట సబ్ స్టేషన్‌లోని 11 కేవీ గాంధీపురం ఫీడర్‌పై ఉదయం 07.20 గంటలకు చెట్ల కొమ్మలు పడటం వల్ల కాసేపు కరెంట్ ఆగింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) స్విచ్‌ను మార్చి, కొమ్మలను తొలగించి 45 నిమిషాల్లోనే సరఫరాను పునరుద్ధరించారు.
- శ్రీకాకుళం సర్కిల్ ఇచ్ఛాపురం టౌన్‌లో ఇన్‌కమింగ్ వైపు ఉన్న లైవ్ వైర్, క్రాస్ ఆర్మ్‌కి మధ్య బల్లి తాకింది. దీంతో ఏఎస్ పేట కాలనీ వద్ద హై టెన్షన్ (హెచ్‌టీ) ఇన్‌కమింగ్ సైడ్ జంపర్ కట్ అయ్యింది. దీనివల్ల ఇచ్ఛాపురంలోని కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కేవలం 23 నిమిషాల్లోనే దీనిని సరిచేసి విద్యుత్తు సరఫరా చేశాం. రాష్ట్రంలో ఇంతకు మించి విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేవు. పరిశ్రమలు, గృహ, వాణిజ్య వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ కోతలు అమలు చేయడం లేదు.

- ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితులైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, చరణ్‌ప్రీత్, దామోదర్‌శర్మ, అరవింద్‌సింగ్‌లను జూన్ 3న హాజరు కావాలని న్యూఢిల్లీలోని ట్రయల్ కోర్టు ఆదేశించింది. ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకొనే క్రమంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

రూ.107.96 కోట్ల నగదు.. రూ.58.70 కోట్ల మద్యం

- ఎన్నికల వేళ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- విస్తృతంగా సోదాలు నిర్వహించిన పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ పోలీసు శాఖ నిర్వహించిన తనిఖీల్లో రాష్ట్రవ్యాప్తంగా రూ.107.96 కోట్లు పట్టుబడ్డాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, డబ్బుల పంపిణీ, అక్రమ మద్యం పంపిణీ తదితర ఎన్నికల అక్రమాలను నిరోధించేందుకు పోలీసు శాఖ పటిష్ట కార్యాచరణ ప్రణాళికను అమలు చేసింది. అందుకోసం పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, వాణిజ్య పన్నులు, రవాణా శాఖ సంయుక్తంగా 150 చెక్ పోస్టులను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర సరిహద్దుల్లో విస్తృత తనిఖీల కోసం 35 మొబైల్ పార్టీలను నియమించడంతో పాటు 15 తాత్కాలిక చెక్ పోస్టులను కూడా ఏర్పాటు చేశాయి. రాష్ట్ర సరిహద్దుల్లోనూ, రాష్ట్రం లోపల కూడా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.

గతంకంటే అత్యధికంగా..

- 2019 ఎన్నికల్లో రూ.41.80 కోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2024 ఎన్నికల్లో అంతకు 158 శాతం అధికంగా రూ.107.96 కోట్లు స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.
- 2019 ఎన్నికల్లో రూ.8.07 కోట్ల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకోగా.. ప్రస్తుత ఎన్నికల్లో రూ.58.70 కోట్ల విలువైన అక్రమ మద్యాన్ని జప్తు చేశారు. అక్రమ మద్యం తరలింపుతో సంబంధం ఉన్న 61,543 మందిని అరెస్ట్ చేశారు.
- 2019 ఎన్నికల్లో రూ.5.04 కోట్ల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో రూ.35.61 కోట్ల విలువైన మత్తు పదార్థాలను జప్తు చేశారు.
- 2019 ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు తరలించిన రూ.10.63 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 2024 ఎన్నికల్లో రూ.16.98 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను జప్తు చేశారు.
- ప్రస్తుత ఎన్నికల్లో 3,466 వాహనాలను జప్తు చేశారు.

నేడు కేరళకు నైరుతి ఆగమనం

▶ మొదటి పేజీ తరువాయి

రుతుపవనాలు పురోగమిస్తుండడంతో ఈ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. రుతుపవనాల పురోగమనం, రెమల్ తుఫాన్ కారణంగా ప్రస్తుతం రోహిణీ కార్తె ఉన్నా దాని ప్రభావం పెద్దగా రాష్ట్రంపై పడలేదు. స్వల్పంగానే ఉష్ణోగ్రతలు పెరిగాయి. బుధవారం పలుచోట్ల 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా పోయిమలలో అత్యధికంగా 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా చిరుమామిళ్లలో 42.5, గరికపాడులో 42 డిగ్రీలు, విజయవాడలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వచ్చే రెండు రోజులు కూడా వాతావరణం ఈ మాదిరిగానే ఉండవచ్చని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

ఒకటి నుంచి వర్షాలు

రాష్ట్రంలో జూన్ 1నుంచి వర్షాలు కురవనున్నాయి. జూన్ 1న ఏఎస్ఆర్, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, ఏఎస్ఆర్, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోను, జూన్ 2న శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, ఏఎస్ఆర్, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోను అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో గంటకు 30-40 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల పిడుగులు కూడా సంభవిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

ఈసారీ బ్యాంకు ఖాతాల్లోనే పింఛను డబ్బులు

- 65.30 లక్షల మంది లబ్ధిదారులకు రూ.1,939.39 కోట్లు విడుదల
- 47.74 లక్షల మందికి 1వ తేదీనే పింఛను డబ్బు బ్యాంకు ఖాతాల్లో జమ
- మిగిలిన 17.56 లక్షల మందికి ఇంటివద్దే పంపిణీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అవ్వాతాతలకు వచ్చే నెల నుంచి పంపిణీ చేసే పింఛన్‌ను కూడా ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయనుంది. మే నెలలో ఇంటివద్ద పింఛను పొందిన వారికి ఈసారి కూడా 1–5 తేదీల మధ్య ఇంటివద్దే ఆ డబ్బు అందిస్తారు. జూన్ ఒకటికి కొత్తగా 80 ఏళ్లు వచ్చిన వారికి కూడా ఇంటి వద్దే పింఛన్ డబ్బు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం మార్గదర్శకాలు జారీ చేశారు. ఐదేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతినెలా 1వ తేదీనే ఠంచన్‌గా పింఛన్ లబ్ధిదారులందరికీ వలంటీర్ల ద్వారా ఇంటివద్దే అందించేది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ పేరుతో టీడీపీ చేసిన ఫిర్యాదులతో వలంటీర్లను ఎన్నికల సంఘం ఈ కార్యక్రమం నుంచి దూరంగా ఉంచింది. దీంతో రెండు నెలలుగా అవ్వాతాతలు, దివ్యాంగులు, తదితరులకు అందించే పింఛన్ల పంపిణీలో మార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం.. పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. విభిన్న దివ్యాంగ వర్గానికి చెందిన లబ్ధిదారులు, తీవ్రమైన అనారోగ్యాల కారణంగా పింఛన్లు పొందుతున్న వారు, మంచం లేదా వీల్‌చైర్‌లకు పరిమితమైన వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు మాత్రం ఇంటి వద్దనే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలో పింఛను డబ్బులను పంపిణీ జరిగింది. జూన్ నెలలోనూ ఇదేవిధంగా జరగనుంది.

73% లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో జమ

రాష్ట్రవ్యాప్తంగా 65,30,808 మందికి పింఛన్లు పంపిణీ చేస్తారు. ఇందుకోసం రూ.1,939.35 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల్లో 47,74,733 మంది (73.11 శాతం)కి డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాల్లో ఒకటో తేదీనే జమ చేస్తారు. మిగిలిన 17,56,105 మంది (26.89 శాతం)కి ఇంటి వద్దే పంపిణీ చేయనున్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా పెన్షన్ పంపిణీ చేయాలని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు అందాయి. ఇతర రాష్ట్రాల కోఆపరేటివ్ బ్యాంకులలో బ్యాంకు ఖాతా ఉన్న లబ్ధిదారులకు కూడా డీబీటీ రూపంలో కాకుండా జూన్ 1 – 5 తేదీల మధ్య ఇంటి వద్దనే పంపిణీ చేస్తారు.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
భీమవరం	44.0	31.0
గుంటూరు	44.0	30.0
రెంటచింతల	43.6	31.3
రాజమహేంద్రవరం	43.0	30.0
తాడేపల్లిగూడెం	43.0	29.0
విజయవాడ	42.0	31.0
ఏలూరు	42.0	30.0
కడప	39.2	29.2
విశాఖపట్నం	38.0	31.0

ప్రాణాలు తీస్తున్న గజరాజులు

గత ఐదేళ్లలో దేశంలో 2,657 మంది మృత్యువాత



అత్యధికంగా ఒడిశాలో 542 మంది బలి

మానవులు-వన్యప్రాణుల సంఘర్షణల తగ్గింపునకు చర్యలు

కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో గత ఐదేళ్లుగా ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వివిధ రాష్ట్రాల్లో ఏనుగులు దాడి కారణంగా ఏకంగా 2,657 మంది మృత్యువాత పడ్డారని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గత ఐదేళ్లలో అంటే 2018–19 నుంచి 2022–23 వరకు దేశంలో అత్యధికంగా ఒడిశా రాష్ట్రంలో ఏనుగు దాడి కారణంగా 542 మంది ప్రాణాలు కోల్పోగా.. ఆ తర్వాత జార్ఖండ్‌లో 474 మంది మృత్యువాత పడ్డారు. మానవులు- ఏనుగుల సంఘర్షణ ఫలితంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయని, ఈ సంఘర్షణను తగ్గించే ప్రయత్నంలో భాగంగా దేశంలోని ఏనుగులు, వాటి ఆవాసాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రాయోజిత పథకం ప్రాజెక్టు ఎలిఫెంట్ కింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆర్థిక, సాంకేతిక సాయం అందిస్తున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

మానవులు-ఏనుగుల మధ్య సంఘర్షణ నివారణకు ఇప్పటివరకు 14 రాష్ట్రాల్లో 33 ఎలిఫెంట్ రిజర్వ్‌లను ఏర్పాటు చేసినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఏనుగుల కదలికల పర్యవేక్షణకు స్థానిక సంఘాలతో జంతు ట్రాకర్‌లను ఏర్పాటు చేయడంతో పాటు మానవులకు నష్టాన్ని నివారించడానికి స్థానిక ప్రజలకు హెచ్చరికలను జారీ చేస్తున్నట్లు పేర్కొంది. ఏనుగులపై ప్రతీకార హత్యల నివారణకుగాను ఆస్తి నష్టం, ప్రాణ నష్టానికి 24 గంటల్లో పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్రాలకు సూచించినట్లు తెలిపింది. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్ర గాయాల పాలైతే రెండు లక్షలు, చిన్న గాయాల చికిత్సలకు 25 వేలు చెల్లిస్తున్నట్లు వివరించింది. మానవ-వన్యప్రాణుల సంఘర్షణల హాట్ స్పాట్‌లను గుర్తించడంతో పాటు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించినట్లు వెల్లడించింది. అడవి జంతువులకు రుచించని పంటలు వేయాల్సిందిగా సూచనలిచ్చింది. పొలాల్లో ఏనుగులు, వన్యప్రాణులు ప్రవేశించకుండా ముళ్ల కంచె, బయో ఫెన్సింగ్, భౌతిక అడ్డంకులను ఏర్పాటు చేయాలని సూచించింది.

24 గంటల్లో పరిహారం

గత ఐదేళ్లలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఏనుగుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఇలా..

రాష్ట్రం పేరు	2018-19	19-20	20-21	21-22	22-23
ఆంధ్రప్రదేశ్	7	4	6	--	5
అసోం	84	75	91	63	80
ఛత్తీస్‌గఢ్	61	77	42	64	69
జార్ఖండ్	87	84	74	133	96
కర్ణాటక	12	30	26	27	39
కేరళ	27	12	20	25	22
మేఘాలయ	3	4	6	3	3
నాగాలాండ్	1	-	-	-	1
ఒడిశా	72	117	93	112	148
తమిళనాడు	47	58	57	37	43
త్రిపుర	-	2	1	2	2
ఉత్తరప్రదేశ్	-	6	1	0	4
పశ్చిమబెంగాల్	52	116	47	77	97
ఉత్తరాఖండ్	3	-	-	-	4
అరుణాచల్‌ప్రదేశ్	-	-	-	2	-
మహారాష్ట్ర	1	1	--	--	2

ఒక శక్తిమంతమైన ఆత్మ మాత్రమే ప్రేమను ఇవ్వగలదు. ఒక శక్తిమంతమైన ఆత్మ మాత్రమే వినయంగా ఉండగలదు.
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 30 మే 2024

వీర ఐపీఎల్ విజయగాథ!

దేశంలో లోక్‌సభ ఎన్నికలకు సమాంతరంగా రెండు నెలల పైగా సాగిన క్రికెట్ వేడి ఎట్టకేలకు ముగిసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ ఎడిషన్‌కు ఆదివారం నాటి ఫైనల్‌తో శుభం కార్డు పడింది. కలకత్తా నైట్ రైడర్స్ (కేకేఆర్), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)ల మధ్య చెన్నైలో జరిగిన తుది సమరం అనూహ్యంగా ఏకపక్షంగా సాగింది. తొమ్మిది ఓవర్లు మిగిలి ఉండగానే, 8 వికెట్ల తేడాతో కేకేఆర్ విజయం సాధించి, కప్ చేజిక్కించుకుంది. 2014 తర్వాత సరిగ్గా దశాబ్ద కాలపు నిరీక్షణకు తెర దించి, మూడోసారి విజేతగా నిలిచింది. ఫైనల్ చప్పగా ముగిసిందన్న మాటే కానీ, గత రెండునెలలుగా ఐపీఎల్ పట్ల జనంలో వ్యక్తమైన ఉత్సాహం, ఉద్వేగాలను తక్కువ చేయలేం. 2008లో ఆరంభమైన ఐపీఎల్ ఏయేటికాయేడు ప్రాచుర్యం పెంచుకుంటూ, ప్రస్తుతం ప్రపంచస్థాయి సంబరంగా మారింది. నరాలు తెగే ఉత్కంఠ, వినోదం అందించే ఈ పొట్టి ఫార్మట్ క్రికెట్ ఆట వీరాభిమానుల నుంచి అదాటుగా చూసేవారి దాకా అందరినీ ఆకర్షించగలుగుతోంది. అంతర్జాతీయ ఆటగాళ్ళతో కలసి ఆడడమే కాక, శిక్షణ, వ్యూహరచనల్లో భాగస్వాములు కావడంతో మన కొత్త తరం ఆటగాళ్ళు రాటుదేలడానికి కావాల్సినంత వీలు చిక్కుతోంది.

ఈసారి మొత్తం 74 మ్యాచ్‌ల ఐపీఎల్ అనేక ఆశ్చర్యాలను ఆవిష్కరించింది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సిక్సులు (1260), అత్యధిక సెంచరీలు, 9 అత్యధిక స్కోర్లలో 8 ఈ సీజన్‌లోనే వచ్చాయి. వాటిలోనూ 5 అత్యధిక స్కోర్లు ఫైనల్‌లో తలపడిన కేకేఆర్, ఎస్‌ఆర్‌హెచ్‌లు సాధించినవే! విరాట్ కోహ్లీ ఈ సీజన్‌లో 741 పరుగులు చేసి తన ఐపీఎల్ కెరీర్‌లోనే రెండో అత్యధిక పరుగుల వరద పారించాడు. అదీ కనివిని ఎరుగని 154.70 రేటుతో! ఏడు మ్యాచ్‌లలో వరుసగా 6 మ్యాచ్‌లు ఓడి, రెండే రెండు పాయింట్లు సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టు ఆపైన వరుసగా 6 మ్యాచ్‌లు భారీ తేడాతో గెలిచి, ప్లేఆఫ్ దశకు చేరడం మరో అబ్బురం. ఆశలు వదులుకోకుండా నిలబడి, కలబడితే ఏదైనా సాధ్యమనే పాఠానికి నిదర్శనం. అలాగే, అంకితభావం ఉంటే వయసనేది అడ్డంకి కాదని, గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 42 ఏళ్ళ ధోనీ గాలిలోకి 3 మీటర్లు గెంతి మరీ ఒంటిచేతితో పట్టిన విజయ్‌శంకర్ క్యాచ్ నిరూపించింది.

శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో కప్ గెలిచిన కేకేఆర్ ఈసారి సాధించిన విజయంలో గమనించాల్సిన ఒక ప్రత్యేకత ఉంది. కేకేఆర్‌లో భారత క్రికెట్ జట్టు మెగాస్టార్స్ ఎవరూ లేరు. అయినా సరే టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచింది. ఆ జట్టు పక్షాన అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్ సునీల్ నరైన్ నిజానికి మొత్తం పట్టికలో 9వ స్థానంలో ఉంటాడు. కానీ, టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి స్కోర్‌బోర్డ్‌ను పరుగులెత్తించిన తీరు, చూపిన ప్రభావం అసామాన్యం. కేకేఆర్ జట్టు కప్పు గెలిచిన గడచిన రెండుసార్లు (2012, 2014) కూడా ఆ యా సీజన్లలో అత్యధిక వికెట్లు (24, 21) తీసింది ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్‌మన్ కమ్ రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నరే! ఈ సీజన్‌లోనూ 15 వికెట్లు, 488 పరుగులు సాధించి, ముచ్చటగా మూడోసారి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్' అవార్డు అందుకున్నాడు. సునీల్ కాక మరొక్క టాప్ 20 ఆటగాడు మాత్రమే కేకేఆర్ జట్టులో కనిపిస్తాడు. అయితేనేం, ఆ జట్టు మైదానంలో జోరు కొనసాగించి, విజయతీరాలు చేరింది.

పరుగుల వరద ఎప్పటి కన్నా మరో మెట్టు పైకెక్కి బ్యాట్స్‌మన్ల రాజ్యంగా సాగిన టోర్నీ ఇది. ఈ పరిస్థితుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టే బౌలర్ లేకున్నా టాప్5 బౌలర్లలో ముగ్గురున్న కేకేఆర్ గెలుపు నమోదు చేసింది. అలాగే, కొన్నేళ్ళుగా విజయాలు రాకున్నా... ఇష్టారీతిన జట్టును మార్చేయకుండా, ఆటగాళ్ళను నమ్మి వారిని కొనసాగిస్తే అద్భుతాలు సాధ్యమేనని నిరూపించింది. పస అయిపోందని పలువురు విమర్శించినా... సునీల్, వరుణ్ చక్రవర్తి, వెంకటేశ్ అయ్యర్‌లను దీర్ఘకాలంగా జట్టులోనే అట్టిపెట్టుకుంది. ఆసిస్ పేసర్ మిషెల్ స్టార్క్ తాజా టోర్నీలో మొదట రాణించకున్నా అతణ్ణి కొనసాగించింది. అవన్నీ కీలక సమయంలో ఫలించాయి. వెరసి, పేరున్న ఆటగాళ్ళపై అతిగా ఆధారపడ్డ ఇతర ఫ్రాంఛైజీలకు కేకేఆర్ కథలో ఓ పాఠముంది. భారతజట్టులో ఆడకపోతేనేం, ప్రతిభావంతులైన యువతరంతో అద్భుతాలు చేయవచ్చని కేకేఆర్ ప్రస్థానం చాటింది.

ఆదాయంలో, ఆకర్షణలో భారత జాతీయక్రీడ హాకీ సహా అన్నింటినీ క్రికెట్ ఎన్నడో మించిపోయింది. ఐపీఎల్ దెబ్బతో స్థానిక, రాష్ట్ర స్థాయుల్లోనూ టీ20 క్రికెట్ పోటీలొచ్చాయి. మన ఐపీఎల్ మూసలో ఆస్ట్రేలియాలో బిగ్‌బాష్, సౌతాఫ్రికాలో ఎస్‌ఏ 20 లీగ్, వెస్టిండీస్‌లో కరేబియన్ ప్రీమియర్ లీగ్, పాకిస్తాన్ – బంగ్లాదేశ్ – శ్రీలంకల్లోనూ ఆ యా దేశాల ప్రీమియర్ లీగ్‌లు వచ్చేశాయి. ప్రతిభావంతులైన యువ భారతీయ క్రికెటర్ల ప్రత్యామ్నాయ కెరీర్‌కు ఇది ద్వారాలు తెరిచింది. అదే సమయంలో ఈ వెర్రి పెచ్చుమీరిన బెట్టింగ్ బెడద తెచ్చింది. బ్యాట్‌కూ బంతికీ మధ్య పోటీలో సమతూకాన్ని చెడగొట్టింది. గత 16 విడతల ఐపీఎల్ టోర్నీల్లో మొత్తం 1032 మ్యాచ్‌లు ఆడితే, వాటిలో 250 పైచిలుకు స్కోర్లు వచ్చింది రెండు, మూడు మ్యాచ్‌లలోనే. కానీ, ఈ తడవ ఏకంగా 8సార్లు అది జరిగింది. బ్యాట్స్‌మన్లదే పైచేయిగా మారుతున్న ఈ లోపాన్ని సరిదిద్దేందుకు బీసీసీఐ కొత్త రూల్‌ను ఆలోచించకపోతే కష్టమే. ఏమైనా, ఈ ఏటి ఐపీఎల్ సీజన్ ముగిసింది. రెండేళ్ళకు ఒకసారి జరిగే ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ఆదివారం మొదలవుతోంది. రోహిత్‌శర్మ జట్టులో సభ్యులైన కోహ్లీ, పంత్ తదితరులు గనక ప్రస్తుత ఐపీఎల్ ప్రతిభాప్రదర్శననే ఆ వరల్డ్ కప్‌లోనూ కొనసాగిస్తే అంతకన్నా కావాల్సింది ఏముంది! చాలాకాలంగా ఊరిస్తున్న కప్పు మళ్ళీ మన ఇంటికొస్తుంది!!

ఊపు తగ్గిన యూపీ ఎన్నికలు

2024 సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన ఏడవ దశ పోలింగ్ జూన్ 1న జరగనుంది. దేశంలో అత్యధిక ఎంపీ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో ఏడు దశల్లోనూ ఎన్నికలు జరుగుతున్నాయి. జరిగిన ఆరు దశల్లో నమోదైన అత్యల్ప ఓటింగ్ శాతం ఓటర్లలోని నిరుత్సాహాన్ని తెలియజేస్తోంది. ఎన్నికల సరళిని బట్టి బీజేపీ ఉద్దేశపూర్వకంగా తన ప్రాధాన్యాలను మార్చుకోవడం కూడా మిశ్రమ సందేశాన్ని అందిస్తోంది. అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్ఠ సమయంలో 'మోదీ హవా' కనిపించింది. కానీ అసలైన ఎన్నికల సమయం వచ్చేసరికి దాన్ని ఉదాసీనత భర్తీ చేసింది. 'ఈసారి 400 సీట్లు దాటుదాం' అన్న నినాదం ఎత్తుకోవడంతో కూడా కాషాయపార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. అయితే రాష్ట్రంలో దాదాపు అన్ని చోట్లా ప్రతిపక్షాలను, ప్రధానంగా సమాజ్‌వాదీ పార్టీని అదుపులో ఉంచడంలో మాత్రం బీజేపీ విజయం సాధించింది.

చాలామంది రాజకీయ పండితులతోపాటు, మేము మాట్లాడిన అత్యధిక సాధారణ ఓటర్ల ప్రకారం... 2014, 2019 నాటి ఎన్నికలతో పోలిస్తే, ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు ఏమంత ఉత్సాహంగా లేవు. బీజేపీ సంపూర్ణ ఆధిపత్యం, ఎటువంటి బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడం దీనికి కారణాలు. బీజేపీ ప్రధాన మద్దతుదారుల్లో ఉన్న అసంతృప్తి కూడా ఎన్నికల ఉత్సాహాన్ని తగ్గించింది. ఎన్నికల సరళిని బట్టి బీజేపీ ఉద్దేశపూర్వకంగా తన ప్రాధాన్యాలను మార్చుకోవడం కూడా మిశ్రమ సందేశాన్ని అందిస్తోంది.

ఎన్నికల తొలి దశల్లో ఓటింగ్ శాతం తగ్గుముఖం పట్టింది. అన్ని వైపులా పేలవమైన ప్రచారం, విజేత ముందుగానే తెలిసిపోవడం లాంటివి వీటికి కారణాలు. వీటన్నింటికీ మించి, ఉత్తరప్రదేశ్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలలో మరో రెండు అంశాలు గమనించదగినవి: ఒకటి, బీజేపీ తన తిరుగులేని స్థితిని సాధించిన విధానం. దీనిని మనం గుజరాత్ నమూనా ఎన్నికల ఆధిపత్యం అని పిలవొచ్చు. రెండు, 'శాంతి భద్రతల' ప్రాముఖ్యత. అందువల్లే, యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌పై ప్రశంసలు గుప్పిస్తున్నారు.

ఎప్పటిలాగే, బీజేపీ ఎన్నికల ప్రచార ఒరవడిని జాగ్రత్తగా ప్లాన్ చేశారు. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ స్పష్టంగా ఈ ప్రణాళికలో భాగమే. ఇది నిజంగానే ఉత్కంఠకు దారితీసింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలలు... బీజేపీ నాయకుడొకరు చెప్పినట్లుగా, 'ఇది గర్భధారణకు సంబంధించిన చివరి త్రైమాసికం. బూత్ స్థాయి కార్యకర్తలను ప్రసవానికి సిద్ధం చేయడంలో ఇది చాలా కీలకం'. ఈ మూడు నెలల్లో స్పష్టంగా 'మోదీ హవా' కనిపించింది. కానీ ఉత్సాహం ఒక్కసారి శిఖర స్థాయికి వెళ్లాక, అసలైన ఎన్నికల సమయం వచ్చేసరికి దాన్ని ఉదాసీనత భర్తీ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా గణనీయంగా 40–50 శాతం వరకు కూడా ఉంది. అందుకే పశ్చిమ యూపీలోని కీలకమైన యుద్ధభూమిలో ఓటింగ్ మొదటి కొన్ని దశల్లో బీజేపీ కీలక కర్తవ్యం, దాని ప్రధాన ఓటు పునాదిని ఏకీకృతం చేయడంగానే ఉండింది. 2013 అల్లర్ల నుండి స్థానికంగా ఉన్న హిందూ, ముస్లిం తగాదాల కారణంగా ఇది బీజేపీకి సులభమైన పనిగా కనిపించింది. అలాగే ముఖ్యమంత్రి కూడా బలమైన సానుకూల అంశంగా కొనసాగుతున్నారు. జాతీయ సమస్యల విషయంలో మోదీ రికార్డుపై ఓటర్లు ఆధారపడుతున్నప్పటికీ, రాష్ట్రంలో మాత్రం శాంతిభద్రతల నిర్వహణ విషయంలో యోగీ అందించిన తోడ్పాటునే ఎక్కువ పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఓటర్ల ఉత్సాహం ఉధృతంగా ఉంది. అయినప్పటికీ స్పష్టమైన ప్రభంజనం మాత్రం లేదని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే అప్పటికి సిట్టింగ్ ఎంపీలపై ఆగ్రహం రూపంలో అనేక వ్యతిరేకతలు గూడుకట్టుకుని ఉన్నాయి. ద్రవ్యోల్బణం, సంచరించే పశువుల బెడద, తప్పుడు అభ్యర్థుల ఎంపిక కారణంగా బీజేపీ మీద విసుగు చెందిన అనేక మందిని మేము చూశాము. అయినప్పటికీ ఓటు విషయానికి వస్తే, ఎక్కువ మంది తాము బీజేపీకే ఓటు వేస్తామని అంగీకరించారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుందన్న ఊహాగానాలు ఎలా ఉన్నప్పటికీ, యూపీలో బీజేపీ గుజరాతీకరణకు ప్రయత్నిస్తోంది. అంటే కుల ఇంజినీరింగ్ ద్వారా తమ ఓటు పునాదిని నిర్మించడం, ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చేయడం. బూత్, జిల్లా స్థాయుల్లో ఎంతోమంది విపక్ష నేతలు పార్టీలు మారి బీజేపీలో చేరారనేది ఆశ్చర్యం కలిగించే అంశం. రాష్ట్రంలో దాదాపు అన్ని చోట్లా ప్రతిపక్షాలను, ప్రధానంగా సమాజ్‌వాదీ పార్టీని తగ్గించడంలో బీజేపీ విజయం సాధించింది. ఇటావా, మైన్‌పురీ, కన్నౌజ్‌లలో తప్ప ఎక్కడా సమాజ్ వాదీ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్నట్లు కనిపించదు. ఇది తాజాగా 2022 అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితి నుండి కూడా స్పష్టమైన మార్పును సూచిస్తోంది.



గత కొన్ని నెలల్లో ఒక్క గోరఖ్‌పూర్ ప్రాంతంలోనే ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన దాదాపు 11,000 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారని ఒక హిందీ వార్తాపత్రిక పేర్కొంది. చెప్పాలంటే, రెండు నెలల్లో యూపీలోని 10 మంది బీఎస్పీ ఎంపీల్లో ఐదుగురు బీజేపీలో చేరారు. బీజేపీ ముఖ్యంగా ప్రతిపక్షాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలను– టికెట్ రానివారు లేదా ఏ కారణం చేతనైనా ఆయా పార్టీలలో పక్కన పెట్టిన వారిని లక్ష్యంగా చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కుశీనగర్‌లో బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన ఎస్పీ మాజీ ఎమ్మెల్యే నాథుని ప్రసాద్ కుశ్వాహా ఇటీవలే బీజేపీలో చేరారు. అదేవిధంగా, 20 19 గోరఖ్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ రోజునే బీజేపీలో చేరారు.

ఒక పార్టీగా, కొత్తగా ప్రతిపక్ష నాయకులను చేర్చుకోవడం, అదే సమయంలో సొంత కార్యకర్తలను సంతోషంగా ఉంచడం వంటి భారీ సవాళ్లను బీజేపీ ఎదుర్కొంటోంది. దీనివల్ల అనివార్యంగా బీజేపీ శ్రేణుల్లో కొంత అసంతృప్తి నెలకొంది. అలాంటి ఆగ్రహానికి గురైన ఒక కార్యకర్త 'భారతదేశంలో కాంగ్రెస్‌ను లేకుండా చేసే ప్రయత్నంలో, బీజేపీయే కాంగ్రెస్ అవుతోంది' అని వ్యాఖ్యానించారు. బలహీనమైన ప్రారంభం ఉన్నప్పటికీ, ఈ సంస్థాగతమైన తికమక బీజేపీ కంటే సమాజ్ వాదీ పార్టీనే ఎక్కువగా దెబ్బతీస్తోంది. ఎస్పీ బలహీనతను పసిగట్టిన బీజేపీ, మధ్యప్రదేశ్‌కు చెందిన యాదవ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను వ్యూహాత్మకంగా రంగంలోకి దింపింది. ఎస్పీ, ఆర్జేడీల యాదవుల ఓట్లను లాక్కోవాలని ప్రయత్నిస్తున్న బీజేపీకి యూపీ, బిహార్‌లలో మోహన్ యాదవ్ పోస్టర్ బాయ్‌గా మారారు.

యూపీలోని ప్రత్యర్థి పార్టీల ఓటర్లు, మద్దతుదారుల విషయానికి వస్తే, తమ అభ్యర్థుల గెలుపు సాధ్యం కాదని గ్రహించడంతో వారిలో ఉదాసీనత మొదలైంది. మేం సర్వే చేసిన ఒక వ్యక్తి ఇలా చెప్పారు: యోగీజీ వల్ల ముస్లింలు, యాదవుల పరిస్థితి 1990లలో బిహార్, యూపీల్లోని బ్రాహ్మణులు, క్షత్రియుల మాదిరిగా తయారైంది. బయటకు వెళ్లి ఓటు వేయడానికి వారికి ఎటువంటి ప్రేరేపకమూ లేదు. ఎందుకంటే ఇది వారికి ఎటువంటి లాభమూ చేకూర్చదు.

వాస్తవానికి యూపీలో బీజేపీని రెండు సవాళ్లు ఇబ్బంది పెడుతున్నాయి. మొదటిది, యూపీలో మొదటి రెండు దశల్లో ఓటింగ్ శాతం దాదాపు 5 శాతం తగ్గింది. డజను కంటే కొంచెం ఎక్కువ నియోజకవర్గాల్లో దాదాపు 8.9 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రతి బూత్‌లోని ఒక్కో ఓటునూ విలువైనదిగా భావించి పనిచేసే పార్టీకి ఇది ఆందోళనకరం. రెండవది, 'అబ్ కీ బార్, 400 పార్' (ఈసారి 400 సీట్లు దాటుదాం) అంటూ మోదీ ఇచ్చిన పిలుపునకు ఎదురుదెబ్బ తగిలింది. పార్టీని కొంతైనా అది వెనక్కి నెట్టింది. రిజర్వేషన్లను తగ్గించడానికి లేదా పూర్తిగా తొలగించడానికే బీజేపీ ఇంత భారీ మెజారిటీని కోరుతోందనే అత్యంత తీవ్రమైన అభియోగాన్ని ఆ పార్టీ ఎదుర్కొంటోంది (ఈ ప్రచారం 2015 బిహార్ రాష్ట్ర ఎన్నికలలో వారికి వ్యతిరేకంగా అత్యంత ప్రభావం చూపింది). ఆ సంక్షోభ తీవ్రతను తగ్గించడానికి చాలాకాలంగా ఉన్న హిందూ–ముస్లిం రగడతో సహా అందుబాటులో ఉన్న అన్ని ఆయుధాలనూ బీజేపీ సమీకరించింది.

వ్యాసకర్తలు శశాంక్ చతుర్వేది । నిర్మా విశ్వవిద్యాలయం, అహ్మదాబాద్; డేవిడ్ ఎన్ గెలినర్ । ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, ఇంగ్లండ్; సంజయ్ కుమార్ పాండే । జేఎన్‌యూ, ఢిల్లీ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెత్త ప్రవాహం



ఒకప్పుడు కెనడాకు రావాలంటే, మీకు ఇంగ్లీషో, ఫ్రెంచో వచ్చివుండాలి. నాకు కెనడా నుంచి మూడు డిగ్రీలు ఉన్నప్పటికీ కెనడా పౌరురాలు కావడానికి నా ఇంగ్లిష్ ధారాళతను చూపవలసి వచ్చింది. కొన్నిరోజులుగా ఊబర్ డ్రైవర్లను చూస్తున్నాను. వాళ్లకు ఇంగ్లిష్, ఫ్రెంచ్ ముక్క రాదు. ఆడవాళ్లు పోతుంటే గుడ్లప్పగించి చూస్తుంటారు. ఏ చెత్తను తప్పించుకోవడానికి ఇక్కడికొచ్చామో అదే చెత్త మొదలైంది. కెనడాకు మంచి వలసదారులు రావడం లేదు.

– రూపా సుబ్రమణ్య, ఆర్థికవేత్త

మధ్యలో మతమెందుకు?



పాలస్తీనాలోని నరమేధాన్ని పాకిస్తాన్‌లోని దాదాపు ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. ఇందులో పెద్ద గొంతుకలు రైట్ వింగ్ మత నాయకులవి. ఈ చర్చను అలాంటివాళ్లు తమ చేతుల్లోకి తీసుకుని, దీన్నొక మత యుద్ధంలా మార్చడాన్ని మనం అనుమతించకూడదు. ఇది వలస వాద అణచివేత. మానవత్వానికి సంబంధించినది.

– నిదా కిర్మానీ, పాక్ సోషియాలజిస్ట్

పట్టించుకోవాలి...



ఢిల్లీలో ఇవ్వాళ (మే 29) మేము 51 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో మాడిపోయాం. ఇది దేశ వ్యాప్తంగా వాతావరణ అత్యవసర పరిస్థితి. అయినా ఏ నాయకులూ, రాజకీయ పార్టీలూ పట్టించుకోవట్లేదు. మనం ఎలాంటి వాళ్లను విధాన నిర్ణేతలుగా ఎన్నుకుంటున్నాం?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

ఆందోళనకర డేటా



దేశంలో యువత నిరుద్యోగ రేటు ఆందోళనకరంగా 45.4 శాతానికి చేరిందని సీఎంఐఈ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) తాజా డేటా వెల్లడిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇది తీవ్రమైన నష్టం కలిగిస్తోంది. దేశం కోసం మనం నినాదాల వెనుక దాక్కోవద్దు. రాజకీయాలను పక్కన పెట్టి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ప్రపంచ నాయకుడు



'గాంధీ' సినిమా విడుదలకు ముందు ప్రపంచంలో ఎవరికీ మహాత్మా గాంధీ తెలియదని అంటున్నారు మోదీ. వాస్తవం ఏమిటంటే, ఆ సినిమా విడుదల కావడానికి ముందే 50 కంటే ఎక్కువ దేశాల్లో గాంధీ విగ్రహాలు ఉన్నాయి.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

గెలుపు లెక్కలు

అభిప్రాయం



ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ వైఎస్సార్‌సీపీకి అన్ని రకాల జనం 'రెండు బటన్లు' నొక్కి గెలుపును ఖాయం చేశారు. ఇందుకు కారణం కృతజ్ఞత, నమ్మకం అనే రెండు అంశాలు 2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించడమే. కనీసం 55 శాతం నుండి 60 శాతం ఓటర్లు రెండు బటన్లను నొక్కి దాదాపు 140కి పైగా అసెంబ్లీ, 22 లోక్‌సభ సీట్లతో వైఎస్సార్‌సీపీ గెలుపుకు మార్గం సుగమం చేశారు. ముఖ్యంగా సామాజిక పెన్షన్లు పొందేవారు, 'అమ్మ ఒడి' లబ్ధిదారులు, 'రైతు భరోసా' పొందేవారు, వైఎస్సార్‌సీపీ పాలనా కాలంలో పలు రకాల ఉద్యోగాలు, వాలంటీర్‌లుగా నియమింపబడిన వారు జగన్ వైపే ఉన్నారు. ఇతర వర్గాల వారు కూడా అత్యధికులు వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేశారు. ఈ నాలుగు వర్గాలవారి ఓట్లతోనే వైఎస్సార్‌సీపీ గెలిచే పరిస్థితి ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి.

పెన్షనర్లు 66.3 లక్షల మంది ఉన్నారు. వారిలో సుమారు 40 లక్షల మంది, వారి జీవిత భాగస్వాములు 20 లక్షల మంది మాత్రమే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారనుకున్నా వారి ఓట్ల సంఖ్య 60 లక్షలు అవుతుంది. అలాగే, 'రైతుభరోసా' పొందేవారు 53.58 లక్షల మంది ఉన్నారు. వారిలో సుమారు 30 లక్షల మంది, వారి జీవిత భాగస్వాములు 15 లక్షల మంది మాత్రమే వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనుకున్నా వారి ఓట్ల సంఖ్య 45 లక్షలు అవుతుంది. ఇక 'అమ్మ ఒడి' పొందేవారు 44.48 లక్షల మందిలో దాదాపు అందరి పేర్లతో ఇండ్లు వంటి పథకాలు ఇవ్వబడుతున్నాయి. వీరిలో సుమారు 30 లక్షల మంది, వారి జీవిత భాగస్వాములు 30 లక్షల మంది మాత్రమే వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనుకొన్నా వారి సంఖ్య 60 లక్షలు అవుతుంది. అలాగే వైఎస్సార్‌సీపీ ఐదేండ్ల ప్రభుత్వ కాలంలో 6.48 లక్షల మంది పైగా పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగాను, వలంటీర్లుగాను నియమితులయ్యారు. వారిలో కనీసం 5 లక్షల మందీ, వారి జీవిత భాగస్వాముల్లో 3 లక్షల మందీ, వీరితో పాటు ప్రభుత్వ ఉద్యోగుల్లో కలిపిన ఆర్టీసీ ఉద్యోగులు 52 వేలలో 30 వేల మందీ, వారి జీవిత భాగస్వాములూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారు. మొత్తంగా అన్ని రకాల ఉద్యోగులు, వలంటీర్లలో దాదాపు 10 లక్షల మంది వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఉంటారు. ఈ నాలుగు వర్గాల నుండి వైఎస్సార్‌సీపీకి పడిన ఓట్లు అతి తక్కువగా లెక్క వేసుకున్నా 175 లక్షలుగా ఉన్నాయి. అంటే ఈ ఓట్లే వైఎస్సార్‌సీపీ గెలుపుకు చాలన్న మాట. వీరుగాక ప్రభుత్వ పథకాలు పొందిన ఇతర స్త్రీలూ, యువకులూ, కులవృత్తులవారూ ఎందరో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఉంటారు. అందుకే ఆ పార్టీ గెలుపు నిర్ణయమైపోయింది అనేది! అయితే కౌంటింగ్ సమయంలో అప్రమత్తత, ప్రత్యర్థుల హింసాత్మక కుట్రపూరిత చర్యల ఎడల జాగ్రత్తలు తప్పనిసరి.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ। 9849584324

దేశపు జెండాకున్నంత పొగరున్న కవి!

సందర్భం



మాడభూషి శ్రీధర్

"నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది" అనే ఈ వాక్యాలను కలిపి చదివితే కావ్యం, భారతం, మహాభారతం,'ఆధునిక భారతం!'


"నీవు కాలేజీకి పోతుంటే బాబూ! నిన్ను పొలాలు బిక్క మొహంతో చూస్తున్నాయి. ప్రతిరోజూ ఈ పుస్తకాల ఊరేగింపు ఎందుకు? ఈ దేశపు వీధుల్లో... మీరు పలకా పుస్తకాలు పట్టుకుని పోతుంటే బాబూ! మీరు శిలువలు మోసుకుపోతున్న బాల క్రైస్తవుల్లా కనిపిస్తారు నా కళ్లకు– లే బాబూ లే, నీ బాల్యంలోంచి లే! పుస్తకాలవతల పారెయ్! నాగలి భుజాన వేసుకో! ఈ కులాలు విడిచిపెట్టు ఆ పొలాల్లో కలువ్... పొలాలు మీకు స్వేచ్ఛాదానం చేస్తాయ్. హాయిగా పీల్చే ఊపిరి కానుకగా ఇస్తాయ్, పీఠభూమిలాంటి ఛాతీనిస్తాయ్, ఇనప ఊచల్లాంటి కాళ్లిస్తాయ్!"

ఇవి గుంటూరు శేషేంద్ర శర్మ రాసిన కవితా పంక్తులు. ఆయన ప్రతి కవితా ఒక మహాకావ్యం అనవచ్చు. ఆయన కావ్యాలకు వివరణ కూడా సాధ్యం కాదు. అయితే అందులో కొన్ని వాక్యాలనైనా చదవడం అవసరం.

"దేవుణ్ని గూర్చి దీర్ఘ చర్చలు చేసేంతటి మూర్ఖులమూ కాము, ధనికులమూ కాదు. మావి పనిచేసి బ్రతకవలసిన చేతులు. నేను సత్యాగ్రాహి! సత్యం నా గుండెల్లో బద్ధలవుతున్న అగ్ని పర్వతం. నా గొంతులో గర్జిస్తున్న జలపాతం! సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు. తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు. పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు" అంటారు శేషేంద్ర ఈ పుస్తకంలో. ఆయన వాడిన మాటలు, వాక్యాలు వాడిపోని పుష్పాలు. ఆయన గురించి చెప్పేటప్పుడు వాటిని ఉటంకించడం వల్ల ఒక స్ఫూర్తి వస్తుంది. ఆయన మనసు తెలుస్తుంది. ఉదాహరణకు వీటిని చూడండి:

'ఇది నా కావ్య సంకలనం కాదు. ఇది నా కావ్యం. నా సంపూర్ణ కావ్యం. కవి అనేక కావ్యాలు రాయడు. కవి ఒకే మనిషి – ప్రవహిస్తున్న ఒకే జీవితం జీవిస్తాడు. అలాగే ఒకే కావ్యం రాస్తాడు... జీవితం ఒక యాత్ర. యాత్ర అనేక మజిలీల ప్రయాణం. దీని అర్థాంతరమే, కవి కావ్యయాత్ర అనేక కృతుల సాముదాయిక స్వరూపం. అంటే ఒక కవి తన జీవితంలో ఒకే కావ్యం రాస్తాడు. అయితే దాన్ని అప్పుడప్పుడూ క్రమక్రమంగా రాస్తూ ఉంటాడు. అలా రాయబడే ఒక్కో కృతి నిజంగా పూర్ణకృతి కోసం పుట్టే ఒక్కో పర్వం. కావ్యయాత్ర అంతిమ చరణంలో అన్ని పర్వాలూ కలిసి ఒక్క కావ్యం మాత్రమే అవుతుంది.

కనుక నేను నా జీవితంలో అనేక కావ్యాలు వ్రాయలేదు. రాసింది ఒకే కావ్యం. దాని పేరు 'నా దేశం– నా ప్రజలు'. దాని వర్తమాన నామాంతరం 'ఆధునిక మహాభారతము. ఆ కావ్యం యొక్క భాగాలు నా జీవితంలో అప్పుడప్పుడూ రాస్తూవచ్చాను. భిన్న భిన్న నామకరణాలతో ఆ భాగాల్ని అప్పుడప్పుడూ ప్రకటిస్తూ వచ్చాను. ఆ భిన్న భిన్న నామకరణాలతో అప్పుడప్పుడూ వచ్చిన ఆ భాగాలే ఈనాడు నా ప్రజలకు సమర్పిస్తున్న సంపూర్ణ కావ్యంలో పర్వాలుగా ప్రత్యక్షమవుతున్నాయి. అవి పుట్టినప్పుడు నిజంగా చివరకు రూపొందే సమగ్రకావ్యం కోసం పుట్టిన తొలి అవయవాలే గనుక ప్రతి పర్వాంతంలో ఒక పగ ఉంది. పర్వాంత గద్య. ఈ ఆధునిక మహాభారతానికి 'జనవంశ'మనే అనుబంధ కావ్యం ఒకటి ఉంది. ఇంతటితో నా కావ్యయాత్ర ముగిసింది."



ఇది మన భారతదేశానికి సంబంధించినదే కాని, పురాణం కాదు. అనేకానేక కవితల సమాహారం. 1970 – 1986 ల మధ్యకాలంలో శేషేంద్ర రాసిన వచన కవితల సమాహారం 'ఆధునిక మహాభారతం'. 'ఆంధ్రప్రభ' వారపత్రికలో పైన పేర్కొన్న ఉపోద్ఘాతంతో 'ఆధునిక మహాభారతం' సీరియల్ ప్రచురించారు. దీనికి వ్యాస మహాభారతానికి ఏ సంబంధమూ లేదు. ప్రేరణ కూడా కాదు. మొత్తం మీద ఇందులో పది పర్వాలు ఉంటాయి. ఈ కావ్యేతిహాసాన్ని కవి కుమారుడు సాత్యకి... మహా కవి శేషేంద్ర 9వ వర్ధంతి కానుకగా ఇటీవల తెలుగు సాహితీ ప్రజానీకానికి ఇచ్చారు. 'ఆలోచన, ఆవేశం,ఆధునికం' కలిసి శేషేంద్ర కవిత అవుతాయి.

'ఆధునిక భారతం' చదివితే "గులాం మనస్తత్వం కారణంగా వంగిపోయిన మోకాళ్లలో బలం వచ్చి, మనిషి కాళ్లు నిటారుగా నిలుస్తాయి. దాని పైన వంగి వంగి సలాములు చేసి చేసి వంకరటింకర్లు అయిపోయిన వెన్నెముక ఇనుప చువ్వలా నిల్చుంటుంది. సిగ్గు విడిచి తల వంచివంచి మెలిగే అలవాటు చేత సదా వేలాడే తల ఒక్కసారి భుజాలమీద లేచి నిర్భయంగా నిలబడుతుంది. మనిషి మనిషిగా మారిపోతాడు. భూగోళానికి ఇరుసు అవుతాడు" అని ఒక విమర్శకుడు అద్భుతంగా వివరించారు. "నీకెందుకింత అశాంతి, నీ కెందుకింత ఆవేశం అంటే ఏం చెప్పను? సముద్రాన్ని అడుగు నీ కెందుకింత అశాంతి అని, ఝంఝామారుతాన్ని అడుగు నీకెందుకింత ఆవేశం అని" అంటారాయన.

బాబూ మనం తుపాకుల్ని ఎదుర్కోగలం గానీ నియంతలు ప్రశ్నల్ని ఎదుర్కోలేరు.

మరికొన్నింటికి తావిస్తాం. కానీ జీవిస్తాం.

ఒరే సిద్ధాంతీ, నీ పంచాంగం కట్టిపెట్టు.

ఒరే రాజకీయ ప్రభూ నీ లౌడ్ స్పీకరు పీకేసుకో – పాత చెట్టు కూడా కొత్త పూలు పూస్తుంది.

పై నాలుగు వాక్యాలూ కలిస్తే శేషేంద్ర ఒక డైనమేట్ అని అర్థమవుతుంది.

(నేడు గుంటూరు శేషేంద్రశర్మ వర్ధంతి)

సమదృష్టి

క్షణంలో నీటి బుడగ ఏ విధంగా రూపులేకుండా పోతుందో అదే విధంగా భూమిపై మనిషి జీవితం కూడా సమసిపోతుంది. ఈ వాస్తవాన్ని మన హృదయంలో నాటుకొంటే మన జీవితం సఫలీకృతమవుతుంది. ఏ మనిషి కూడా గమ్యంలేని జీవితాన్ని గడపకూడదు. అన్ని రకాల భోగాలు అందుబాటులో ఉండటం నిజమైన ఐశ్వర్యం కాదు. ఆ విధమైన సంపదలన్నీ బంధాలే. వాని వల్ల నీకు తెలియకుండానే నిన్ను నీవు బంధించుకొంటావు. త్యాగబుద్ధిని పెంచుకోవడంలోనే నీ ఆత్మజ్ఞానం ఉంటుంది. సంపద సమకూర్చుకొని, దానితో వీడని బంధం ఏర్పరచుకోవడం కంటే... దానిని భగవంతుని ప్రసాదంగా వాడుకోవడానికి ప్రయత్నించాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నీవు దేవుని ఆరాధిస్తే నీలో దైవత్వం ప్రతిబింబిస్తుంది. మహాత్ముల, సాధువుల సాంగత్యం నిన్ను భగవంతుని ద్వారం దగ్గరకు తీసుకువెళ్తుంది.

దీనికి భిన్నంగా నీవు ఈ ప్రపంచంలో ఉన్న వస్తు సముదాయాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటే, అది నిన్ను సంసారంతో బంధించివేస్తుంది. ఆధ్యాత్మికంగా వృద్ధి చెందటానికీ, మానసిక ప్రశాంతత పొందడానికి సమత్వభావన చాలా ముఖ్యం. ఇటువంటి సల్లక్షణం పెంపొందించుకోవాలంటే, ప్రతి ఒక్కరూ నిందాస్తుతుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. జీవితం ఒక నాణెం అనుకొంటే, దానికిగల ఇరువైపుల్లో... ఒకవైపు నిందలు, రెండవవైపు స్తుతులు ఉంటాయి. నిందలను భరించడం చాలా కష్టం. కాని, పొగడ్త ప్రతి ఒక్కరికీ ఇష్టమే. ఎవరైనా పొగడితే అది చాలా ప్రియంగా ఉంటుంది. మన తప్పులను ఎత్తిచూపే వారిపై మనం ఎప్పుడూ కోపగించుకోకూడదు. ఇందుకు భిన్నంగా, మనం చేసిన తప్పులను సంతోషంగా ఒప్పుకొని, వాటిని ఎత్తిచూపే వారి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఈవిధంగా చేస్తే మనం మోస్తున్న 'అహంకారం' అనే భారం క్రమ క్రమంగా తగ్గిపోతుంది.

ప్రతి ఒక్కటీ భగవత్ప్రేరితమే అని అంగీకరించాలి. కష్టసుఖాలు రెండూ భగవంతుడు కల్పించినవే అయినా మనిషి కేవలం సుఖాలు మాత్రమే కోరుకుంటాడు. ఈ విధమైన ఆలోచన వదలాలి. వీటిని సరైన దృక్కోణం నుండి చూడాలి. కష్టాన్నయినా, సుఖాన్నయినా నీ అంతట నీవుగా ఎన్నుకోకుండా తటస్థంగా ఉండడం శ్రేయస్కరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.11.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.7.20 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.2.05 నుండి 3.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.40 వరకు తదుపరి ప.3.00 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** రా.11.04 నుండి 12.34 వరకు; **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం :** 5.29, **సూర్యాస్తమయం :** 6.26.

కోనసీమ పనసకు గిరాకీ

అంబాజీపేట మార్కెట్‌కు రోజుకు 500కు పైగా కాయలు

- జిల్లా నుంచి హైదరాబాద్‌తో పాటు పలు నగరాలకు ఎగుమతి
- ఈ ఏడాది రికార్డుస్థాయిలో దిగుబడి
- సీజన్‌లో రూ.ఏడు కోట్ల వ్యాపారం
- ఏడాది పొడవునా పనస పొట్టు



సాక్షి అమలాపురం: చూడగానే నోరూరించే పనస పంటకు కోనసీమ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తేనెలూరే రుచి ఉండే ఈ పనస తొనలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. కొబ్బరి, అరటి తరువాత కోనసీమలో పండే విలువైన పంటల్లో పనస ఒకటి. ఈ కారణంగా తూర్పు, పశ్చిమ ఏజెన్సీలలో పండే పనసకన్నా కోనసీమలో పండే పనసకు మంచి డిమాండ్ ఉంది.

79.36 ఎకరాల్లో సాగు

వేసవి వచ్చిందంటే చాలు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పనస కాయల ఎగుమతులు జోరందుకుంటాయి. జిల్లాలో డెల్టా ప్రాంతంతో పాటు గోదావరి లంక గ్రామాల్లో కొబ్బరి తోటల్లో పనస చెట్లను పెంచడం రైతులకు ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుంది. ఇక్కడ కొబ్బరి తోటల్లో మధ్యన, గట్ల మీద, సరిహద్దుల్లో పనసను రైతులు పెంచుతుంటారు. పనస మీద వచ్చే ఆదాయానికి తోడు ఏళ్ల పాటు చెట్టును పెంచితే టేకు, మద్దిక్రతో సమానంగా ఆదాయం వస్తున్నది. దీని వల్ల డెల్టా, గోదావరి లంకల్లో పనస చెట్లు గణనీయంగా ఉంటాయి. ఉద్యాన శాఖ అంచనా ప్రకారం జిల్లాలో 79.36 ఎకరాల్లో పనస సాగు జరుగుతున్నది. కానీ వాస్తవంగా కొబ్బరి తోటలు, రోడ్లు, పంట కాలువల వెంబడి చెట్లను కూడా పరిగణలోకి తీసుకుంటే ఇందుకు రెండుమూడు రెట్లు సాగు జరుగుతున్నదని అంచనా. ఏజెన్సీతో పోల్చుకుంటే డెల్టా, గోదావరి లంకల్లో పెరిగే పనస తొనల రుచి అధికం. అందుకే జిల్లా నుంచి వచ్చే పనసను కోనసీమ పనసగా చెప్పి ఇతర పట్టణాల్లో అమ్ముతుంటారు.

ఏడాది పొడవునా పనస పొట్టు

కూరల్లో వినియోగించే పనస పొట్టు ఏడాది పొడవునా కోనసీమలో దొరుకుతున్నది. ఇది కూడా ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున రవాణా జరుగుతున్నది. కేజీ పనస పొట్టు ధర రూ.175 నుంచి రూ.200 వరకు ఉంది. ఇది డిసెంబర్ నుంచి జూలై వరకు స్థానికంగా లభ్యమవుతున్నది.



సీజన్‌లో రూ.ఐదు కోట్ల ఎగుమతులు

వేసవి సీజన్‌లో జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రాంతాలకు పెద్ద ఎత్తున పనస కాయలు రవాణా అవుతుంటాయి. కొబ్బరి తరహాలోనే పనసకు సైతం అంబాజీపేట అతి పెద్ద హోల్‌సేల్ మార్కెట్. రోజుకు 500కు పైగా పనస కాయలు వస్తాయని అంచనా. కాగా, జిల్లా నుంచి రోజుకు 800 నుంచి వేయి కాయల వరకు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి పనస ఎగుమతి అవుతున్నది. మార్చి నుంచి జూలై నెల వరకు ఒక్క అంబాజీపేట నుంచే రూ.5 కోట్ల విలువైన పనస ఎగుమతి అవుతున్నదని అంచనా. మొత్తం జిల్లావ్యాప్తంగా రూ.7 కోట్ల వరకు వ్యాపారం జరుగుతున్నదని తెలుస్తున్నది.

పెరిగిన ఎగుమతులు



గతంలో కన్నా గత ఐదేళ్లగా అంబాజీపేట మార్కెట్ నుంచి ఎగుమతులు పెరిగాయి. ఎక్కువగా హైదరాబాద్, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు, తెనాలికి పనస కాయల ఎగుమతి జరుగుతున్నది. ఈ ఏడాది కాయల దిగుబడి అధికంగా ఉంది. అయితే ఎగుమతులు పెరగడం వల్ల సరుకు నిల్వ ఉండడం లేదు. మా దుకాణాల వద్ద రిటైల్ అమ్మకాలు కూడా పెరిగాయి.

– కుంపట్ల నాగేశ్వరరావు, వ్యాపారి, అంబాజీపేట

దిగుబడి పెరిగి.. ధర తగ్గింది..

గత నాలుగైదు ఏళ్ల కన్నా ఈ ఏడాది దిగుబడి అధికంగా ఉంది. చెట్టుకు సగటున 10 నుంచి 15 కాయల వరకు వస్తుంటాయి. ఈసారి 25 కాయలకు పైబడి దిగుబడిగా వస్తోంది. దీనివల్ల ధరలు తగ్గుముఖం పట్టాయి. కాయ సైజు, బరువును బట్టి రూ.100 నుంచి రూ.400 వరకు ధర ఉంటున్నది.



జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్రకు ప్రత్యేక రైలు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ భారతదేశంలోని జ్యోతిర్లింగాలు, పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలను దర్శించుకునే యాత్రికుల కోసం భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ×జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర× పేరుతో ప్రత్యేక భారత్ గౌరవ్ పర్యాటక రైలు నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 22న సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ పర్యాటక రైలు అరుణాచలం, కన్యాకుమారి, మదురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచ్చి, త్రివేండ్రం తదితర ప్రాంతాలను సందర్శించి జూన్ 30న తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటుంది. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం, రాత్రి భోజనం, పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు రోడ్డు రవాణా సదుపాయం, రాత్రుళ్లు బస ఏర్పాట్లు ఉంటాయి. సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ ప్రత్యేక రైలుకు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో యాత్రికులు ఎక్కిదిగేందుకు అవకాశం కల్పించారు. ఈ ప్యాకేజీలో ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ రూ.14,250, 3 ఏసీ రూ.21,900, 2 ఏసీ రూ.28,450గా ధర నిర్ణయించారు. ఆసక్తి కలిగిన యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ లేదా విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం గాని సెల్ : 9281495848, 8287932312 నంబర్ల ద్వారా టికెట్‌లు బుకింగ్ చేసుకోవచ్చు.

క్లుప్తంగా...

నేడు తిరుమలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక



సాక్షి, అమరావతి/తిరుమల: శ్రీవారి దర్శనార్థం కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం తిరుమలకు రానున్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి గురువారం సాయంత్రం ఆయన చేరుకుంటారు. రాత్రికి తిరుమలకు చేరుకుని వకుళామాత అతిథిగృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తిరుగు ప్రయాణం అవుతారు. అమిత్ షా రాక నేపథ్యంలో వకుళామాత అతిథిగృహం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఏరిన్ ఎలిజబెత్

తిరుమల: తిరుమల శ్రీవారిని అమెరికన్ కాన్సుల్ జనరల్ ఏరిన్ ఎలిజబెత్, సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

జొన్నగిరిలో రూ.1.75 లక్షల వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో పేదలను వజ్రాలు వరిస్తున్నాయి. జొన్నగిరిలో పొలాల్లోకి వెళ్లిన ఓ వ్యక్తికి మంగళవారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని రూ.1.75 లక్షలు, జత కమ్మలు ఇచ్చి ఓ వజ్రాల వ్యాపారి కొనుగోలు చేసినట్లు తెలిసింది.

గన్నవరం-నూజివీడు సెక్షన్‌లలో ఏబీఎస్ సిగ్నలింగ్



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో గతిశక్తి ప్రాజెక్ట్ విజయవాడ డివిజన్ బృందం రూ.31.81 కోట్లతో 21.21 కిలోమీటర్ల మేర నిత్యం రద్దీగా ఉండే గన్నవరం-పెద్ద అవుటపల్లి-తేలప్రోలు-నూజివీడు సెక్షన్‌లలో ఏడాదిలోనే అధునాతన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఏబీఎస్) వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇంతకు ముందు నిడదవోలు-కొవ్వూరు సెక్షన్‌ల మధ్య గత ఏప్రిల్‌లో ఏబీసీ సిగ్నలింగ్ వ్యవస్థను ప్రారంభించింది. దీంతో ఇప్పటి వరకు డివిజన్‌లో మొత్తం 58.91 కి.మీ ఏబీఎస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు డివిజన్‌లో విజయవాడ-గన్నవరం, విజయవాడ-కృష్ణా కెనాల్ జంక్షన్‌ల మధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో గన్నవరం-నూజివీడు సెక్షన్‌ల మధ్య అత్యంత ప్రకాశవంతమైన మొత్తం 22 ఆటోమేటిక్ సిగ్నల్స్, 2 ఏబీఎస్ హట్‌లు, గన్నవరం, పెద్దఅవుటపల్లి, తేలప్రోలు, నూజివీడు స్టేషన్‌లలో 4 ఏబీఎస్ పరికరాల హట్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏబీఎస్ వ్యవస్థ సెక్షన్‌ల మధ్య రైళ్ల కదలికను కచ్చితత్వంతో పర్యవేక్షిస్తూ మానవ తప్పిదాలు లేకుండా ఆటోమేటిక్‌గా సురక్షితమైన రైళ్ల నిర్వహణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. గతిశక్తి బృందాన్ని డీఆర్ఎం నరేంద్ర పాటిల్ అభినందించారు.

బాణం వేసి గిరిజనుడి హత్య

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదకొండలో ఘటన



చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): బాణం వేసి ఓ గిరిజనుడిని హతమార్చిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి రూరల్ మండలంలోని బెన్నవరం పంచాయతీ పెదకొండలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పెదకొండకు చెందిన వంతల సోనియా (53) గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన కాకూరి బాబ్జీ అనే యువకుడు బాణాలతో దాడి చేశాడు. ఒక బాణం నేరుగా సోనియా గుండెపై బలంగా గుచ్చుకోవడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బాణం వేసిన బాబ్జీ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న చింతపల్లి సీఐ రమేష్, అన్నవరం ఎస్ఐ రాజారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, కొండదొర కులానికి చెందిన సోనియా కుమార్తెను ఎనిమిది సంవత్సరాల కిందట భగత కులానికి చెందిన నిందితుడి సోదరుడు వివాహం చేసుకున్నాడు. సోదరుడు కులాంతర వివాహం చేసుకోవడంతో అప్పటి నుంచి ద్వేషం పెంచుకున్న బాబ్జీ సోనియాపై బాణంతో దాడి చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలిక మృతి



భవ్యశ్రీ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): స్విమ్మింగ్ పూల్‌లో సరదాగా ఈత కొడుతుండగా నీళ్లల్లో ఊపిరాడక బాలిక మృతి చెందిన హృదయ విదారక సంఘటన ఇది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట రాముడుపాళెంకు చెందిన రామయ్య, గీత దంపతుల కుమార్తె భవ్యశ్రీ (12) గంగపట్నం జెడ్పీ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతోంది. వేసవి సెలవులు నేపథ్యంలో రామయ్య తన కుమార్తెలిద్దరితో పాటు బంధువులను తీసుకుని బుధవారం నెల్లూరుకు వచ్చారు. అనంతరం ప్రశాంతినగర్ సమీపంలోని ఓ స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లారు. ఉదయం నుంచి భవ్యశ్రీ తన చెల్లెలు, చిన్నమ్మ కుమార్తెతో కలిసి సరదాగా ఈత కొట్టారు. అయితే మధ్యాహ్న సమయంలో భవ్యశ్రీ ఊపిరాడక నీటిలో మునిగిపోయింది. ఈ విషయం గమనించిన చెల్లెలు పెద్దగా కేకలు వేయడంతో స్విమ్మింగ్ పూల్ సిబ్బంది, బాలిక తండ్రి హుటాహుటిన నీటిలో నుంచి భవ్యశ్రీని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ఎం. బాబి, ఎస్ఐ చంద్రావతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హజ్‌యాత్రకు బయలుదేరిన చివరి విమానం

- గత రెండు రోజులుగా ఇక్కడి నుంచి జెడ్డాకు వెళ్లిన 644 మంది యాత్రికులు
- మూడో విమానంలో 48 మంది ప్రయాణం
- సహకరించిన అధికారులకు ప్రశంసా పత్రాలు



యాత్రికులతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్న బస్సుకు జెండా ఊపుతున్న కమిటీ సభ్యులు

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులతో చివరి విమానం బుధవారం బయలుదేరింది. గత రెండు రోజులుగా ఇక్కడి నుంచి 644 మంది హజ్ యాత్రకు వెళ్లగా, మూడవ విమానంలో 48 మంది యాత్రికులు వెళ్లారు. తొలుత వీరందరూ ఉదయం 7.10 గంటలకు ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ఈద్గా జామా మసీదు వద్ద ఏర్పాటు చేసిన క్యాంప్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో అంతర్జాతీయ టెర్మినల్‌కు చేరుకున్నారు. అనంతరం ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ తర్వాత స్పైస్‌జెట్‌కు చెందిన విమానంలో సౌదీ అరేబియాలోని జెడ్డాకు యాత్రికులు బయలుదేరి వెళ్లారు. వీరికి విమానాశ్రయంలో హజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్, కమిటీ సభ్యులు గౌస్ పీర్, పలువురు అధికారులు వీడ్కోలు పలికారు.

రాష్ట్ర హజ్ కమిటీ కృతజ్ఞతలు

హజ్-2024 యాత్రకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర హజ్ కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది. దుర్గాపురంలో ఈద్గా జామా మసీదు ఆవరణలో క్యాంప్ వద్ద సాయంత్రం హజ్‌యాత్ర సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, హజ్ ఆపరేషన్స్ చైర్మన్ హర్షవర్ధన్ మాట్లాడుతూ..రాష్ట్ర హజ్ కమిటీ, వక్ఫ్ బోర్డు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయడం వల్లే హజ్ యాత్ర విజయవంతంగా ప్రారంభమైందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం హర్షవర్ధన్‌ను హజ్ కమిటీ సభ్యులు సత్కరించారు. హజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్, సభ్యులు అలీంబాషా, గౌస్ పీర్, మస్తాన్‌వలీ, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎంఎల్‌కే రెడ్డి, డీఎస్పీలు వెంకటరత్నం, గుప్తా, జయసూర్య, సెంట్రల్ హజ్ కమిటీ సభ్యులు బిలాల్ అన్సారి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సందీప్ మెహతా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా బుధవారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి నిర్వహించే ఖడ్గమాలార్చనలో పాల్గొనేందుకు విచ్చేసిన జస్టిస్ సందీప్ మెహతా దంపతులకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. న్యాయమూర్తి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై అత్యాచారం కేసు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు సైతం నమోదు

దాబా గార్డెన్స్ (విశాఖ దక్షిణ): కింగ్ జార్జ్ ఆస్పత్రి (కేజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కేజీహెచ్ సూపరింటెండెంట్ గదిలో తనపై అత్యాచారం జరిగినట్టు అదే ఆస్పత్రిలో గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్టీ మహిళ ఈ నెల 28న ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం కేసు నమోదైంది. కోవిడ్ సెల్ నోడల్ ఆఫీసర్ కమ్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న హయాంలో సూపరింటెండెంట్‌తో తనకు పరిచయం ఏర్పడిందని, ఆ సమయంలో తరచూ లైంగికంగా వేధించారని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఏడాది జనవరి నుంచి కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన నాటి నుంచి ఆయన కేబిన్‌కు తరచూ పిలిపించుకునేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు విచారణ అనంతరం అత్యాచారం, అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. కాగా.. గతంలో బాధితురాలిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

లాంగ్ లీవ్‌లో అశోక్‌కుమార్

కాగా.. కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ దీర్ఘకాల సెలవుపై వెళ్లారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ.వాణికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. కేజీహెచ్‌లో జరుగుతున్న పలు వివాదాలకు కారకురాలిగా భావిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ భార్య, ఏఆర్ఎంవో అరుణను విమ్స్‌కు బదిలీ చేశారు.

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్

నిందితుల్లో టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి

తిరుపతి క్రైమ్: తిరుపతి ఎన్జీవో కాలనీలో వెంకటశివారెడ్డిపై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను తిరుపతి డీఎస్పీ రవి మనోహరాచారి బుధవారం వెల్లడించారు. ఆయన మాటల్లో.. ఈ నెల 25న ఎన్జీవో కాలనీలో ద్విచక్ర వాహనంపై వెంకట శివారెడ్డి (65) వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వెనుక మరో ద్విచక్ర వాహనంపై వచ్చి మొద్దు కత్తితో తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడి కుమారుడు బాలాజీ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకట శివారెడ్డి అపార్టుమెంట్‌లో ఎదురు ఫ్లాట్‌లో నివాసముంటున్న తిప్పెన గిరీష్ చంద్రారెడ్డితో వెంకటశివారెడ్డికి కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. చీటింగ్ కేసులో ముద్దాయిగా ఉన్న చంద్రారెడ్డి ఇంటికి అప్పు ఇచ్చిన వారు తరచూ వచ్చేవారు. ఇదే క్రమంలో ఎదురుగా ఉన్న వెంకటశివారెడ్డి రుణదాతలకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వండి అని సలహా ఇస్తున్నాడని చంద్రారెడ్డి ఆయనపై కక్ష పెంచుకున్నారు. దీంతో వెంకట శివారెడ్డిని హతమార్చేందుకు చంద్రారెడ్డితో పాటు టీటీడీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అతని భార్య శ్రీలక్ష్మి, వారి బంధువులు కొర్లగుంట రమేష్, తాండవం ధర్మ లింగం కేశవన్‌తో కలిసి పథకం పన్నారు. కొందరికి సుపారీ ఇచ్చి అతనిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన వెంకట శివారెడ్డి ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ కేసులో నిందితుందరినీ మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలోని అలిపిరి లింక్ బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు.

సత్యదేవుని హుండీ రాబడి రూ.1.90 కోట్లు

రికార్డు స్థాయిలో 36 రోజుల ఆదాయం



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 36 రోజులకు గాను రికార్డు స్థాయిలో రూ.1,90,41,964 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను బుధవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,84,27,716 కాగా, చిల్లర నాణేలు రూ.6,14,248 వచ్చాయని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితోబాటు బంగారం 168 గ్రాములు, వెండి 1,075 గ్రాములు వచ్చిందని ఆయన తెలిపారు. గత నెల 18 వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దేవస్థానానికి తరలి వచ్చారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల పోలింగ్ అనంతరం ప్రతీ రోజూ కూడా సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. వారంతా పెద్ద మొత్తంలో హుండీలలో కానుకలు సమర్పించడంతో రికార్డు స్థాయిలో రోజుకు సరాసరిన రూ.5,28,943 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

హుండీల ద్వారా విదేశీ కరెన్సీ ...

సత్యదేవుని హుండీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికా డాలర్లు 83, ఖతార్ రియల్స్ 12, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్‌లు 20, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు ఐదు, ఆస్ట్రేలియా డాలర్లు 18, మలేషియా రింగిట్ ఒకటి, ఒమన్ బైసాలు వంద, థాయ్‌లాండ్ బాత్స్ 20 లభించాయి. హుండీ లెక్కింపులో డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు, దేవస్థానం సిబ్బందితో బాటు పలు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగచేశారు.

నేడు స్వామివారి నిజరూప దర్శనం

గురువారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుడు (శివలింగాకారం) ఎటువంటి అలంకరణ లేకుండా శిలారూపంలో భక్తులకు నిజరూప దర్శనమివ్వనున్నారు.

బాలికపై టీడీపీ యువనేత లైంగిక దాడి

శాంతిపురం (చిత్తూరు జిల్లా): వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చిన మైనర్ బాలికపై తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు లైంగికదాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని కెనమాకులపల్లిలోని తన అమ్మమ్మ ఇంటికి బెంగళూరు నుంచి బాలిక (17) వచ్చింది. అదే గ్రామానికి చెందిన తెలుగు యువత పంచాయతీ మాజీ అధ్యక్షుడు కుమార్ (35) మాయమాటలు చెప్పి రెండు రోజుల క్రితం శాంతిపురంలో ఉన్న తమ కమర్షియల్ భవనంపై ఉన్న గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధిత బాలిక దిశ హెల్ప్ లైనుకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన టీడీపీ నాయకులు రాజీ చేసేందుకు సకల యత్నాలు చేశారు. కానీ తనకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని బాధితురాలు పట్టుబట్టడంతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బుధవారం నిందితుడు కుమార్‌ని అదుపులోకి తీసుకున్నారు. కేసును కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి విచారణ చేస్తున్నారు.

కబళించిన నల్లమడ కాలువ

- బాపట్ల జిల్లా నల్లమడ డ్రెయిన్‌లో నలుగురు గల్లంతు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. ఇద్దరి కోసం గాలింపు
- బంధువుల ఇంటికొచ్చి.. అనంత లోకాలకు



గల్లంతైన వారికోసం గాలింపు

బాపట్ల టౌన్: వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చి సరదాగా గడుపుదామనుకున్న వ్యక్తులు మార్గ మధ్యంలోనే కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ ఘటన బాపట్ల జిల్లా అప్పికట్ల శివారులో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణం, క్రిష్టియన్‌పేటకు చెందిన దొరబడి సునీల్ కొన్నేళ్ళ క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వేసవి సెలవులకు కుటుంబ సమేతంగా బంధువులను కలిసేందుకు పొన్నూరు మండలం వడ్డిముక్కల గ్రామానికి వచ్చారు. అక్కడి నుంచి బుధవారం ఉదయం పర్చూరు మండలం వీరన్నపాలెంలోని బంధువులను కలిసేందుకు 12 మంది వాహనంలో బయల్దేరారు. మార్గమధ్యంలో బాపట్ల మార్గంలోని నల్లమడ డ్రెయిన్‌లో స్నానాలు చేసేందుకు వాహనాన్ని నిలిపి నలుగురు కాలువలోకి దిగారు. వారిలో అను రాజ్ అలియాస్ సన్ని (11) కాలువలోకి దిగిన వెంటనే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సన్నిని కాపాడేందుకు అతని తండ్రి సునీల్ కుమార్ (37) కూడా నీటిలో దూకాడు. వారికి ఈత రాకపోవడంతో ఇద్దరూ కాలువలో మునిగిపోయారు. వారిని కాపాడేందుకు పక్కనే ఉన్న నందు, కిరణ్‌లు కాలువలో దిగడంతో వారు కూడా కొట్టుకుపోయారు. రెప్పపాటులో జరిగిన ఈ ఉదంతంతో సంఘటనా స్థలం రోదనలతో మిన్నంటింది. గల్లంతయిన వారిలో తండ్రి కొడుకుల (అనురాజ్, సునీల్ కుమార్) మృతదేహాలు కాలువలో లభ్యమయ్యాయి. నందు, కిరణ్‌ల కోసం డిఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రూరల్ సీఐ శ్రీహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అనురాజ్, సునీల్‌కుమార్ మృతదేహాలు



గల్లంతైన నందు, కిరణ్ (ఫైల్)

బీజేపీ, అధికార బీజేడీ మధ్య నువ్వా నేనా అన్నట్టుగా హోరాహోరీ పోరు సాగుతున్న ఒడిశాలో ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుతోంది. 15 లోక్‌సభ, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఇప్పటికే ముగిసింది. చివరి దశలో భాగంగా మిగతా 6 లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. వీటిలో 4 బీజేడీ, 2 బీజేపీ సిట్టింగ్ స్థానాలు. వాటిపై ఫోకస్...



ఒడిశాలో రసవత్తర పోటీ

బీజేడీ, బీజేపీ హోరాహోరీ

6 స్థానాలకు శనివారం పోలింగ్

జగత్‌సింగ్‌పూర్

ఇక్కడ రెండు దశాబ్దాలుగా బీజేడీ చక్రం తిప్పుతోంది. బీజేపీ ఖాతా తెరవలేదు. 2019లో భారీ మెజారిటీతో నెగ్గిన రాజశ్రీ మల్లిక్ బీజేడీ నుంచి, ఆయన చేతిలో ఓడిన బిబూ ప్రసాద్ తరాయ్ బీజేపీ నుంచి మళ్లీ బరిలో ఉన్నారు. తరాయ్ 2009లో సీపీఐ నుంచి, 2014లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. ఆయన ఓటు బ్యాంకును చూసి బీజేపీ మరోసారి చాన్సిచ్చినట్టు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి రవీంద్ర కుమార్ సేథీ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు బీజేడీలోకి చేరడం ఆ పార్టీకి అనుకూలించే అంశం.

జజ్‌పూర్

బీజేడీ నుంచి సిట్టింగ్ ఎంపీ శర్మిష్ఠ సేథీ మళ్లీ బరిలో ఉన్నారు. రవీంద్ర నారాయణ బెహరాకు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ ఆంచల్ దాస్ పోటీ చేస్తున్నారు. ఆయన 1996లో ఇక్కడ జనతాదళ్ నుంచి గెలిచారు. గత ఐదేళ్లలో బీజేపీ ఓటు బ్యాంక్ బాగా పెరిగిందన్న ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. అయితే పార్టీ అభ్యర్థి బెహరా స్థానికులకు పరిచయస్తుడే అయినా రాజకీయాలకు కొత్త.

బరిలో కోటీశ్వరులు

ఒడిశాలో తుది విడత బరిలో ఉన్న 66 మంది అభ్యర్థుల్లో 20 మంది కోటీశ్వరులే. కేంద్రపర బీజేపీ అభ్యర్థి బైజయంత్ పాండాకు అత్యధికంగా రూ.148 కోట్లున్నాయి. తర్వాత స్వతంత్ర అభ్యర్థి శ్రీరామ్ పాండే రూ.18.23 కోట్లు, భద్రక్ బీజేపీ ఎంపీ మంజులత మండల్‌కు రూ.14.86 కోట్ల ఆస్తులున్నాయి. 15 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వీరిలో 10 మంది తీవ్ర కేసుల్లో నిందితులని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) పేర్కొంది.

కేంద్రపర

ఇది బీజేడీ కంచుకోట. ఈసారి మాత్రం బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయి. 2009, 2014ల్లో బీజేడీ నుంచి గెలిచిన బైజయంత్ పాండా గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగి బీజేడీ నేత, సినీ నటుడు అనుభవ్ మహంతి చేతిలో ఓటమి చవిచూశారు. ఒకప్పుడు సీఎం నవీన్ పట్నాయక్‌కు అత్యంత సన్నిహితుడైన బైజయంత్ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుని హోదాలో మరోసారి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ అనుభవ్ మహంతి కూడా బీజేపీలో చేరడంతో బీజేడీ సంకట స్థితిలో పడింది. అన్షుమన్ మహంతిని పోటీకి దింపింది.

మయూర్‌భంజ్

సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు స్థానంలో ఎమ్మెల్యే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సన్నిహితుడు నాబా చరణ్ మఝికి ఈసారి బీజేపీ టికెటిచ్చింది. ద్రౌపది ముర్ము 2009లో ఈ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఐదుసార్లు ఎమ్మెల్యే అయిన విద్యా శాఖ మంత్రి సుదమ్ మరాండీని బీజేడీ బరిలో దింపింది. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సోదరి అంజని సోరెన్ జేఎంఎం తరఫున పోటీలో ఉండటంతో త్రిముఖ పోటీ నెలకొంది.

భద్రక్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సమల్ భద్రక్ లోక్‌సభ స్థానం పరిధిలోని చాంద్‌బలి అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తున్నారు. దాంతో భద్రక్‌లో గెలుపు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ నుంచి కేంద్ర మాజీ మంత్రి అరుణ్ చరణ్ సేథీ కుమారుడు అవిమన్యు సేథీ పోటీ చేస్తున్నారు. బీజేడీ నుంచి సిట్టింగ్ ఎంపీ మంజులతా మండల్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ అనంత ప్రసాద్ సేథీ బరిలో ఉన్నారు.

బాలాసోర్

బీజేపీ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి మళ్లీ బరిలో ఉన్నారు. బీజేడీ నుంచి మాజీ బీజేపీ నేత లేఖశ్రీ సమంత సింగార్ పోటీ చేస్తున్నారు. పార్టీని అస్తమానం విమర్శించే లేఖశ్రీకి టికెటివ్వడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. నిజానికి కందమాల్ నుంచి బీజేపీ తరఫున పోటీకి లేఖశ్రీ ఆసక్తి చూపారు. నీలగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని అధిష్టానం సూచించడంతో బీజేడీలో చేరారు. కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ కుమార్ జెనా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి మూడుసార్లు గెలిచిన కరబేల స్వైన్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు పార్టీలకూ సవాలు విసురుతున్నారు.

52.9 డిగ్రీలు.. నిజమేనా!?

ఢిల్లీలో నమోదైందన్న ఐఎండీ

నిర్ధారణ కాలేదన్న కేంద్ర మంత్రి రిజిజు

సెన్సర్లను పరిశీలిస్తున్న నిపుణులు

ఎండలకు అల్లాడుతున్న ఉత్తరాది

రాజస్తాన్‌లో 50 డిగ్రీలపైనే

ఉత్తరాది రాష్ట్రాలకు రెడ్ అలర్టులు



సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరాదిలో ఎండల తీవ్రత నానాటికీ పెరుగుతోంది. బుధవారం రాజస్తాన్‌లో పలుచోట్ల ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటేసింది. పాకిస్తాన్ మీదుగా అక్కడి నుంచి వీస్తున్న తీవ్రమైన వేడి గాలులతో దేశ రాజధాని అల్లాడుతోంది. దాంతో వరుసగా రెండో రోజు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ క్రమంలో ఢిల్లీ సమీపంలోని ముంగేశ్‌పూర్‌లో దేశ చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైందంటూ వచ్చిన వార్తలు కలకలం రేపాయి. మధ్యాహ్నం 2.30 సమయంలో అక్కడ 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు భారత వాతావరణ శాఖ ప్రాంతీయ డైరెక్టర్ కుల్‌దీప్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మన దేశంలో రాజస్తాన్ సహా ఏ రాష్ట్రంలోనూ ఇప్పటిదాకా ఇంతటి ఉష్ణోగ్రతలు నమోదవలేదు. అయితే 52.9 డిగ్రీలన్నది అధికారికంగా నిర్ధారణ కాలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ''ఢిల్లీలో అంత ఉష్ణోగ్రత నమోదైందంటే నమ్మశక్యంగా లేదు. వాస్తవమేమిటో తెలుసుకోవాలని ఐఎండీ అధికారులకు సూచించాం. దీనిపై త్వరలో స్పష్టత వస్తుంది'' అంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. దాంతో నిజానిజాలను పరిశీలిస్తున్నట్టు ఐఎండీ డైరెక్టర్ జనరల్ ఎం.మహాపాత్ర తెలిపారు.



''డేటాలో తప్పులు దొర్లి ఉండొచ్చు. అంతటి ఉష్ణోగ్రత నిజమే అయితే స్థానిక పరిస్థితులేవైనా కారణమై ఉండొచ్చు. ముంగేశ్‌పూర్ వాతావరణ కేంద్ర సెన్సర్లను స్పెషలిస్టుల బృందం నిశితంగా అధ్యయనం చేస్తోంది'' అని వివరించారు. బుధవారం రాజస్తాన్‌లోని ఫలోదీలో 51 డిగ్రీలు, పరిసర ప్రాంతాల్లో 50.8 డిగ్రీలు, హరియాణాలోని సిర్సాలో 50.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఢిల్లీలోని నజఫ్‌గఢ్‌లో 49.1 డిగ్రీలు, పుసాలో 49, నరేలాలో 48.4 డిగ్రీలు నమోదైంది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్‌లో ప్రాంతంలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడ గత 79 ఏళ్లలో ఇదే అత్యధికం. హరియాణా, పంజాబ్, రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ కూడా ఎండ దెబ్బకు అల్లాడుతున్నాయి. హీట్ వేవ్ నేపథ్యంలో ఢిల్లీతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు రెడ్ అలెర్ట్ జారీ అయింది. ఎండలకు తోడు తీవ్రస్థాయిలో వడగాలులు వీస్తున్నాయి. దాంతో జనం బయటకు రావాలంటే వణికిపోతున్నారు. నిత్యం లక్షలాది వాహనాలతో రద్దీగా ఉండే ఢిల్లీ రోడ్లు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం దాకా నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

రికార్డు విద్యుత్ డిమాండ్

ఎండల ధాటికి ఢిల్లీలో విద్యుత్ డిమాండ్ చుక్కలనంటుతోంది. బుధవారం మధ్యాహ్నం 3.36 గంటలకు 8,302 మెగావాట్ల పవర్ డిమాండ్ నమోదైంది. ఇది ఢిల్లీ చరిత్రలోనే రికార్డని డిస్కం అధికారులు చెప్పారు.

సాయంత్రం భారీ వర్షం

ఢిల్లీలో బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన రెండు గంటల తర్వాత వర్షం ప్రారంభమైంది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

రెండు, మూడు రోజుల్లో వర్షాలు

అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం నేపథ్యంలో వాయువ్యం నుండి తూర్పు దిశగా వీచే గాలుల కారణంగా గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఐఎండీ తెలిపింది. వచ్చే రెండు, మూడు రోజుల్లో ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, ఢిల్లీ, హరియాణా రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది.

రుద్ర క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: ఆకాశంలో నుంచి భూమి పైనున్న లక్ష్యాలపైకి ప్రయోగించే రుద్ర ఎం–2 మిస్సైల్‌ను భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం నుంచి ఎస్‌యూ–30 ఫైటర్ జెట్ ద్వారా ప్రయోగించిన రుద్ర నిర్దేశించిన అన్ని లక్ష్యాలను అందుకుందని రక్షణమంత్రిత్వ శాఖ వెల్లడించింది. రుద్ర ఎం–2 మిస్సైల్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. డీఆర్‌డీఓకు చెందిన పలు లాబోరేటరీలు రూపొందించిన సాంకేతికతలను ఇందులో వాడారు. నేలపై ఉన్న పలురకాల శత్రు లక్ష్యాలను ఛేదించేందుకు రుద్ర క్షిపణిని అభివృద్ధి చేశారు. రుద్ర ఎం–2ను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌ను రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. రుద్ర ఎం–2 క్షిపణి పరీక్ష విజయవంతం కావడం భారత సాయుధబలగాల బలాన్ని రెట్టింపు చేస్తుందని పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

సాక్షి, న్యూఢిల్లీ: మధ్యంతర బెయిలు పొడిగింపు విషయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మధ్యంతర బెయిలును ఏడురోజులు పొడిగించాలంటూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిలు కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛను కేజ్రీవాల్‌కు ఇచ్చిన నేపథ్యంలో బెయిలు పొడిగింపు పిటిషన్ మెయింటైనబుల్ కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతోపాటు తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు కూడా రిజర్వులో ఉందని అందువల్ల తాజా పిటిషన్ ప్రధాన పిటిషన్‌కు సంబంధం ఉండదని తెలిపింది. ఈ మేరకు కేజ్రీవాల్ పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ ముందు జాబితా చేయడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అనుమతించలేదు. మరోవైపు, సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిలు గడువు పూర్తి అయిన తర్వాత జూన్ 2న కేజ్రీవాల్ సరెండర్ కావాల్సి ఉంది.

ప్రజ్వల్‌కు ముందస్తు బెయిల్ తిరస్కరణ

బెంగళూరు: పలువురు మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలను ఎదుర్కొంటున్న, ఒక అత్యాచారం కేసులో నిందితుడైన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. తన న్యాయవాది అరుణ్ ద్వారా ప్రజ్వల్ ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తోసిపుచ్చింది. లైంగిక వేధింపుల వీడియోలు బయటికి రావడంతో హసన్‌లో ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు, ఏప్రిల్ 27న ప్రజ్వల్ జర్మనీకి వెళ్లిపోయారు. అప్పటినుంచి అజ్ఞాతంలో ఉన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విజ్ఞప్తి మేరకు ఈనెల 18న ప్రజాప్రతినిధుల కోర్టు ప్రజ్వల్ రేవణ్ణపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ప్రజ్వల్ ఈనెల 30న జర్మనీలోని మ్యూనిచ్ నుంచి బెంగళూరుకు విమానం టికెట్‌ను బుక్ చేసుకున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. 31న వేకువజామున బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే ప్రజ్వల్‌ను సిట్ అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం

- బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో లోయలో పడిన బస్సు
- 28 మంది దుర్మరణం.. 22 మందికి గాయాలు

కరాచీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో బుధవారం ఘోరప్రమాదం సంభవించింది. పలువురు మహిళలు, చిన్నారులు సహా మొత్తం 28 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 22 మంది గాయపడ్డారు. మరికొందరు క్షేమంగా బయటపడ్డారు. తుర్బాత్ నుంచి క్వెట్టాకు 50 మందికిపైగా ప్రయాణికులతో బయలుదేరిన ఈ బస్సు వషూక్ పట్టణం సమీపంలో అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాకు 700 కిలోమీటర్ల ఈ దూరంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. ఆరుగురు ప్రయాణికులు ఘటనా స్థలంలోనే మృతి చెందారని, మరో 22 మంది ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించారని వెల్లడించారు. రహదారిపై మూలమలుపు వద్ద బస్సు టైర్ పేలిపోయిందని, బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు.

బీజేపీకి 295 -305 సీట్లు

- కాంగ్రెస్‌కు 55-65 సీట్లు
- బెట్టింగ్ మార్కెట్ వర్గాల అంచనా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల చివరి దశ పోలింగ్‌కు ప్రచారం నేటితో ముగుస్తుండటంతో ఇప్పటిదాకా జరిగిన ఆరు దశల పోలింగ్, ప్రచారసరళిని బట్టి తాజా లెక్కల ప్రకారం బీజేపీకి 295 -305 సీట్లు రావొచ్చని బెట్టింగ్ మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. కాంగ్రెస్ ఈసారి 55-65 సీట్లు సాధించవచ్చు అని ఆయా వర్గాలు విశ్లేషించాయి. బీజేపీ జనంలోకి బాగా ప్రాచుర్యం కల్పించేందుకు ప్రయత్నించిన 'ఈసారి 400 సీట్లు' నినాదం పనిచేయకపోవచ్చని బెట్టింగ్ మార్కెట్ ఊహిస్తోంది. బీజేపీకి ఈసారి 400 సీట్లు కష్టమని, అయినాసరే ఈసారి బీజేపీయే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ఆయా వర్గాలు వెల్లడించాయి. '' తొలి దశ ఎన్నికల ముందు వరకు బీజేపీ ఎక్కువ చోట్ల గెలుస్తుందన్న అంచనాలుండేవి. బీజేపీ 315-325 వరకు, కాంగ్రెస్ 45-55 వరకు గెలవచ్చు అని తొలుత భావించాం. కానీ మూడు దశలు ముగిశాక చూస్తే బీజేపీ 270-280 వరకు, కాంగ్రెస్ 70-80 వరకు గెలవచ్చు అని అంచనాలొచ్చాయి. ప్రస్తుతం చూస్తే బీజేపీ 295-305 వరకు, కాంగ్రెస్ 55-65 వరకు సీట్లు గెలువొచ్చు'' అని ముంబైలో ఉండే ఒక కీలకమైన బుకీ బుధవారం చెప్పారు. '' బీజేపీ 400 కాదుకదా కనీసం 350 గెలుస్తుందని ఏనాడూ బెట్టింగ్‌లో గణాంకాలు రాలేదు. ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రూ.8-9 లక్షల కోట్ల మేర బెట్టింగ్ జరుగుతోంది' మరో బుకీ వెల్లడించారు. ఎన్‌డీఏ కూటమి మహారాష్ట్రలో 28 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లో 64-66 స్థానాలు కైవసం చేసుకోవచ్చని తెలిపారు. గుజరాత్‌లో బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని అంచనా వేశారు.

వాళ్లను చంపేయండి!

- ఇజ్రాయెల్ క్షిపణిపై నిక్కీ హేలీ సందేశం
- వెల్లువెత్తిన విమర్శలు

టెల్ అవీవ్: అమాయక పాలస్తీనియన్లపై విచక్షణారహితంగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ సైన్యానికి అమెరికా నేతలు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపే ఫొటో ఒకటి బహిర్గతమైంది. శాంతికాముక ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా సేవలందించిన రిపబ్లికన్ పార్టీ నాయకురాలు నిక్కీ హేలీ హమాస్‌పై ఇజ్రాయెల్ దాడికి పూర్తి మద్దతు పలుకుతూ ఒక మిస్సైల్‌పై తన సందేశం రాశారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ లెబనాన్ సరిహద్దు వెంట ఇజ్రాయెల్ స్థావరాలకు వెళ్లారు. గాజా స్ట్రిప్‌పై గగనతల దాడికి సిద్ధంగా ఉంచిన ఒక క్షిపణిపై 'వాళ్లను చంపేయండి. అమెరికా ఎల్లప్పుడూ ఇజ్రాయెల్‌కు తోడుగా ఉంటుంది' అని రాసి సంతకం చేశారు. అయితే దేశాన్ని శాంతియుతంగా పాలిస్తానంటూ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన నాయకురాలు ఇలా యుద్ధజ్వాలలు మరింత రగిలించడమేంటి? అంటూ నెటిజన్లు నిక్కీ హేలీపై విమర్శలు గుప్పించారు.



క్షిపణిపై సంతకం చేస్తున్న నిక్కీ. ఇన్‌సెట్‌లో సందేశం

బ్రిజ్‌భూషణ్ తనయుడి కాన్వాయ్ బీభత్సం

- జనం మీదకు దూసుకెళ్లడంతో ఇద్దరు యువకుల దుర్మరణం
- కైసర్‌గంజ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కరణ్ భూషణ్ సింగ్

గోండా(ఉత్తరప్రదేశ్): మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపుల ఆరోపణలపై దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన వివాదాస్పద బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మరోసారి పతాక శీర్షికలకెక్కారు. ఆయన కుమారుడు, కైసర్‌గంజ్ బీజేపీ అభ్యర్థి కరణ్ భూషణ్ సింగ్‌కు చెందిన వాహనశ్రేణి ఢీకొనడంతో రెహాన్ ఖాన్(17), షెహ్‌జాద్ ఖాన్(20) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 60 ఏళ్ల మహిళ గాయపడ్డారు. బుధవారం ఉత్తర ప్రదేశ్‌లోని గోండా జిల్లాలోని కల్నర్‌గంజ్–హుజూర్‌పూర్ రోడ్డులోని వైకుంఠ్ డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ఘటన జరిగింది. మెడిసిన్ తీసుకొద్దామని బయటికెళ్లిన రెహాన్, షెహ్‌జాద్‌లపై కారు దూసుకెళ్లిందని రెహాన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఘటనాస్థలిలో కారు వదిలేసి అందులోని వారు పారిపోయారు. తర్వాత పోలీసులు కారు డ్రైవర్ లవ్‌కుశ్ శ్రీవాస్తవ్‌ను అరెస్ట్‌చేశారు. ''ఘటన జరిగినపుడు ఆ కాన్వాయ్‌లో నాలుగు వాహనాలు ఉన్నాయి. మొదటి కారులో కరన్ భూషణ్ ఉన్నారు. చివరి కారు అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న వారిని ఢీకొట్టింది' అని అదనపు ఎస్పీ రాధేశ్యామ్ రాయ్ చెప్పారు. ఇద్దరు స్థానికులు మరణించడంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఆ రోడ్డులో వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. జనం మీదకు కారును పోనిచ్చిన ఉదంతంలో నిందితులకు శిక్షపడేలా చేయాలని డిమాండ్‌చేశారు. దీంతో శాంతిభద్రతల సమస్యను నివారించేందుకు పోలీసులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగి అక్కడ మొహరించారు. స్థానికులపైకి ఎస్‌యూవీ వాహనం పోనిచ్చిన ఘటనలో ఇద్దరి మృతదేహాలను పోస్ట్‌మార్టమ్ అనంతరం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. గాయపడిన వృద్ధురాలికి ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు.

తండ్రిని తప్పించి తనయుడికి టికెట్

ఉమెన్ రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో ప్రమేయముందన్న ఆరోపణపై బీజేపీ ఈసారి బ్రిజ్‌భూషణ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వలేదు. తన సమీప ప్రాంతాల జిల్లాల్లో బ్రిజ్‌భూషణ్‌కు మంచి ప్రాభల్యం ఉంది. అందుకే ఈసారి బ్రిజ్‌భూషణ్‌కు పక్కనపెట్టి ఆయన కుమారుడు కరణ్‌కు ఎంపీ టికెట్ ఇచ్చింది. ప్రమాదం జరిగిన తెల్ల ఎస్‌యూవీ కారు కరణ్ కుటుంబానికి చెందిన నందినినగర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ పేరిట రిజిస్టర్ అయి ఉంది.

కోడ్ ఉల్లంఘనే

మీడియాలో ప్రసారం కాకుండా చర్యలు తీసుకోండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన 48 గంటల ధ్యానంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఏడో విడత పోలింగ్ ముందు ప్రధానమంత్రి ధ్యానం చేయడం ముమ్మాటికీ ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో గురువారం నుంచి రెండు రోజులపాటు మోదీ ధ్యానం చేయనున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని టీవీ మీడియాలో ప్రసారం చేయకుండా, ప్రింట్ మీడియాలో ప్రచురించకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు రణదీప్ సూర్జేవాలా, అభిషేక్ సింఘ్వీ, సయీద్ నజీర్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

ధ్యానం చేస్తూ ఎవరైనా కెమెరా తీసుకెళ్తారా?: మమత

బారూయ్‌పూర్(పశ్చిమబెంగాల్): వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధాని మోదీ చేయబోయే ధ్యానంపై టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ అనుమానం వ్యక్తంచేశారు. మంగళవారం పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ నియోజకవర్గంలో టీఎంసీ ఎన్నికల ప్రచార ర్యాలీలో మమత ప్రసంగించారు. '' మేం ఖచ్చితంగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తాం. ఆయన ధ్యానం చేసుకోవాలనుకుంటే చేసుకోమనండి. కానీ ఆయన మెడిటేషన్ చేస్తున్నపుడు టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారాలు చేస్తే ఒప్పుకోం. ధ్యానం చేసేందుకు వెళ్తూ ఎవరైనా కెమెరా వెంట తీసుకెళ్తారా?'' అని అన్నారు.

బెంగాల్‌లోకి అక్రమ వలసలు

- సరిహద్దు ప్రాంతాల్లో జనాభా స్థితిగతుల్లో మార్పులు
- యువత అవకాశాలను కాజేస్తున్న చొరబాటుదార్లు
- తృణమూల్ సర్కారుపై మోదీ ధ్వజం

కాక్‌ద్వీప్/మయూర్‌భంజ్/బాలాసోర్: 'వికసిత్ భారత్' సాకారం కావాలంటే 'వికసిత్ బెంగాల్' కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోకి అక్రమ వలసలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో జనాభా స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయని, స్థానిక యువతకు దక్కాల్సిన అవకాశాలను చొరబాటుదార్లు కాజేస్తున్నారని ఆరోపించారు. ప్రజల భూములను, ఆస్తులను లాక్కుంటున్నారని, ఇది తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం పాకులాడుతోందని, అసలైన ఓబీసీల హక్కులను ముస్లింలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ముస్లింలకు ఓబీసీల పేరిట తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు జారిచేస్తోందని విమర్శించారు. బెంగాల్‌లోకి అక్రమ చొరబాట్లను ప్రోత్సహిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకులు పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం పశ్చిమ బెంగాల్‌లోని కాక్‌ద్వీప్, ఒడిశాలోని మయూర్‌భంజ్, బాలాసోర్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధానమంత్రి మాట్లాడారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...



దేశ భద్రతను పణంగా పెడుతున్నారు

''ఇతర దేశాల్లో మత హింస కారణంగా వలస వచ్చిన హిందువులకు, మతువాలకు భారత పౌరసత్వం ఇవ్వడాన్ని తృణమూల్ కాంగ్రెస్ నిస్సిగ్గుగా వ్యతిరేకిస్తోంది. సమాజంలో ఓ వర్గాన్ని మచ్చిక చేసుకోవడానికి రాజ్యాంగంపై దాడి చేస్తోంది. ముస్లింలకు ఓబీసీ హోదా కల్పించడాన్ని కలకత్తా హైకోర్టు రద్దు చేసింది. కానీ, కోర్టు తీర్పును తృణమూల్ కాంగ్రెస్ అంగీకరించడం లేదు. ఈ తీర్పుపై తప్పుడు ప్రచారం చేస్తోంది. ముస్లింలను తప్పుదోవ పట్టిస్తోంది. దేశ భద్రతను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పణంగా పెడుతోంది. అక్రమ చొరబాట్లపై చర్యలు తీసుకోవడం లేదు.

నవీన్ పట్నాయక్ అనారోగ్యం వెనుక కుట్ర!

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆరోగ్యంగా హఠాత్తుగా క్షీణించిందని చెబుతున్నారు. గత ఏడాది కాలంగా ఆయన ఆరోగ్య పరిస్థితి దిగజారుతున్నట్లు వార్తలొస్తున్నాయి. దీనివెనుక ఏదైనా కుట్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నవీన్ పట్నాయక్ తరఫున ప్రస్తుతం ఒడిశా ప్రభుత్వాన్ని నడిపిస్తున్న బలమైన లాబీ ఈ కుట్రకు తెరతీసిందా? అనే సందేహాలు లేకపోలేదు. నవీన్ బాబు ఆరోగ్యం క్షీణించడం వెనుక మిస్టరీ ఏమిటో బయటపడాలి. ఒడిశాలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నవీన్ పట్నాయక్ ఆరోగ్యం హఠాత్తుగా క్షీణించడంపై కారణాలు తెలుసుకోవడానికి ఒక కమిటీ ఏర్పాటు చేస్తాం''. అని మోదీ స్పష్టం చేశారు.

నా ఆరోగ్యం భేషుగ్గా ఉంది: నవీన్ పట్నాయక్

తన ఆరోగ్యం క్షీణించడం వెనుక కుట్ర ఉందంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలను ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఖండించారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని, గత నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నానని వెల్లడించారు. ఈ మేరకు ఆయన బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మాదకద్రవ్యాల మహమ్మారి వీడట్లేదు

రాహుల్ గాంధీ వ్యాఖ్య

చండీగఢ్: ఇన్నేళ్లు గడుస్తున్నా పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య అలాగే తిష్టవేసిందని, మహమ్మారిపై కఠిన చర్యల యుద్ధం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. బుధవారం లూథియానా కాంగ్రెస్ అభ్యర్థి అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తరఫున దఖా ప్రాంతంలో, పటియాలా అభ్యర్థి ధరమ్‌వీర్ గాంధీ తరఫున పటియాలాలో రాహుల్ ప్రసంగించారు. పంజాబ్‌లో పొత్తులేకుండా ఆప్, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీచేస్తున్న నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ పనితీరును రాహుల్ విమర్శించారు. ''డ్రగ్స్ సమస్య రాష్ట్రంలో ఎప్పటినుంచో ఉంది. అది ఈ మధ్య మరీ ఎక్కువైంది. డ్రగ్స్ సంస్కృతికి కఠిన చర్యలతో చరమగీతం పాడాల్సిందే'' అన్నారు.

మోదీని 11వ అవతారం అంటారేమో: ఖర్గే

బాలాసోర్/ భద్రక్: బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని భగవంతుడు విష్ణు పదకొండో అవతారంగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని, దేశ ప్రజలు దీనిని ఆమోదించరని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ''రాముడు, కృష్ణుడు, వామనుడు.. ఇలా విష్ణువు దశావతారాలు దాల్చినట్టు విన్నాం. ఇప్పుడు మోదీని పదకొండో అవతారంగా చూపించే ప్రయత్నం జరుగుతోంది'' అని బుధవారం ఒడిశాలో ఎన్నికల సభల్లో ఖర్గే అన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 30 : మే : 2024

ఖాతా రద్దీ



బుధవారం బెంగళూరులో ప్రధాన పోస్టాఫీసులో ఖాతాలు తెరవడానికి వచ్చిన మహిళలు. కేంద్ర పథకాల ద్వారా నగదు పడుతుందనే ప్రచారమే ఇందుకు కారణమైంది

న్యూస్‌రీల్

చిక్కలో వరుసగా మిస్సింగ్‌లు



శిల్ప, తేజస్విని (ఫైల్)

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం తాలూకా నంది గ్రామంలో ఓ అమ్మాయి, కల్లుకుంటి గ్రామంలో మరో యువతి అదృశ్యం కావడం సంచలనం కలిగిస్తోంది. జిల్లాలో ఇటీవల అమ్మాయిల మిస్సింగ్ కేసులు పెరుగుతుండడంపై ప్రజలు కలవరం చెందుతున్నారు. వివరాలు.. నంది గ్రామానికి చెందిన శిల్ప (23) ఓ ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. ఈ నెల 23వ తేదీ నుంచి ఆమె కనబడడం లేదు. అలాగే కల్లుకుంటివాసి తేజస్విని (20) బీఏ రెండో ఏడాది చదువుతోంది. ఆమె కూడా రెండు రోజులుగా జాడ లేదు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిస్తే తెలియజేయాలని చిక్కబళ్లాపురం పోలీసులు విజ్ఞప్తి చేశారు.

బీజేపీకి 22 సీట్లు ఖాయం: యడ్డి

శివమొగ్గ: ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 20–22 స్థానాల్లో విజయం సాధించబోతోందని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప జోస్యం చెప్పారు. శివమొగ్గలోని స్వగృహంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ సర్జికి ప్రజల్లో మంచి పేరుందని, పరిషత్ ఎన్నికల్లోనూ అధిక స్థానాలను దక్కించుకుంటామని చెప్పారు. పార్టీ మాజీ ఎమ్మెల్యే రఘుపతి భట్ నైరుతి పట్టభద్రుల నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ, ప్రజలే మంచి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఇక వాల్మీకి అభివృద్ధి నిగమ మండలి అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్య ఒక దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకుని, ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

యశవంతపుర: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పేల్చేస్తామని బెదిరింపు వచ్చింది. ఎయిర్‌పోర్టు అధికారుల పాలనా భవనం, సిబ్బంది ఉంటున్న భవనాన్ని బాంబులతో పేల్చేస్తామని అక్కడ బాత్‌రూంలోని ఒక అద్దంపై రాసి ఉంది. అది చూసినవారు అధికారులకు చెప్పగా, తక్షణం విమానాశ్రయ సిబ్బంది, పోలీసులు జాగిలాలతో తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి పేలుడు వస్తువులు దొరకలేదు.

ప్రారంభం రోజునే బడికి తాళం

యశవంతపుర: పాఠశాల ప్రారంభం రోజునే బడికి తాళం వేసిన ఘటన బెళగావి జిల్లా తంగడగిలో జరిగింది. వివరాలు...గ్రామంలోని పాఠశాల ముఖ్యోపాధ్యాయుడు ఎంఎస్ చౌగలెని బదిలీ చేయాలని ఎస్‌డీఎంసీ గతంలో తీర్మానించింది. అయితే వేసవి సెలవులు రావడంతో అధికారులు ఆయనపై చర్యలు తీసుకోలేదు. కాగా బుధవారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో గదులను శుభ్రం చేయాలని ఉపాధ్యాయులు వచ్చారు. కానీ ఎస్‌డీఎంసీ సభ్యులు వచ్చి బడికి తాళం వేసుకొని వెళ్లారు. అధికారులు వచ్చి పాఠశాలను పరిశీలించారు. ముఖ్యోపాధ్యాయుడిని బదిలీ చేయాలని ఎస్‌డీఎంసీ కమిటీ సభ్యులు డిమాండ్ చేయగా ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి సర్దిచెప్పారు. అనంతరం బడికి తాళం తెరిపించారు.

బీసీ మోర్చా నిరసన



మండ్య: వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ కోటాను తగ్గించి అందులోని వాటాను ముస్లింలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి సిద్ధమైందని బీజేపీ బీసీ మోర్చా ఆరోపించింది. దీనిపై మోర్చా కార్యకర్తలు ఇండియా కూటమిని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ముందు బుధవారం ధర్నా చేశారు. జేసీ సర్కిల్ నుంచి నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా సాగారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించరాదని డిమాండ్ చేశారు.

ఎస్ఐ సస్పెన్షన్

మండ్య: బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించడంలో నిర్లక్ష్యం చేసిన నాగమంగల తాలూకా బెళ్లూరు ఎస్ఐ బసవరాజు చించోళిని ఎస్పీ ఎన్. యతీశ్ బుధవారం సస్పెండ్ చేశారు. ఈనెల 25న అభిలాష్ అనే వ్యక్తి బైక్‌లో వెళ్తుండగా యువకుల గుంపు బైక్‌లో వచ్చి ఢీ కొట్టింది. దీన్ని ప్రశ్నించిన సమయంలో మాటల యుద్ధం జరిగి అభిలాష్‌పై దాడికి పాల్పడ్డారు. పైగా అభిలాష్ ఇంటికి వెళ్లి బెదిరించారు. ఘటనపై ఫిర్యాదు చేసేందుకు బాధితుడు తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బెళ్లూరు పోలీసు స్టేషన్ వెళ్లాడు. అయితే ఫిర్యాదు తీసుకోకుండా ఎస్ఐ బసవరాజు నిర్లక్ష్యం చేశారు. దీంతో బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

కామాంధుల వికృతక్రీడ

అవసరాన్ని, అసహాయతను అలుసుగా చేసుకొని కామాంధులు రెచ్చిపోతున్నారు. ప్రజలకు అండగా ఉండాల్సిన పంచాయతీ అధ్యక్షురాలి కొడుకు, స్నేహితుని ముసుగులో ఓ యువకుడు, చదువులు చెప్పాల్సిన ప్రధానోపాధ్యాయుడు కామంతో తెగించారు. మహిళలు, బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. హెడ్మాస్టర్ దాష్టీకం వల్ల బాలిక ఏకంగా గర్భవతి అయ్యింది. రాష్ట్రంలో వేర్వేరు చోట్ల ఈ ఘోరాలు వెలుగుచూశాయి.





రాష్ట్రంలో ఒకేరోజు పలుచోట్ల వనితలపై అఘాయిత్యాలు

- చామరాజనగర, దక్షిణ కన్నడలో అత్యాచారాలు, వీడియోలు
- శిడ్లఘట్టలో బాలికపై హెడ్‌మాస్టర్ అకృత్యం
- రాష్ట్రంలో ఘోరకృత్యాలు



నిందితుడు వైదేశ్

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకా పొన్నాచి గ్రామ పంచాయతీ అధ్యక్షురాని కుమారుడు అత్యాచారానికి పాల్పడినట్లు మహదేశ్వర బెట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పొన్నాచి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నీలాంబిక కొడుకు వైదేశ్ (29) నిందితుడు. వివరాలు.. 25 ఏళ్ల మహిళ ఇంటి స్థలం కావాలని వెళ్లగా వైదేశ్ ఆమె ఫోన్ నంబర్ తీసుకున్నాడు. ఫోన్ చేసి లైంగికంగా సహకరిస్తేనే ఇంటిని త్వరగా ఇప్పిస్తానని చెప్పగా ఆమె నిరాకరించింది. మరోసారి వెళ్లినప్పుడు దుస్తులు విప్పాలని బలవంతంగా వేధించాడని తెలిపింది. చివరికి ఇంటి కోసం తాను మనస్సు చంపుకొని అంగీకరించినట్లు పేర్కొంది. తనను లైంగికంగా వినియోగించుకుని .. మొబైల్‌తో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించి బెదిరించాడని, తాను ఎంత వేడుకున్నా డిలిట్ చేయలేదని తెలిపింది. ఆ ఫోటోలు, వీడియోలను పెట్టుకుని తన అన్న, భర్తకు పంపిస్తానని , సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరింపులకు పాల్పడి తరచూ అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. శివమ్మ, బసమ్మణి, వైదేశ్‌లు తన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి తన పరువుకు భంగం కలిగించారని వీరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మహదేశ్వర బెట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

ఆస్పత్రికి తీసుకెళ్లాలని...

చికిత్స కోసం తీసుకెళ్లిన మహిళపై ఓ కీచకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. దక్షిణ కన్నడ జిల్లా కద్రిలో ఈ సంఘటన జరిగింది. వివరాలు... ఒక మహిళ అనారోగ్యానికి గురి కాగా, తెలిసిన వ్యక్తి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆమెపై అత్యాచారం చేసి నగ్నపోటోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడసాగాడు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో ఆవేదన చెందిన బాధితురాలు కద్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేరళకు చెందిన సజిత్ (32)ను బుధవారం అరెస్ట్‌చేసి విచారణ చేపట్టారు. ఇతడు ఓ ప్రైవేటు ఆసుపత్రి, హోటల్‌లో మహిళపై తరచూ లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది.

హెడ్‌మాస్టర్ వల్ల బాలికకు గర్భం



హెడ్‌మాస్టర్ వెంకటేశ్

చిక్కబళ్లాపురం: ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థినిని భయపెట్టి తరచూ అత్యాచారానికి పాల్పడుతున్న కామాంధ హెడ్‌మాస్టర్‌ని పోలీసులు అరెస్టు చేశారు. చిక్కబళ్లాపురం జిల్లాలోని శిడ్లఘట్ట తాలూకాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్ (47) నిందితుడు. తన పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలికపై కన్నేసి ఆమెను భయపెట్టి తన గదిలోనే అత్యాచారానికి పాల్పడుతూ ఉన్నాడు. బాలిక గర్భం దాల్చడంతో అనారోగ్యానికి గురైంది. తల్లిదండ్రులు ఏమైందోనని ఆస్పత్రికి తీసుకెళ్లగా 3 నెలల గర్భవతి అని వైద్యులు తెలిపారు. బాలికను ప్రశ్నించగా హెచ్‌ఎం వెంకటేశ్ దారుణాల గురించి వివరించింది. పోలీసులు బాలిక నుంచి వివరాలను నమోదు చేశారు. కేసు నమోదు చేసి కామాంధున్ని అరెస్టు చేశారు. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చిన దుర్మార్గున్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి.

అమ్మో.. భారీ ఉడుము





బెంగళూరు టిన్ ఫ్యాక్టరీ వద్ద పట్టుబడిన ఉడుము

కృష్ణరాజపురం: ఉద్యాన నగరంలో పెద్ద ఉడుమును వన్యజీవి సంరక్షకులు క్షేమంగా పట్టుకున్నారు. ఉడుము మాంసాన్ని ఆరగించేవారికి దొరకక ముందే దానిని రక్షించారు. కేఆర్ పురం వద్ద టిన్‌ఫ్యాక్టరీ దగ్గర పెద్ద ఉడుము కనిపించింది. సమాచారం అందుకున్న వన్యజీవి సంరక్షకుడు కుమార్, అతని బృందం గాలించి దానిని క్షేమంగా పట్టుకుని అటవీ సిబ్బందికి అందజేశారు. ఇది చాలా పెద్ద సైజులో, టీవీలలో చూపించే కొమొడొ డ్రాగన్ మాదిరిగా ఉందని తెలిపారు. ఇలాంటివి ఇక్కడ దొరకడం చాలా అరుదని, వన్యజీవులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. మాంసం కోసం ఉడుములను చంపడం తగదని చెప్పారు.

మహారాష్ట్రలో స్కానింగ్.. కర్ణాటకలో గర్భవిచ్ఛిత్తి

- రాష్ట్రంలో ఆగని భ్రూణహత్యలు
- ఒక మహిళకు గర్భస్రావం చేస్తుండగా మృతి

యశవంతపుర: భ్రూణహత్యలకు అంతం లేకుండా ఉంది. మండ్యలో జరిగిన భ్రూణహత్యల ఉదంతం మరువకముందే బాగలకోటెలో అలాంటి ఘోరం వెలుగు చూసింది. మహారాష్ట్రలో స్కానింగ్ చేసి, రాష్ట్రంలో గర్భవిచ్ఛిత్తి చేస్తున్నట్లు మహారాష్ట్ర పోలీసులు బాగలకోటె పోలీసులకు సమాచారం ఇచ్చారు. సాంగ్లి కొల్లాపురకు చెందిన సోనాలి (33) అనే గర్భిణికి స్కానింగ్ చేయగా ఆడ శిశువు ఉన్నట్లు కనుగొన్నారు. మహాలింగపుర పట్టణంలోని ఆస్పత్రిలో కవిత అనే మాజీ ఆయా సోనాలిని తన ఇంటికి తీసుకెళ్లి గర్భవిచ్ఛిత్తికి యత్నించింది. అధికంగా రక్తస్రావం కావటంతో సోనాలి మృతి చెందింది. మృతదేహాన్ని సాంగ్లి జిల్లాకు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మీరజ్ పోలీసులు తనిఖీ చేయగా ఈ ఉదంతం వెలుగు చూసినట్లు మహారాష్ట్ర ఉప పోలీసు ఉన్నతధికారి అణ్ణాసాహేబ్ జాధవ్ తెలిపారు.

మోసకారి అధికారి

మైసూరు: మహిళా, శిశు సంక్షేమ శాఖలో మీ కూతురికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ప్రభుత్వ అధికారి ఒకరు మహిళను మోసం చేశాడు. మైసూరు విజయనగరలో మహిళ, శిశు సంక్షేమ శాఖలో అధికారి కె.సోమయ్యకు.. మైసూరు కొప్పలూరు నివాసి, గ్రామ పంచాయతీ మాజీ సభ్యురాలు అయిన కమలాక్షితో పరిచయం ఉంది. మూడేళ్ల క్రితం ఫోన్ చేసి మీ కూతురికి మా శాఖలో క్లర్కు ఉద్యోగం ఇప్పిస్తానని, ఇందుకు రూ. 10 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. ఆమె సరేనని రూ. 7 లక్షలను ఇచ్చింది. ఏళ్ల గడిచిన ఉద్యోగం ఊసు లేదు, డబ్బులూ తిరిగి ఇవ్వలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన కమలాక్షి.. విజయనగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఆర్‌బీఐ ఇంజినీరు ఇంట్లో లూటీ

మైసూరు: ఇంటి తలుపులు పగులగొట్టి బంగారు నగలతో పాటు రూ. 8.97 లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. ఈ ఘటన మైసూరు మేటగళ్లి లోకనాయకనగరలో జరిగింది. ఆర్‌బీఐలో ఇంజినీర్‌గా పని చేసే ఎం.కార్తీక్ పాఠశాలలకు సెలవులు కావడంతో చెన్నైలో ఉండే తన ఇద్దరు పిల్లలను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా దొంగతనం జరిగి ఉంది. రూ. 18.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, వెండి వస్తువులు, ఇంకా విలువైన సామాగ్రిని దొంగలు దోచుకెళ్లారు. మేటగళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీఐ అరెస్ట్

బనశంకరి: బిట్‌కాయిన్ కుంభకోణానికి సంబంధించి సీఐ చంద్రధర్‌ను బుధవారం సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. 2015లో కెంపేగౌడనగర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో శ్రీకిని అరెస్టుచేయగా బిట్‌కాయిన్ కేసు వెలుగులోకి వచ్చింది. 2020లో సుమారు రూ.వెయ్యి కోట్ల కుంభకోణం వెలుగు చూసింది.

ఘనంగా అంబరీశ్ జయంతి



యశవంతపుర: కన్నడ సినీ రంగంలో, రాజకీయాల్లో రెబెల్ స్టార్‌గా పేరుగాంచిన దివంగత నటుడు అంబరీశ్ 72వ జయంతిని బుధవారం అభిమానులు, కుటుంబసభ్యులు ఘనంగా జరుపుకొన్నారు. సతీమణి సుమలత, తనయుడు అభిషేక్‌లు బెంగళూరు కంఠీరవ స్టూడియోలోని అంబరీశ్ సమాధికి పూజలు చేశారు. అనేకమంది చిత్ర ప్రముఖులు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. అంబరీశ్ అప్పాజీ శాశ్వతంగా అందరి మనస్సులో ఉంటాడని నటుడు దర్శన్ స్మరించుకున్నారు.

వంచక జంటకు సంకెళ్లు

- రూ. 30 కోట్ల వసూలు స్కాం..

యశవంతపుర: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు అని నమ్మించి జనం నుంచి రూ. కోట్లు వసూలు చేసిన దంపతులను కలబురగి పోలీసులు అరెస్ట్ చేశారు. క్యాపిటల్ గ్రీ లర్న్ ట్రేడింగ్ సంస్థను స్థాపించిన ఉత్కృష్ణ వర్ధమానె, భార్య సావిత్రిని కలబురగి జెఎంఎఫ్‌సి–2లో హాజరు పరచగా 14 రోజుల పాటు జుడిషియల్ కస్టడీ విధించింది. ఇద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించి స్థానిక జైలుకు తరలించారు. అధిక లాభాల పేరుతో ప్రజల నుంచి రూ.30 కోట్ల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. ఉపాధ్యాయుడు వీరేశ భీమాశంకర ఇచ్చిన ఫిర్యాదుతో రోజా ఏరియా పోలీసులు దంపతులను అరెస్ట్ చేశారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేశారు.



దంపతులను కోర్టుకు తీసుకొచ్చిన దృశ్యం

కాసరగోడులో లవ్ జిహాద్?

యశవంతపుర: మంగళూరు వద్ద కేరళ సరిహద్దుల్లో కాసరగోడులోని ప్రైవేట్ స్కూలులో టీచర్ అయిన నేహా, యువకుడు తన్వీర్ మిర్ధాద్‌లు ప్రేమించుకుని కొన్ని రోజుల కిందట వెళ్లిపోయారు. ఇప్పుడు స్థానిక పోలీసుల ముందు హాజరయ్యారు. నేహ ఇష్ట ప్రకారం ప్రేమించి అతనితో వెళ్లిపోయినట్లు చెప్పింది. తాము 25న రిజిస్టర్ పెళ్లి చేసుకున్నట్లు పత్రాలను చూపించారు. ఇది లవ్ జిహాద్ అని, ఒక వర్గం అమ్మాయిలను టార్గెట్ చేశారని హిందూ సంఘాల నేతలు ఆరోపించారు. తమ కూతురిని తమతో పంపాలని తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు. కానీ ఆమె ప్రియునితోనే ఉంటానని స్పష్టంచేసింది.



తన్వీర్, నేహా



బీన్స్ చాలెంజ్: బెంగళూరు కేఆర్ మార్కెట్లో కేజీ రూ.120 పలికిన బీన్స్. వీటిని కొనడం ఒక సవాలే

మైసూరులో స్నాచింగ్.. నాగ్‌పూర్‌లో పట్టివేత

మైసూరు: మైసూరులో వివిధ ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన దొంగని మహారాష్ట్రలో నగర పోలీసులు అరెస్టు చేశారు. టెలికాం లేఔట్ నివాసి మధుర అనే మహిళ మెడలోని గొలుసును ఓ దొంగ లాక్కెళ్లాడు. ఆమె గొలుసును పట్టుకోవడంతో సగం తెగిపోయి 30 గ్రాములు భాగం దొంగ చేతికి దొరికింది. ఈ ఘటనపై మధుర సరస్వతిపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీటీవీ, ఇతర మూలాల ద్వారా పోలీసులు దర్యాప్తు చేయగా ఆ దొంగ మహారాష్ట్రకు పారిపోయినట్లు తెలిసింది. అంతే కాకుండా మైసూరులో 50కి పైగా క్రిమినల్ కేసులు అతనిపై ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల బృందం ఒకటి నాగ్‌పూర్‌కు వెళ్లి దొంగను అరెస్టు చేసి తీసుకొచ్చారు.

విమానాశ్రయంలోనే అరెస్టుకు ప్లాన్

- ఎంపీ ప్రజ్వల్ కోసం వేచి ఉన్న సిట్ బృందాలు





ఎంపీ ప్రజ్వల్ రాకపై కొనసాగుతున్న సస్పెన్స్

బనశంకరి: అత్యాచారం, అశ్లీల వీడియోల కేసులో ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాగానే అరెస్ట్ చేయడానికి సిట్ అధికారులు బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మకాం పెట్టారు. విదేశాల్లో తలదాచుకున్న ప్రజ్వల్ 31వ తేదీ ఉదయం 10.30 కు సిట్ ముందు హాజరుఅవుతానని వీడియోలో చెప్పగానే అలజడి ఆరంభమైంది. వచ్చీరాగానే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో దేశంలోనే ఎక్కడైనా తలదాచుకోవచ్చని సిట్ అనుమానిస్తోంది. లుఫ్తాన్సా విమానంలో బిజినెస్ క్లాస్‌లో ప్రజ్వల్ టికెట్ బుక్ చేసుకున్నారు. ఈ విమానం కెంపేగౌడ విమానాశ్రయంలోని టెర్మినల్–2లోకి వస్తుంది. విమానం నుంచి దిగి ఇమ్మిగ్రెంట్ డెస్క్‌కు వచ్చి పాస్‌పోర్టుపై స్టాంప్ వేసుకోవాలి. ప్రస్తుతం లుక్‌అవుట్ నోటీస్ అమల్లో ఉండటంతో ఇమ్మిగ్రెంట్ అధికారులు ప్రజ్వల్ ను అక్కడే అదుపులోకి తీసుకుంటారు. తరువాత సిట్ పోలీసులు సంప్రదింపులు జరిపి అరెస్టు ప్రక్రియ చేపడతారు. దీంతో లుఫ్తాన్సా విమానాల్లో వచ్చే ప్రయాణికులపై సిట్ బృందాలు నిఘా వేసి ఉంచాయి.

బెయిలు అర్జీ వాయిదా

ఎంపీ ప్రజ్వల్‌కు ముందస్తు బెయిల్ కోసం ఆయన వకీళ్లు బుధవారం బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు విచారణను 31వ తేదీకి వాయిదా వేసింది. మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ కావాలని కోరారు.

హంగేరి నుంచి ఆ వీడియో

31వ తేదీన సిట్ ముందు హాజరవుతానని ప్రజ్వల్ 27వ తేదీన వీడియో విడుదల చేయడం తెలిసిందే. ఈ వీడియో ఎక్కడి నుంచి విడుదల చేశారనేది సిట్ కనిపెట్టింది. యూరప్‌లోని హంగేరి దేశం నుంచి వీడియో విడుదలైంది. మొబైల్ ఐపీ అడ్రస్‌ను బట్టి కనిపెట్టింది. వీడియో రికార్డు చేసిన చేసిన రెండు రోజుల తరువాత వదిలారని పేర్కొంది.

నవీన్, చేతన్‌లకు సిట్ కస్టడీ

ప్రజ్వల్ వీడియోల పెన్‌డ్రైవ్‌ను తయారుచేసి లీక్ చేశారనే కేసులో అరెస్టు చేసిన నవీన్‌గౌడ, చేతన్‌కు మూడురోజుల పాటు సిట్ కస్టడీకి బుధవారం హాసన్ 2వ అదనపు సివిల్, జెఎంఎఫ్‌సీ కోర్టు అనుమతించింది. దీంతో వారిద్దరినీ విచారించి పెన్‌డ్రైవ్ పూర్వాపరాలపై సిట్ వివరాలు సేకరించనుంది.

సిట్ ఎదురుచూస్తోంది: హోంమంత్రి

ఎంపీ ప్రజ్వల్ బెంగళూరు విమానాశ్రయంలోకి అడుగుపెట్టగానే సిట్ అధికారులు అరెస్ట్ చేస్తారని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. బుధవారం నగరంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ వారంటు ఉన్నందున సిట్ అధికారులు విమానాశ్రయంలో వేచి చూస్తున్నారని, రాగానే అరెస్టు తథ్యమని చెప్పారు. పెన్‌డ్రైవ్ కేసులో ఏ పార్టీ వారున్నా అరెస్ట్ చేస్తామని చెప్పారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో అక్రమ నగదు బదిలీ కేసులో మంత్రి నాగేంద్ర రాజీనామా చేసే అవసరం లేదు. బీజేపీ నేతలు అన్నింటికీ రాజీనామా అడుగుతారు, దీనిపై విచారణ జరుగుతుంది, నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన అధికారి చంద్రశేఖర్ ఎక్కడా మంత్రి నాగేంద్ర పేరు చెప్పలేదని అన్నారు.

ప్రజ్వల్ దిండు, పరుపు సీజ్

ఎంపీ ప్రజ్వల్ అత్యాచారం, అశ్లీల వీడియోల కేసులో సిట్ పోలీసులు హాసన్, హొళెనరసిపురలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీలు చేశారు. హాసన్‌లో ఎంపీ ప్రజ్వల్ నివాసం, హొళెనరసిపురలో హెచ్‌డీ.రేవణ్ణ నివాసాన్ని పరిశీలించారు. సిట్, ఫోరెన్సిక్ అధికారులు కొత్త సాక్ష్యాధారాల కోసం గాలింపు జరిపారు. ప్రజ్వల్ ఇంట్లో బెడ్, దిండు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

అధికారుల బదిలీపై నిరసన



ఆందోళన చేస్తున్న మహిళలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ జిల్లాలో నియమితులైన ఐఏఎఫ్, ఐపీఎస్, కేఏఎస్, జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేయడం తగదని గ్రామీణ కూలీ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన సంచాలకుడు బసవరాజ్ మాట్లాడారు. వరి పండించే, విద్యుత్ అందించే జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు తమ లాభం కోసం అధికారులను బదిలీ చేసి నూతన అధికారులు జిల్లా విషయాలను అర్థం చేసుకొనే లోపే వారిని బదిలీ చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధికారులను బదిలీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి

హుబ్లీ: బైక్ అదుపు తప్పి వంతెనను ఢీకొనడంతో భారతీయ నౌకాదళానికి చెందిన సైనికుడు ఘటన స్థలంలోనే మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జిల్లాలోని నవలగుంద తాలూకా అణ్ణిగేరి పట్టణ సమీపంలోని అరెరా వంతెన వద్ద జరిగింది. మృతుడిని తెలంగాణకు చెందిన సైనికుడు మారడ్డి సందీపరెడ్డి(26)గా గుర్తించారు. ఈయన గదగ్ నుంచి అణ్ణిగేరి మీదుగా హుబ్లీకి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనపై అణ్ణిగేరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వీల్‌చైర్ల పంపిణీ



లబ్ధిదారుడికి వీల్‌చైర్ పంపిణీ చేసిన దృశ్యం

బళ్లారిఅర్బన్: శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ద్వారా జిల్లాలోని సండూరు తాలూకా కురేకుప్ప గ్రామంలో జయవర్ధన, బడా పీరాసాబ్ అనే దివ్యాంగులకు బుధవారం సంస్థ జిల్లా డైరెక్టర్ రోహితాక్ష రెండు వీల్‌చైర్లను అందజేశారు. కౌన్సిలర్ కల్లు గుడియప్ప, హొసగేరప్ప, యోజనాధికారి సతీష్, అధ్యక్షురాలు లక్ష్మమ్మ, పదాధికారిణి శ్యామల, సేవా ప్రతినిధి విజయలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.


పర్యావరణాన్ని కాపాడదాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి శ్రీనివాస్ నవలి తదితరులు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడదామని కలబుర్గి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ నవలి పిలుపునిచ్చారు. బుధవారం కలబుర్గి సేట్ శంకర్ లాల్ న్యాయ శాస్త్ర కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులు తమ ఇంటి చుట్టుపక్కల మొక్కలు నాటాలన్నారు. మంచి గాలి, వాతావరణం, వర్షాలు కురవడానికి వీలు ఉంటుందన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇల్లు కట్టేవారు చెట్లు పెంచకుండా నిర్లక్ష్యంతో నేడు వేడి అధికమైందన్నారు. విజయపుర మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం అధికారి మహేష్, సేట్ శంకర్ లాల్, న్యాయ శాస్త్ర కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి, జ్యోతి, లక్ష్మి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రామానుజాచార్యుల జయంతి



రామానుజాచార్యుల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: మంగళవాడ గ్రామంలో బుధవారం రామానుజాచార్యుల జయంతి కన్నుల పండువగా జరిగింది. తుమకూరు రామానుజ సహకార సంఘం ప్రముఖుడు చెలువయ్య మాట్లాడారు. రామానుజ తత్త్వ, సిద్ధాంతాలను మనమంతా పాటించాలన్నారు. ఎలాంటి జాతి, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా అందరూ ముక్తి మార్గంలో నడవాలని సూచించిన మహాన్ యోగి అని కొనియాడారు. జిల్లా డైరెక్టర్ రఘునాథ్ మాట్లాడుతూ.. అస్పృశ్యతను సమాజం నుంచి పారద్రోలిన మహానుభావుడు రామానుజాచార్యులు అన్నారు. అనంతరం రామానుజాచార్యుల చిత్రపటాన్ని ఊరేగించారు.

జోరుగా సిలిండర్ రీఫిల్లింగ్ దందా

- కానరాని భద్రతా ప్రమాణాలు
- అప్రమత్తంగా లేని అధికారులు
- స్థానికుల సమాచారంతో దాడులు

కేజీఎఫ్: నగరంలో సిలిండర్ రీఫిల్లింగ్ దందా జోరుగా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సిలిండర్ల రీఫిల్లింగ్ సమయంలో భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్ల భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ ధరలతో లభించే గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేయడం ద్వారా లాభాలు సంపాదించ వచ్చనే ఆశతో పలువురు ఈ దందా నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి కాస్తంత ఎక్కువ డబ్బులతో వంట గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేసి అనంతరం ఆ గ్యాస్‌ను వేరే సిలిండర్‌లోకి నింపి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే వారికి అధిక ధరలకు విక్రయిస్తారు. ఈ క్రమంలో ఎలాంటి భద్రతా చర్యలను చేపట్టరు. రీఫిల్లింగ్ చేస్తున్నప్పుడు గ్యాస్ సిలిండర్లు పేలి ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. నిత్యావసర వస్తువుల చట్టం-1955 ప్రకారం పెట్రోలియం ఉత్పత్తులను అనధికారికంగా నిల్వ చేయడం, రవాణా చేయడం నిషేధం. ఇందుకు కఠిన శిక్షలు ఉన్నాయి. అయినా వీటిని బేఖాతరు చేసి పలువురు ఈ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

దాడిలో భారీగా సిలిండర్లు స్వాధీనం

ఇటీవల కేజీఎఫ్‌లో జరుగుతున్న బృహత్ గ్యాస్ రీఫిల్లింగ్ దందాపై దాడులు నిర్వహించిన ఆహార శాఖ అధికారులు భారీ ఎత్తున గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 80 వాణిజ్య ఉపయోగ సిలిండర్లు, 60 గృహ వినియోగ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని అండర్‌సన్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదేవిధంగా కుప్పం రహదారిలో రషీద్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో రీఫిల్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు భారత్ కమర్షియల్ సిలిండర్లు 51, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లు 50, ఇండేన్ సిలిండర్లు 10, హెచ్‌పీ సిలిండర్లు 13, ఖాళీ సిలిండర్లు 10, ఒక మొబైల్ ఫోన్, సిలిండర్లు రవాణా చేసే క్యాంటర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు, క్యాంటర్ వాహనం(ఫైల్)

త్వరలో చర్యలు తీసుకుంటాం

అక్రమ సిలిండర్ రీఫిల్లింగ్ దందాపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కేసులు నమోదు చేశాం, పరారీలో ఉన్న రీఫిల్లింగ్ నిర్వాహకుల కోసం గాలింపు చేపట్టాం. త్వరలో నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకుంటాం.
–శాంతరాజు, ఎస్పీ, కేజీఎఫ్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు హొన్నయ్య(ఫైల్)

యశవంతపుర: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామనగర జిల్లా కనకపుర తాలూకా కొడిహళ్లి హొబళి భూగనంజప్ప నదొడ్డిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన హొన్నయ్య(41)కు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భవన నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం ప్రైవేట్ సంస్థలో రూ. 6.85 లక్షలు అప్పులు చేశాడు. దీనికితోడు కుటుంబ అవసరాల కోసం మరింత అప్పులు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న హొన్నయ్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కళాశాలలో గొడవ

యశవంతపుర: జై శ్రీరామ్ పాట వేసినందుకు గొడవ జరిగిన ఘటన బీదర్ జీఎన్‌డీ కాలేజీలో జరిగింది. కాలేజీలో ఒక కార్యక్రమం జరిగింది. ఇందులో జైశ్రీరామ్ అనే పాటను వేశారు. ఆపాటను ఆపాలని ఓ సముదాయం విద్యార్థులు డిమాండ్ చేశారు. దీంతో రెండు సముదాయాల విద్యార్థుల మధ్య వాగ్వాదం జరిగి పరస్పరం కొట్టుకునేవరకూ వెళ్లింది. విషయం తెలుసుకున్న మంత్రి ఈశ్వరఖండ్రె, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కళాశాలకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు.

హత్యకేసులో నిందితుడి లొంగుబాటు

యశవంతపుర: ఉడిపి జిల్లాలో 2023 ఫిబ్రవరిలో చోటు చేసుకున్న శరత్‌శెట్టి అనే వ్యక్తి హత్యోదంతానికి సంబంధించి యోగిష్ అనే నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. హత్య అనంతరం నిందితుడు పరారీ కాగా పోలీసులు ముమ్మరంగా గాలించినా ఫలితం లేకపోయింది. 15 నెలల తర్వాత నిందితుడు యోగిశ్ పోలీసులు ముందు లొంగిపోగా అతన్ని కోర్టులో హాజరుపరిచారు. కాగా తమ కుమారుడి హత్యకేసులో నిందితుడు కోర్టులో లొంగిపోయేలా చూడాలని పుంజర్లి దేవుడిని వేడుకున్నామని, నిందితుడు ఎక్కడున్నా తెచ్చి మీ ముందు నిలపతానంటూ అమ్మవారు హామీ ఇచ్చారని, అది నిజమైందని మృతుడి తల్లిదండ్రులు పేర్కొన్నారు.

సిటీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

బనశంకరి: సిటీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈఘటన బుధవారం మణిపాల్‌లో జరిగింది. మృతుడిని ఈశ్వరనగర నివాసి మహాబలశెట్టిగార్(78)గా గుర్తించారు. ప్రైవేటు బస్సు మణిపాల్ నుంచి పర్కళకు వెళుతుండగా మహాబలశెట్టిగార్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఉడిపి మణిపాల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మమతా బెనర్జీ వ్యాఖ్యలు ఖండనీయం

హుబ్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓబీసీ రిజర్వేషన్లను అక్కడి హైకోర్టు రద్దు చేసినా కొనసాగిస్తామని సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ బీసీ వర్గాల మోర్చా జిల్లా శాఖ పదాధికారులు బుధవారం ఆందోళన చేపట్టి మమతకు వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆక్రోశం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఓబీసీ కోటా-2010 ద్వారా కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించడం చట్ట వ్యతిరేకం అని కోల్‌కతా హైకోర్టు వాటిని రద్దు చేసిందన్నారు.

ఆకలి తీర్చేందుకు మలబార్ సేవ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సాక్షి, బెంగళూరు: పౌష్టికాహారం అవసరమైన వారికి రోజువారీ భోజనం అందించి ఆకలి లేని ప్రపంచాన్ని' నిర్మించేందుకు కృషి చేస్తున్న మలబార్ గ్రూప్ తెలిపింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన సీఎస్ఆర్ కార్యక్రమాన్ని ఇకపై మరిన్ని ప్రాంతాలకు, వ్యక్తులకు విస్తరించాలని సంస్థ నిర్ణయించింది. ఈ కార్యక్రమం కింద ప్రస్తుతం రోజుకు 31 వేల ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్ 2- జీరో హంగర్ కార్యక్రమానికి మద్దతుగా మలబార్ గ్రూప్ ఈ చొరవను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇకపై రోజుకు 51 వేల పౌష్టికాహార ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. బెంగళూరు ఎంజీ రోడ్డులోని మలబార్ గోల్డ్ - డైమండ్స్ స్టోర్‌లో మంగళవారం వరల్డ్ హంగర్ ఫ్రీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాచార మరియు పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రోహిణి కె. ఈ విస్తరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ. కార్యక్రమానికి మలబార్ గ్రూప్ కర్ణాటక జోన్ అధినేత ఫిల్లర్ బాబు అధ్యక్షత వహించారు. ఎంపీపీ అహ్మద్ మాట్లాడుతూ ఆకలి బాధలను పారద్రోలేందుకు చిన్నపాటి సహకారం అందిస్తున్నామన్నారు. వరల్డ్ హంగర్ ఫ్రీ ప్రాజెక్ట్‌ని 2023లో కర్ణాటకలో ప్రారంభించారు. ప్రతి రోజు 4,450 మందికి భోజనం అందించారు. ఇకపై కర్ణాటకలో ప్రతిరోజు 7,167 మందికి మధ్యాహ్న భోజనం అందించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెంగళూరులోని ధనల్ కార్యనిర్వాహక సభ్యుడు షహీర్, ధనల్ ప్రధాన కార్యదర్శి కెహెచ్ ఫరూక్, మలబార్ గ్రూప్ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి

శివాజీనగర: విధానపరిషత్ ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్ కూటమి అభ్యర్థులకు మద్దతునివ్వాలని మాజీ డీసీఎం డాక్టర్ సీ.ఎన్.అశ్వత్థనారాయణ్ విన్నవించారు. బుధవారం మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం జగన్నాథ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ-జేడీఎస్ మిత్ర పక్షాలు పట్టభద్రులు, ఉపాధ్యాయుల విషయంలో ప్రామాణికంగా పనిచేశాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ, పట్టభద్రుల వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియామకాలను పూర్తిగా నిషేధించిందన్నారు.అయితే బీజేపీ హయాంలో ఎయిడెడ్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి యుద్ధ్యారప్ప చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.25కు పైగా విశ్వవిద్యాలయాలను స్థాపించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు హరీశ్, బెంగళూరు సెంట్రల్ జిల్లాధ్యక్షుడు సప్తగిరిగౌడ పాల్గొన్నారు.

నా హస్తం ఏమీ లేదు: ఎమ్మెల్యే

హొసపేటె: తాగునీటి సరఫరాకు వచ్చిన ట్యాంకర్ లారీని నగరసభ అధికారి అడ్డుకోవడం వెనుక తన హస్తం ఏమీ లేదని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ విషయాన్ని జిల్లాధికారి చూసుకుంటారని ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చిత్తవాడిగి జాతీయ రహదారి బైపాస్ రహదారిలో ఉన్న మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ ట్యాంకర్ లారీ మంచి నీరు తీసుకెళ్లేందుకు రాగా నగరసభ అధికారి చంద్రప్ప అడ్డుకోగా మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ ట్యాంకర్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం లేదన్నారు. తాను అధికారం చేపట్టినప్పటి నుంచి ఇంతవరకు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల గురించి త్వరలో క్షుణ్ణంగా తెలియజేస్తానన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నేత్రశిబిరానికి వచ్చిన తల్లీబిడ్డలు

పావగడ: స్థానిక స్వామి వివేకానంద గ్రామీణ ఆరోగ్య కేంద్రంలోని శారదా దేవి కంటి చికిత్స విభాగంలో బుధవారం చిన్నారులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వందలాది మంది చిన్నారులు తరలి వచ్చారు. ప్రముఖ నేత్ర చికిత్స వైద్యురాలు డాక్టర్ వసుంధర నరేశ్ కంటి పరీక్షలు చేశారు. 13 రోజుల శిశువు నుంచి 15 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు చికిత్స అందించారు. ఈ శిబిరంలో 22 నెలల పసికందుకు రెండు కళ్లు లోపించడంతో తక్షణమే మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించినట్లు స్వామి జపానంద తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 31 నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయన్నారు. పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, షూ, సాక్స్, మధ్యాహ్న భోజనం, పాలు, కోడి గుడ్డు, చిక్కి, అరటి పండ్లు ఉచితంగా అందిస్తామన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున తీపి వంటకాలతో పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డిస్తామని ఈసీఓ వేణుగోపాల రెడ్డి తెలిపారు.

విద్యాశాఖ ప్రాధికార ఏర్పాటుకు డిమాండ్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో విద్యాశాఖ ప్రాధికారను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి వేదిక సంచాలకురాలు విద్యా పాటిల్ డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25వ విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కొన్ని సర్కారీ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో జూన్ 1 నుంచి పాఠశాలలను ఏ విధంగా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో 160 పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే అవకాశాలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రుల వెంట కూలి పనులకు వెళుతున్నారన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. మోక్షమ్మ, శివరామ రెడ్డి, మారెమ్మ, హఫీజుల్లాలున్నారు.

కోలారు వార్తలు...

గెలుపుతో సమస్యలకు చెక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్

కోలారు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ కోరారు. బుధవారం నగరంలోని వివిధ కళాశాలల్లో ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తరఫున చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా తాలూకాలోని కళాశాలలకు రూ.30 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. చట్టసభలో శాసనాలు అమలుకు పెద్దల సభలో మెజారిటీ అనివార్యం కావడం వల్ల అభివృద్ధిని, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దేశాభివృద్ధికి విద్య, ఆరోగ్యానికి, రైతులకు మొదటి ప్రాధాన్యత నివ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. విద్యా రంగంలో మరింత అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల, విద్యా సంస్థల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తనను గెలిపిస్తే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, బెంగళూరు విశ్వవిద్యాలయం సిండికేట్ హూవళ్లి రంగప్ప, బంగారుపేట బ్లాక్ కాంగ్రెస్ అభ్యర్థి సీసంద్ర గోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

అధికారి ఆత్మహత్యకు కారకులపై కేసు ఏదీ?

కోలారు: కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్యకు కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె నారాయణగౌడ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 5 గ్యారెంటీలను అమలు చేయడం కోసం నిధులు లేక అధికారులపై ఒత్తిడి పెంచుతోందన్నారు. ఆ ఒత్తిడిని తాళలేక అధికారి ఆత్మహత్య చేసుకున్నాడని, దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. వివిధ నిధులను నకిలీ దాఖలాలు సృష్టించి లూటీ చేశారన్నారు. ఇందుకు అంగీకరించని అధికారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా నశించాయన్నారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో మంత్రి ఒత్తిడితోనే అక్రమాలు జరిగాయన్నారు. దీనిని సహించలేకనే నిజాయతీ అధికారి చంద్రశేఖర్ డెత్‌నోట్ రాసి పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అధికారి కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం పదాధికారులు మరగల్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు కదరినత్త అప్పోజిరావ్, మునికృష్ణ, శైలజ, రాధ, చౌడమ్మ సుధా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్యే ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీటీ శ్రీనివాస్ తరఫున ఎమ్మెల్యే రూపా శశిధర్ బుధవారం నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. విద్యా సంస్థలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉందన్నారు. తమ అభ్యర్థిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ అవధిలో అన్ని పనులను చక్కబెడతారన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించే ప్రామాణిక ప్రయత్నం చేస్తారన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ పాత పింఛన్ విధానాన్ని తిరిగి తెస్తారన్నారు. ఏపీఎంసీ అధ్యక్షుడు విజయరాఘవరెడ్డి, మాజీ జెడ్పీ సభ్యుడు లక్ష్మీనారాయణ, వెంకటేష్, న్యాయవాది పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కోలారు: జిల్లాలో అవసరానికి సరిపడా ఎరువులు, విత్తనాలు నిల్వ ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందనవసరం లేదని, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలతో పాటు వారి లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. బుధవారం తన కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి రసాయనిక ఎరువుల నిర్వహణ సమితి సమావేశాన్నుద్దేశించి ఆయన మాట్లాడారు. కరువుతో కష్టాల్లో ఉన్న రైతులకు ఇబ్బంది కలుగకుండా సుమారు 448కి పైగా కేంద్రాల్లో ఎరువులను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయ పరికరాల విక్రేతలు రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వడానికి అనవసర నియమాలు విధించడం, విత్తనం, ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే అలాంటి వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సగటు కన్నా 5 శాతం అధిక వర్షపాతం

జిల్లాలో సామాన్య వర్షపాతం 108 మి.మీ.లు కాగా ప్రస్తుత సంవత్సరం 113 మి.మీ.ల సగటు వర్షపాతం కురిసిందన్నారు. సగటు అనేకంటే ఈ యేడాది 5 శాతం ఎక్కువ వర్షం కురవడంతో రైతులు ఇప్పటికే వ్యవసాయ కార్యకలాపాలను ప్రారంభించారన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు లభించాలనే ఉద్దేశంతో రైతు కేంద్రాల్లో కూడా విత్తనాలు, రసాయనిక ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలలో రాగి 430.8 క్వింటాళ్లు, కందులు 38.6 క్వింటాళ్లు, అలసందలు 32 క్వింటాళ్లు, వేరుశెనగ 386.6 క్వింటాళ్లు కలిపి మొత్తం 888 క్వింటాళ్ల ధాన్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొత్తం 13,933 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుమ, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుమారస్వామి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ భవ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

డొనేషన్ తీసుకుంటే అనుమతి రద్దు

ప్రైవేటు పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి డొనేషన్లు వసూలు చేస్తే పాఠశాల అనుమతి రద్దు చేస్తామని జిల్లాధికారి అక్రం పాషా హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎయిడెడ్ లేదా అన్ఎయిడెడ్ పాఠశాలలు ఏవీ డొనేషన్లు వసూలు చేయడానికి వీలు లేదన్నారు. అలా ఎవరైనా డొనేషన్లు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యా సంస్థ అనుమతి రద్దు చేస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యా సంస్థలు తల్లిదండ్రుల నుంచి డొనేషన్లు వసూలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. అంతేకాని ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తే అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తప్పవన్నారు. ప్రతి విద్యా సంస్థ ముందు ఫీజు బోర్డులు ఉంచాలన్నారు. జిల్లాలో ఏ విద్యా సంస్థ అయినా డొనేషన్ తీసుకున్నట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కరపత్రాలు పంచి ప్రచారం చేస్తున్న దృశ్యం

కోలారు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్డీఏ అభ్యర్థి వైఏ నారాయణస్వామి తరఫున బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం నగరంలోని వివిధ కళాశాలలు, విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోకుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, సైనిక్ పబ్లిక్ పాఠశాల, శుభల విద్యాలయ, చిన్మయ విద్యాలయ, మహిళా సమాజ కళాశాలల్లో ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. బీజేపీ నాయకుడు మ్యాగేరి నారాయణస్వామి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత మూడు సార్లుగా ఎన్నికైన నారాయణస్వామి ఉపాధ్యాయుల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారంలో ముందుంటారన్నారు. కుడా మాజీ అధ్యక్షుడు విజయకుమార్, జిల్లా కార్యదర్శి హారోహళ్లి వెంకటేష్ , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అరుణమ్మ, జిల్లా మాధ్యమ సంచాలకుడు ప్రవీణ్‌గౌడ పాల్గొన్నారు.

కోడి పందేల అడ్డాపై దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు, కోడి

శ్రీనివాసపురం: రోణూరు, తిమ్మసంద్ర రహదారిలో ఉన్న మామిడి తోపులో కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి జరిపి 9 బైకులు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేయడంతో కోడి పందేలు ఆడుతున్న వారు అక్కడి నుంచి పరారయ్యారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ ఎంబి గొరవనకొళ్ల, ఎస్ఐ శివప్ప, సంపత్, శ్రీనాథ్, సంతోష్, అంబరీష్, గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా కరగ ఉత్సవం



కరగ పూజారికి ఉంగరం తొడుగుతున్న పూజారి

మాలూరు: తాలూకాలోని మాస్తి ఫిర్కా కుప్పూరు గ్రామంలో శ్రీధర్మరాయస్వామి ద్రౌపతాంబ దేవి కరగ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పురాతన దేవాలయమైన శ్రీ ద్రౌపతాంబ దేవి కరగ ఉత్సవంలో భాగంగా దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవాలయం ముందున్న కళ్యాణి వద్ద కరగ పూజారికి గాజులు తొడిగే కార్యక్రమం జరిగింది. గంగ పూజ నెరవేర్చిన అనంతరం పూల కరగ పూజా కార్యక్రమాలు జరిగాయి. పూల కరగను తలపై మోసిన పూజారి తాళానికి అనుగుణంగా నర్తించడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దేవాలయ సమితి సభ్యులు, కుల బాంధవులు, కరగ భక్తులు పెద్ద సంఖ్యలో కరగ ఉత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కె వై నంజేగౌడ కరగ పూజారికి బంగారు ఉంగరాన్ని తొడిగారు.

క్లుప్తంగా

శుభ్రతతో డెంగీని అరికడదాం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ హొన్నయ్య

గౌరిబిదనూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీని అరికడదామని తా.పం. ఈఓ జీకే హొన్నయ్య అన్నారు. డెంగీని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టీపీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, తొట్టెల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆరోగ్యాధికారి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ తాలూకాలోని తొండేబావి, అలీపుర, జగరెడ్డిపల్లి, నామగొండ్లు, నక్కలపల్లి, మంచేనహళ్లిలో 8 డెంగీ కేసులు వెలుగు చూశాయన్నారు. పట్టణంలో ఈ వ్యాధి విస్తరించలేదన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని దోమ కాటుకు గురి కాకుండా ఉండాలని సూచించారు. డాక్టర్ మురళీధర్, మూకాంబిక పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

మైసూరు: రెండు బైక్‌లు ఢీకొని ఒక ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన నంజనగూడు తాలూకా గీకహళ్లి గ్రామం వద్ద జరిగింది. నంజనగూడు తాలూకా ఆలంబూరు మంటి గ్రామానికి చెందిన ఎం.ప్రవీణ్ కుమార్ (19) బైక్‌లో స్వగ్రామం నుంచి నంజనగూడు వైపు వెళుతుండగా అటుపక్క నుంచి అత్యంత వేగంగా వచ్చిన పల్సర్ బైక్ ఢీ కొట్టింది. ప్రమాదంలో ప్రవీణ్ కుమార్ తలకు తీవ్రంగా గాయమైంది. తాలూకా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బిళిగెరె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

గౌరిబిదనూరు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గానికి బీజేపీ మద్దతుతో బరిలో ఉన్న వైఏ నారాయణస్వామి తరఫున ఆ పార్టీ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి నారాయణస్వామికి మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీ నాయకుడు డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ నారాయణస్వామి 18 సంవత్సరాలుగా పరిషత్‌లో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడారన్నారు. ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. రవినారాయణరెడ్డి, మార్కెట్ మోహన్, రమేశ్ రావ్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని బెదిరించి దోపిడీ

మైసూరు: దుండగులు ఓ వైద్య విద్యార్థిని బెదిరించి రూ. 25 వేలను దోచుకున్నారు. ఈ ఘటన మైసూరులో జరిగింది. ఆర్యన్ పండిత్ అనే యువకుడు నగరంలోని జేఎస్ఎస్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కాలేజీకి కాలి నడకన వెళ్తుండగా బైక్‌లో వచ్చిన ఇద్దరు దుండగులు అడ్డుకొని పార్కులోకి లాక్కెళ్లారు. విద్యార్థినిని వేధిస్తున్నావని, విద్యార్థులకు డ్రగ్స్ విక్రయిస్తున్నావని దుండగులు బెదిరించారు. రూ. 25 వేలు ఇస్తే వదిలేస్తామని చెప్పారు. తన వద్ద డబ్బు లేదని ఆర్యన చెప్పగా ఫోన్‌పే ద్వారా రూ. 25 వేలు తమ ఖాతాకు బదిలీ చేసుకున్నారు. పోలీసులకు ఈ విషయం చెబితే చంపేస్తామని బెదిరించి ఉడాయించారు. ఘటనపై నరసింహరాజు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

పోలీసులను చూసి ఉడాయించిన దొంగలు

మైసూరు: చోరీకి పాల్పడిన దొంగలు పోలీసులను చూసి నగలు, బైక్ వదిలేసి పారిపోయారు. ఈఘటన మైసూరు విజయనగరలో జరిగింది. విజయనగర కానిస్టేబుళ్లు అనంతు, హేమంత్‌లు గస్తీ నిర్వహిస్తుండగా అంజనాద్రి రోడ్డులో ముగ్గురు యువకులు బైక్‌లో అనుమానాస్పదంగా వెళ్తుండటాన్ని గమనించి వెంబడించారు. పసిగట్టిన ఆ ముగ్గురూ ఒక బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. పోలీసులు వెళ్లి బ్యాగు తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఉన్నాయి. ఈ ముగ్గురు ఎక్కడో చోరీకి పాల్పడి ఉంటారని నిర్ధారించి వారి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

అవార్డు ప్రదానం


అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

మైసూరు: వీర సావర్కర్ జన్మదినం సందర్భంగా నగరంలోని కళామందిరంలో ప్రముఖ యువ బ్రిగేడ్ సంస్థాపకుడు చక్రవర్తి సూలిబెలెకు వీర సావర్కర్ సమ్మాన్ అవార్డును ప్రదానం చేశారు. మైసూరు వీర సావర్కర్ ప్రతిష్టాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎస్ఎల్ భైరప్ప.. చక్రవర్తికి వీరసావర్కర్ సమ్మాన్ అవార్డును అందించి గౌరవించారు. చక్రవర్తి సూలిబెలె మాట్లాడుతూ వీర సావర్కర్ గోపూజ చేయడమే కాకుండా వాటి సంరక్షణ కూడా చేశారని, ఆయన్ను స్ఫూర్తి తీసుకొని ఈ అవార్డుతో వచ్చిన రూ. లక్షను గో సంరక్షణార్థం గోశాలకువిరాళంగా ఇస్తానని ప్రకటించారు.

ఉత్సాహంగా మళ్లీ బడికి



చిక్కమగళూరులో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


బెంగళూరులోని హనుమంతనగర సుంకేనహళ్లిలోని పాఠశాలలో విద్యార్థులు


బెంగళూరులోని హొంబేగౌడనగరలో పూలు అందించి బడిలోకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

- పాఠశాలలు పునఃప్రారంభం
- విద్యార్థులకు సాదర స్వాగతం

శివాజీనగర: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి పాఠశాలలు ఆరంభమయ్యాయి. విద్యార్థులు వేసవి సెలవులను సరదాగా గడిపి మళ్లీ బడులకు వచ్చారు. వరుసగా 40 రోజుల పాటు వివిధ ఆటపాటలతో గడిపిన చిన్నారులు మళ్లీ బ్యాగులు సర్దుకుని ఉత్సాహంగా పాఠశాల వైపు అడుగులు వేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తోరణాలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. కొన్నిచోట్ల గులాబీ పూలు, చాక్లెట్లు, మిఠాయిలను అందజేశారు. పాఠశాలల్లో నిశ్శబ్దం స్థానంలో సందడి ఏర్పడింది. కొన్నిచోట్ల పిల్లలు ఉత్సాహంగా, కొందరు విచారంగా కనిపించారు.

ఉచిత పుస్తకాలు, యూనిఫారాలు

సిబ్బంది పాఠశాలలను ముందుగానే పరిశుభ్రం చేసి ఉంచారు. మధ్యాహ్న భోజనం తొలిరోజే ఆరంభమైంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు సగానికి పైగా రాకపోగా, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు నచ్చజెప్పి తీసుకువచ్చారు. సర్కారీ బడుల్లో 1 నుంచి 10వ తరగతి వరకు మొదటి రోజే విద్యార్థులకు యూనిఫారం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టారు. ఇప్పటినుంచి పాఠశాలలు అక్టోబరు 3 వరకు నిరాటంకంగా జరుగుతాయి. మళ్లీ ఆ నెల 20 వరకు దసరా సెలవులు ఉంటాయి. కాగా ప్రైవేటు పాఠశాలలు పూర్తిగా ఆరంభం కాలేదు.

నీరు కలుషితమైతే అధికారులపై చర్యలు

శివాజీనగర: గ్రామాలకు సరఫరా అయ్యే తాగునీరు కలుషితం అయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని జిల్లా పంచాయతీల సీఈఓలు, గ్రామీణ తాగునీరు సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు మంత్రి లేఖ రాశారు. గ్రామీణ ప్రజలకు శుద్ధ జలాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే ఇటీవల కొన్ని జిల్లాల్లో కలుషిత నీరు సరఫరా అయ్యిందని, దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యారన్నారు. గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించినా కొన్ని గ్రామాలకు ఇప్పటికీ కలుషిత నీరు సరఫరా అవుతోందని మంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తమై నీటి సరఫరాను పర్యవేక్షించాలని, శుద్ధజల కేంద్రాలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యంతో అతిసారం కేసులు పునరావృతమైతే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

మైసూరు: సెక్యూరిటీ గార్డు ఫ్యాక్టరీ గోడౌన్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నంజనగూడు పారిశ్రామిక ప్రాంతం రెహాన్స్ కర్మాగారంలో జరిగింది. నంజనగూడు తాలూకా మహదేవనగర నివాసి నంజేశ్ (42)రెహాన్స్ కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను సోమవారం రాత్రి కర్మాగారం గోడౌన్‌లో విధులకు వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మానసికంగా నిరాశ, నైరాశ్యం, ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నంజనగూడు పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మహిళపై నిందలు వేసి వేధింపులు

- అవమానంతో ఉరివేసుకొని ఆత్మహత్య

మైసూరు: తన శీలంపై నింద వేయడంతో మనస్తాపానికి గురైన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఉదంతం మైసూరు గాంధీనగరలో జరిగింది. మైసూరు ఎన్ఆర్ పోలీసుల కథనం మేరకు.. దడదహళ్లిలో విజయలక్ష్మి (40) అనే వివాహిత నివాసం ఉంటోంది. ఇదే గ్రామానికి చెందిన నాగరాజు విజయలక్ష్మిపై కన్నేసి ఆమె శీలంపై అవాస్తవాలు ప్రచారం చేసేవాడు. అసభ్యపదజాలంతో దూషించేవాడు. దీంతోవిజయలక్ష్మి కుమారుడు అభి పలుమార్లు నాగరాజుతో గొడపడ్డాడు. దీంతో నాగరాజు తన స్నేహితులతో కలసి విజయలక్ష్మి ఇంట్లోకి చొరబడి విధ్వంసం సృష్టించాడు. చివరికి వీరి గొడవ కోర్టుకు చేరింది. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి తన కుటుంబాన్ని శివమొగ్గకు మార్చింది. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లేందుకు విజయలక్ష్మి కుటుంబ యత్నించింది. ఇందుకోసం గ్రామీణ పోలీసుల సాయం కూడా కోరింది. వారి సూచనలతో కడకోళ పోలీసు స్టేషన్‌కు వెళ్లగా నాగరాజు తదితరులు వ్యతిరేకిస్తూ మళ్లీ విజయలక్ష్మి గురించి అవాస్తవాలు ప్రచారం చేశారు.అనంతరం గ్రామానికి వెళ్లలేక విజయలక్ష్మి మైసూరు గాంధీనగరలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. సిద్ధార్థ పార్కులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి నాగరాజు, రాజమ్మ, గోవిందరాజు, నంజుండ, నారాయణ, నంజప్ప, స్వామిలు కారణమని మైసూరు ఎన్ఆర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు అద్దాలు ధ్వంసం చేసి చోరీ యత్నం

- దొంగను చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు


దొంగను చితకబాదుతున్న స్థానికులు

మండ్య: కారులోని రూ. 7 లక్షల నగదు దోచుకుని పారిపోతున్న దొంగలను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మండ్య నగర శివార్లలోని అమరావతి హోటల్ వద్ద జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి ఈ దొంగతనానికి పాల్పడ్డాడు. కల్లహళ్లి లేఔట్‌కు చెందిన మధు అనే వ్యక్తి నగరంలోని కెనరా బ్యాంకు నుంచి రూ.7 లక్షలు డ్రా చేసి కారులో బయల్దేరి అమరావతి హోటల్ వెనుక పార్కింగ్ చేసి స్నేహితులను కలిసేందుకు లోపలికి వెళ్లాడు. తిరిగి వెనక్కి వచ్చి చూడగా ఓ వ్యక్తి కారు కిటికీ అద్దాలు పగులగొట్టి నగదు తీసుకునేందుకు యత్నిస్తున్నాడు. వెంటనే మధు తేరుకుని గట్టిగా దొంగ దొంగ అంటూ కేకలు వేశాడు. తక్షణమే నిందితుడు హోటల్ గోడ దూకి పారిపోయేందుకు యత్నించాడు. మధు కేకలు విన్న స్థానికులు ఆ దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం ఆ పోలీసులకు అప్పగించారు. మండ్య గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అనుమతి లేని స్కూళ్లను రద్దు చేయాలి

- మానవ హక్కుల సేవా కేంద్రం నాయకుల ధర్నా
- వీరికి వ్యతిరేకంగా (రూప్సా) ఆందోళన


పోటా పోటీగా ఆందోళన చేస్తున్న దృశ్యం

తుమకూరు: జిల్లాలోని అనధికార స్కూళ్లను మూసివేయాలని డిమాండ్ చేస్తూ మానవ హక్కుల సేవా కేంద్రం ఆందోళన చేపట్టింది. అయితే వీరి ఆందోళనను వ్యతిరేకిస్తూ కర్ణాటక రూప్సా కూడా ఆందోళన చేయడంతో రెండు సంఘాల సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తాలూకాలోని 14 పాఠశాలలు అనధికారికంగా నిర్వహిస్తున్నారని తుమకూరు తాలూకా బీఈవో గుర్తించారు. నెల రోజులు గడిచినా చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా స్పందించి ఆ స్కూళ్ల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని మానవ హక్కుల సేవా కేంద్రం సంస్థాపక అధ్యక్షుడు సిద్ధలింగేగౌడ నేతృత్వంలో డీడీపీఐ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన జరిగింది. అయితే వీరి ఆందోళన సరికాదని, కేవలం ప్రచారం కోసం పోరాటం చేస్తున్నారని ఆరోపిస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రైవేటు స్కూళ్ల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (రూప్సా) అధ్యక్షుడు హాలేనూరు లేపాక్ష నేతృత్వంలో పోటీగా ధర్నా జరిగింది. ఈ సమయంలో రెండు సంఘాల మధ్య మాటల యుద్ధం జరిగింది.

మా జిల్లా వాటా నీటిని తరలించనివ్వం


చీఫ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు


చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న రాష్ట్ర రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు

- హేమావతి లింక్ కాలువ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం ఆందోళన

తుమకూరు: హేమావతి లింక్ కెనాల్ ద్వారా తుమకూరు జిల్లా వాటా నీటిని ఇతర జిల్లాలకు తరలించడాన్ని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈమేరకు లింక్ కెనాల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పలు సంఘాల ఆధ్వర్యంలో హేమావతి చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంఘం గౌరవ రాష్ట్రాధ్యక్షుడు, తుమకూరు జిల్లాధ్యక్షుడు ఎ.గోవిందరాజు మాట్లాడుతూ తుమకూరు వాటా నీటిని ఇతర జిల్లాలకు తరలిస్తుంటే ఈ జిల్లా ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, ఈ జిల్లా ప్రజలు మిమ్మల్ని క్షమించబోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా హేమావతి లింక్ కెనాల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా పాలక పక్షం వైపు స్థానిక మంత్రులు జి.పరమేశ్వర, కేఎన్ రాజణ్ణ, గుబ్బి ఎమ్మెల్యే వాసు, శిరా ఎమ్మెల్యే టీబీ జయచంద్ర తదితరులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వంతో చర్చించి ఈ కెనాల్ నిర్మాణం రద్దయ్యేలా చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. ఈ జిల్లా ప్రజల దాహార్తిని తీర్చే హేమావతిని ఇతర జిల్లాలకు తరలిస్తుంటే అడ్డుకోకుండా ఉండడం సరికాదని , జిల్లా ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు.

హోసూరు వార్తలు..

ఒంటి ఏనుగు గలాటా


జాతీయ రహదారిని దాటుతున్న ఒంటి ఏనుగు

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో మంగళవారం సాయంత్రం ఒంటి ఏనుగు జాతీయ రహదారి హల్‌చల్ చేసింది. దీంతో హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారిపై సుమారు అర్ధగంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అటవీ ప్రాంతం నుంచి ఒంటి ఏనుగు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఒంటి ఏనుగు సంచారంతో కామనదొడ్డి, కానలట్టి, నల్లనకొత్తపల్లి, కల్లుగురికి, శెట్టిపల్లి తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్దకు కాపలా వెళ్లరాదని అటవీ సిబ్బంది తెలిపారు.

యల్లమ్మదేవికి విశేష పూజలు



హోసూరు: కెలమంగలం పట్టణ పంచాయతీ విరుపాక్షి నగర్‌లో వెలసిన గ్రామదేవత బాలగురు యల్లమ్మదేవి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, ఆరాధన, ప్రత్యేక హోమాలు జరిపించారు. కెలమంగలం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

టూరిస్టు బస్సుకు ప్రమాదం

- 22 మందికి గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన మినీ బస్సు

హోసూరు: చెన్నై నుంచి హొగేనక్కల్‌కు పర్యాటకులను తీసుకెళుతున్న మినీ బస్సు క్రిష్ణగిరి సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 22 మందికి గాయాలయ్యాయి. వివరాలు.. కావేరి నది, లోయలు, అడవులతో పర్యాటక కేంద్రమైన హొగేనక్కల్‌కు 21 మంది మంగళవారంరాత్రి మినీబస్సులో బయల్దేరారు. బుధవారం వేకువజామున చెన్నై- క్రిష్ణగిరి జాతీయ రహదారిలో బర్గూరు వద్ద వెళుతుండగా డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి రోడ్డుమధ్యనున్న డివైడర్‌ను ఢీకొంది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

ప్రయాణికుల హాహాకారాలు

నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందోనని ఉలిక్కిపడి కేకలేశారు. గమనించిన స్థానిక ప్రజలు ఘటనా స్థలానికి చేరుకొని కందికుప్పం పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో చిక్కుకొన్న క్షతగాత్రులను బయకు తీసి క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.



నుజ్జయిన బస్సు ముందు భాగం, గాయపడిన వారికి ఆస్పత్రిలో చికిత్సలందజేస్తున్న దృశ్యం

భగ్గుమన్న కొత్తిమీర ధర

కెలమంగలం: గత రెండురోజులుగా కొత్తిమీర ధరలు పెరగడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. హోసూరు, డెంకణీకోట, కెలమంగలం, తళి, అంచెట్టి, సూళగిరి, బాగలూరు, బేరికె తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రైతులు కొత్తిమీర పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాతంలో పండించే కొత్తిమీరను హోసూరు, బెంగళూరు, సేలం, కోయంబత్తూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని మార్కెట్‌లకు తరలిస్తున్నారు. వారం రోజుల క్రితం కట్ట కొత్తిమీర ధర రూ. 10 నుంచి రూ. 20 వరకు మాత్రమే ధర పలికేది. భారీ వర్షాల వల్ల పంట దెబ్బతిందనే కారణంతో ధరలు పెరిగాయి. కొత్తిమీర కట్ట రూ. 70 నుంచి 90 వరకు పలకడంతో రైతులు, దళారుకు లాభాల పంట పండుతోంది. మరోవైపు కొనుగోలుదారులు మాత్రం అయ్యో అంటున్నారు.

కాపర్ దొంగల అరెస్టు

కెలమంగలం: కెలమంగలం సమీపంలో కాపర్ వైరు దొంగిలించిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. జెక్కేరి వద్ద రోడ్డు పనుల కోసం నిల్వ ఉంచిన రాగి వైరును ఎత్తుకెళ్లారు. ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఉద్దనపల్లివాసి అంజి (25), ఒన్నుగురికి ఆనంద్ (20), ముదుగానపల్లి మురుగేషన్ (40), కెలమంగలం శబరేష్ (30)లను అరెస్ట్ చేశారు.

పాములతో భయం భయం

జే.కారుపల్లి గ్రామంలో పాముల భయం ఏర్పడింది. ఇక్కడ 350కి పైగా కుటుంబాలున్నాయి. డ్రైనేజీలలో చెత్త పేరుకుపోయి పాములు, తేళ్లు తిరుగుతున్నాయని తెలిపారు. పైపుల ద్వారా ఇళ్లలోకి వస్తున్నాయని వాపోయారు. బుధవారం డ్రైనేజీలో ఓ నాగుపాము వచ్చింది. తక్షణం పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

చంద్రశేఖర్ మృతిపై ఆందోళనకు బీజేపీ సన్నాహాలు


మంత్రి నాగేంద్ర రాజీనామా చేయాలని బళ్లారిలో బుధవారం టైర్లకు నిప్పంటించి ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు,నాయకులు

శివాజీనగర: కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆత్మహత్య ఉదంతంపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటానికి బీజేపీ సిద్ధమవుతోంది. తనపై ఒత్తిడి ఉందేదని చంద్రశేఖరన్ రాసినట్లుగా చెబుతున్న డెత్‌నోట్‌ను బీజేపీ అస్త్రంగా చేసుకుంది. ఈఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ వెనుకబడిన వర్గాల శాఖ మంత్రి బి.నాగేంద్ర రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. కేసును సీఐడీ తనిఖీకి ఆదేశించినట్లు ప్రభుత్వం చెబుతున్నా ఈ తనిఖీ సంస్థ కూడా ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్న కారణాన నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని, నాగేంద్ర ముందుగా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో మంత్రిని సస్పెండ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేపట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. బీజేపీ హయాంలో కాంట్రాక్టర్ ఆత్మహత్య కేసులో అప్పటి గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి కే.ఎస్.ఈశ్వరప్పపై పలు ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన రాజీనామా చేసేలా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఉద్యమించింది. ప్రస్తుతం చంద్రశేఖర్ ఉదంతంలో బీజేపీ కూడా అదే విధానంలో ముందుకు సాగుతోంది. నాగేంద్ర రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, శాసనసభ ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ నేతృత్వంలో పోరాటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇలాంటి ఉదంతాలు ఎన్నో ఉన్నాయి

కాంగ్రెస్ పాలనలో అధికారులు ఎంతో ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, వాల్మీకి అభివృద్ధి మండలి అధికారి చంద్రశేఖరన్ ఆత్మహత్య ఒక ఉదాహరణ మాత్రమేనని మాజీ సీఎం సదానంద అన్నారు. అధికారి ఆత్మహత్యకు సీఎం సిద్ధరామయ్య బాధ్యత వహించాలన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

నగదు గల్లంతుపై ఫిర్యాదు

శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలి ఖాతానుంచి గల్లంతైన రూ. 187 కోట్ల ఉదంతానికి సంబంధించి బ్యాంక్ పాలక మండలికి వ్యతిరేకంగా బెంగళూరులోని హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో మండలి చీఫ్ మేనేజర్ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. మండలి పేరుతో వసంతనగరలో ఉన్న యూనియన్ బ్యాంక్ లో ఖాతా ఉంది. ఫిబ్రవరి 19న ఖాతాను ఎంజీ రోడ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆ తరువాత ఆ ఖాతా నుంచి మార్చి 4న 25 కోట్లు, మార్చి 6న 25 కోట్లు, మార్చి 21న 44 కోట్లు బదిలీ అయింది. మే 21న రూ.50 కోట్లు, మే 22న 33 కోట్లు బదిలీ అయింది.

ముగ్గురు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్

శివమొగ్గ: రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి నిగమ మండలి బెంగళూరు కార్యాలయంలో సేవలు అందిస్తున్న చంద్రశేఖరన్ (48) ఆత్మహత్యకు సంబంధించి ముగ్గురు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. చంద్రశేఖరన్ రాసినట్లుగా చెబుతున్న డెత్‌నోట్‌లోని పేర్ల ఆధారంగా శివమొగ్గ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముగ్గురు అధికారులు వ్యక్తిగత లాభాల కోసం కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేసినట్లు, అంతేకాకుండా తనను వేధింపులు గురి చేశారని, లెక్కలోనికి రాని నగదును వేరే ఖాతాలోకి బదిలీ చేయాలని ఒత్తిడి చేసినట్లు చంద్రశేఖరన్ డెత్‌నోట్‌లో రాశాడు. పరారీలో ఉన్న ఆ ఉన్నతాధికారుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

వాల్మీకి అభివృద్ధి మండలి ఎండీగా రాజ్‌కుమార్

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలి ఎండీగా డాక్టర్ కేఆర్. రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీచేసింది. గతంలో ఉన్న ఎండీ జే.జీ.పద్మనాభను సస్పెండ్‌చేసింది. దీనిగురించి ఎస్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ అదనపు కార్యదర్శి భవ్య ఎంజే ఆదేశాలు జారీచేశారు. ఇంకా అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉన్న పరశురామ్ జీ దుగ్గణ్ణనవర్‌ను సస్పెండ్ చేసి విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 30.8 శాతం మంది కోటీశ్వరులే. అలాగే 20 శాతం (1,643) మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. వారిలో 1,190 మందిపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాల వంటి తీవ్రమైన కేసులున్నాయి. మొత్తం 8,360 మంది అభ్యర్థుల్లో 8,337 మంది అఫిడవిట్లను విశ్లేషించిన మీదట అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు బుధవారం నివేదిక విడుదల చేశాయి. మొత్తం అభ్యర్థుల్లో 1,333 మంది జాతీయ పార్టీల తరఫున, 532 మంది రాష్ట్ర పార్టీల నుంచి, 2,580 మంది రిజిస్టర్డ్ పార్టీల నుంచి బరిలో ఉన్నారు. 3,915 మంది స్వతంత్ర అభ్యర్థులు. మొత్తం 751 పార్టీలు పోటీలో ఉన్నాయి. 2019లో 677 పార్టీలు, 2014లో 464, 2009 ఎన్నికల్లో 368 పార్టీలు పోటీ చేశాయి. 2009 నుంచి 2024 వరకు ఎన్నికల బరిలో నిలిచిన రాజకీయ పార్టీల సంఖ్య 104% పెరిగింది. కాగా మరోసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన 324 మంది సిట్టింగ్ ఎంపీల సంపద గత ఐదేళ్లలో సగటున 43% పెరిగింది.

- సాక్షి, న్యూఢిల్లీ



లోక్‌సభ అభ్యర్థుల్లో 31% సంపన్నులు 20% నేరచరితులు


1,190 మందిపై తీవ్రమైన కేసులు ● అభ్యర్థుల్లో 10% మహిళలు


పెరుగుతున్న మహిళా అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళల సంఖ్య ఈసారీ స్వల్పంగానే ఉంది. కేవలం 797 మంది మాత్రమే బరిలో ఉన్నారు. అయితే గత మూడు లోక్‌సభ ఎన్నికల నుంచి వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2009లో 7 శాతం, 2014లో 8 శాతం, 2019లో 9 శాతం మహిళలు లోక్‌సభ బరిలో నిలవగా ఈసారి 10 శాతానికి చేరారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 69 మంది మహిళలకు, కాంగ్రెస్ 41 మందికి టికెట్లిచ్చాయి.

సగానికి పైగా రెడ్ అలర్ట్ స్థానాలే..

క్రిమినల్ కేసులున్న అభ్యర్థుల సంఖ్య 2019 లోక్‌సభ ఎన్నికల్లో 1,500 కాగా ఈసారి 1,643కు పెరిగింది. మొత్తం 440 మంది అభ్యర్థులలో 191 మంది నేర చరితులతో ఈ జాబితాలో బీజేపీ టాప్‌లో ఉంది. తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (327 మందిలో 143), బీఎస్పీ (487 మందిలో 63), సీపీఎం (52 మందిలో 33) ఉన్నాయి. 3903 మంది స్వతంత్ర అభ్యర్థులలో 550 (14%) మంది నేర చరితులు. ఈ జాబితాలో టాప్ 5లో కేరళ నుంచి ముగ్గురు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ నుంచి ఒక్కొక్కరున్నారు. ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది నేర చరితులున్న (రెడ్ అలర్ట్) స్థానాలు 2019లో 36 శాతం కాగా ఈసారి ఏకంగా 53 శాతానికి పెరిగాయి. ఈ జాబితాలో 288 నియోజకవర్గాలు చేరాయి. అంటే దేశవ్యాప్తంగా ప్రతి రెండు లోక్‌సభ సీట్లలో ఒకటి రెడ్ అలర్ట్ స్థానమే!





సంపన్నుల్లో తెలుగు అభ్యర్థులే టాప్-2

అభ్యర్థుల్లో కోటీశ్వరులు 2019లో 16 శాతం కాగా ఈసారి 27 శాతానికి పెరిగారు. మొత్తం అభ్యర్థులలో 2,572 మంది కోటీశ్వరులే! ఈ జాబితాలో కూడా బీజేపీయే టాప్‌లో నిలిచింది. 440 మంది బీజేపీ అభ్యర్థుల్లో 403 కోటీశ్వరులే. అంటే 91.6 శాతం! 2019లో ఇది 41.8 శాతమే. 327 మంది కాంగ్రెస్ అభ్యర్థులలో 292 మంది (89%), 487 మంది బీఎస్పీ అభ్యర్థులలో 163 మంది (33%), 52 మంది సీపీఎం అభ్యర్థులలో 27 మంది (52%)), 3,903 మంది ఇండిపెండెంట్లలో 673 మంది (17%) మంది కోటీశ్వరులు. ఈ జాబితాలో తొలి, రెండో స్థానంలో తెలుగు అభ్యర్థులే ఉండటం విశేషం. ఏపీలోని గుంటూరు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఏకంగా రూ.5,705 కోట్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. తెలంగాణలోని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి రూ.4568.22 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు.

మహిళలకు బీజేడీ సముచిత స్థానం!

33 శాతం టికెట్లు వారికే



లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ (బీజేడీ) ఆదర్శంగా నిలిచింది. టికెట్ల కేటాయింపులో మహిళలకు సముచిత స్థానమిచ్చి గౌరవించింది. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలుంటే ఏడు చోట్ల మహిళలకు అవకాశం ఇచ్చింది. అంటే వారికి 33 శాతం సీట్లు కేటాయించింది. లేఖశ్రీ సమంత్ సింగార్ (బాలాసోర్), శర్మిష్ఠ సేథీ (జజ్‌పూర్), మంజులా మండల్ (భద్రక్), రాజశ్రీ మల్లిక్ (జగత్ సింగ్‌పూర్), పరిణీతి మిశ్రా (బార్‌గఢ్), కౌసల్యా హికాక (కోరాపుట్), రంజితా సాహూ (అస్కా)కు టికెట్లిచ్చింది. అదే సమయంలో టికెట్ల కేటాయింపులో ఫిరాయింపుదారులకు కూడా పెద్ద పీట వేసి విమర్శకుల నోళ్లకు పని చెప్పింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఏడుగురు మహిళలకు బీజేడీ చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్ టికెట్లివ్వడం గమనార్హం. ఈసారి బీజేడీ నుంచి బరిలోకి దిగిన ఏడుగురు మహిళా అభ్యర్థుల్లో బీజేపీ నుంచి వచ్చిన లేఖశ్రీ సమంత్ సింగార్ కూడా ఉన్నారు. ఆమె బాలాసోర్ నుంచి పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో కూడా ఏడుగురు బీజేడీ మహిళా అభ్యర్థుల్లో ఇద్దరు పార్టీ ఫిరాయింపుదారులున్నారు! ఈ విడత ఇద్దరు సిట్టింగ్ మహిళా ఎంపీలు చంద్రాణి ముర్మ (కియోంజర్), ప్రమీలా బిసోయ్ (అస్కా)లకు నవీన్ టికెట్లివ్వలేదు.

ఫిరాయింపుదారులకూ 33 శాతం

ఒకరిద్దరు కాదు.. బీజేడీ ఈ విడత ఏకంగా 38 శాతం మంది ఫిరాయింపుదారులను లోక్‌సభ బరిలో దింపడం ఆశ్చర్యకరం. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరు ఇతర పార్టీల నుంచి వచ్చిచేరిన వారే! లేఖశ్రీ సమంత్ సింగార్ (బాలాసోర్), భృగు బాక్సిపాత్ర (బెర్హాంపూర్), ప్రదీప్ మాంఝి (నబరంగ్‌పూర్), సురేంద్ర సింగ్ భోయ్ (బోలంగీర్), పరిణీత మిశ్రా (బార్‌గఢ్), ధనర్జయ్ సిధు (కియోంఝర్), అన్షుమన్ మహంతి (కేంద్రపర), మన్మోత్ రూట్రే (భువనేశ్వర్) ఇతర పార్టీల నుంచి వచ్చి బీజేడీ టికెట్ సంపాదించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

● పాటలీపుత్ర

లాలుకు లిట్మస్ టెస్టు

● బరిలో కూతురు మీసా భారతి
● ఆమె విజయం కోసం చెమటోడుస్తున్న వైనం

పాటలీపుత్ర లోక్‌సభ స్థానం బీజేపీ, ఆర్జేడీ మధ్య హోరాహోరీ పోరుకు వేదికైంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ రామ్ కృపాల్ యాదవ్ హ్యాట్రిక్‌పై గురిపెట్టారు. ఆయన చేతిలో రెండుసార్లు ఓడిన ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి ముచ్చటగా మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కూతురిని ఎలాగైనా గెలిపించుకోవాలని లాలు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు... - సాక్షి, నేషనల్ డెస్క్

బిహార్‌లోని పాటలీపుత్ర లోక్‌సభ స్థానం 2008లో డీలిమిటేషన్ తర్వాత ఏర్పాటైంది. 2009లో లాలు కూడా ఇక్కడ ఓటమి చవిచూడటం విశేషం. అది కూడా ఒకప్పటి తన శిష్యుడు జేడీ(యూ) నేత రంజన్ ప్రసాద్ యాదవ్ చేతిలో! తర్వాత మీసా భారతిని బరిలో దింపారు. తనను కాదని కూతురికి టికెటివ్వడంతో లాలుతో విభేదించిన రామ్‌కృపాల్ 2014లో ఆర్జేడీని వీడి బీజేపీలో చేరారు. 2014, 2019ల్లో రెండుసార్లు మీసా భారతిని ఓడించారు. విద్యార్థి సంఘాల నుంచి ఎదిగిన రామ్ కృపాల్ 1993లో ఆర్జేడీ టికెట్‌పై తొలిసారి ఎంపీగా గెలిచారు. తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. 1996లో, 2004లో కూడా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఐదుసార్లు ఎంపీగా చేసిన ఆయనకు బిహార్‌లో గట్టి రాజకీయ బలం ఉంది. పాటలీపుత్ర నియోజకవర్గ ప్రజలతో మంచి అనుబంధముంది. పిలిస్తే పలికే నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. నియోజకవర్గమంతా కలియదిరుగుతూ ఓటర్లను ప్రత్యక్షంగా కలుస్తున్నారు. రామమందిర నిర్మాణ ప్రభావం కూడా ఇక్కడి ఓటర్లపై బాగా ఉండటం ఆయనకు మరింత కలిసి రానుంది.



మీసా... మూడోసారి

పాటలీపుత్రలో ఆర్జేడీ ఓటమి పరంపరకు ఈసారి ఎలాగైనా బ్రేక్ వేయడానికి మీసా ప్రయత్నిస్తున్నారు. లాలు, భార్య రబ్రీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌తో సహా కుటుంబమంతా ఆమె గెలుపు కోసం పని చేస్తోంది. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం 2019లో మీసాకు బాగా మైనస్‌గా మారింది. ప్రజలకు అందుబాటులో ఉండరన్న అపప్రథను కూడగట్టుకున్నారు. ఈసారి కూడా ఎన్నికలవగానే మాయమవుతారా, గెలుపోటములతో నిమిత్తం లేకుండా నియోజకవర్గంలో ఉండి పని చేస్తారా అంటూ ప్రచారం పొడవునా ప్రజలు ఆమెను నిలదీస్తున్న పరిస్థితి! అయితే ఇక్కడ మోదీ ఫ్యాక్టర్ 2019లో ఉన్నంత బలంగా లేకపోవడం మీసాకు కాస్త ఊరట. పైగా పాటలీపుత్ర లోక్‌సభ స్థానం పరిధిలోని 6 అసెంబ్లీ స్థానాలూ ఆర్జేడీ, దాని మిత్రపక్షాల చేతిలోనే ఉన్నాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితరాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తున్నారామె.

కుల సమీకరణాలు...

బీజేపీకి మద్దతిచ్చే బ్రాహ్మణులతో సహా అగ్రవర్ణాల ఓట్లు పాటలీపుత్రలో లక్షకు పైగా ఉన్నాయి. దాదాపు 4 లక్షల ఓట్లున్న భూమిహార్ ఓటర్లలోనూ ఆ పార్టీకి బలముంది. 5 లక్షల యాదవ, 1.7 లక్షల కుర్మీ, 3 లక్షల దళిత ఓట్లు రామ్ కృపాల్, మీసా మధ్య చీలనున్నాయి. యాదవులతో పాటు 1.5 లక్షల ముస్లిం ఓట్లను మీసా నమ్ముకున్నారు. కాకపోతే మజ్లిస్ బరిలో ఉండటంతో ముస్లిం ఓట్లు చీలి ఆర్జేడీకి గట్టి నష్టమే చేసేలా కన్పిస్తోంది. హోరాహోరీ పోరులో ఈసారి పాటలీపుత్రలో లాంతరు వెలుగుతుందో, ముచ్చటగా మూడోసారీ కమలమే వికసిస్తుందో చూడాలి.

క్లుప్తంగా...

ఆక్వా ఎగుమతుల్లో ఏపీది అగ్రస్థానం

అప్సడా కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్



సాక్షి, భీమవరం: ఆక్వా రంగంలో 76 శాతం ఎగుమతులతో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో, ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని అప్సడా కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అన్నారు. టీడీపీ పాలనలో సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వా రంగాన్ని అప్సడా ద్వారా గట్టెక్కించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఆక్వా అభివృద్ధిని చూసి ఓర్వలేక విపక్ష నేతలు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆయన మండిపడ్డారు. తాడేపల్లిగూడెంలో బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఇటీవల వియత్నాం, థాయ్‌లాండ్ దేశాల్లో తమ బృందం పర్యటించి అక్కడి ఆక్వా సాగును పరిశీలించిందన్నారు. పట్టుబడి అనంతరం 18 గంటలపాటు లైవ్ ప్రాన్ అందించేందుకు అక్కడి టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్ర ఆక్వా రైతుల కోసం తమిళనాడు తరహాలో విశాఖ జిల్లా నక్కపల్లి వద్ద రూ.36 కోట్లతో బీఎంసీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని.. దీనివల్ల కేవలం 24 గంటల్లోనే రైతులకు టెస్ట్ రిపోర్ట్ అందుతుందని తెలిపారు.

అధికార లాంఛనాలతో సీతాదేవి అంత్యక్రియలు పూర్తి



అంత్యక్రియల్లో గౌరవ సూచకంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

కైకలూరు: ఉమ్మడి రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన యెర్నేని సీతాదేవి(74) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో కలిదిండి మండలం కొండూరు గ్రామంలో బుధవారం జరిగాయి. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో యెర్నేని సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆమె పార్థివ దేహాన్ని కొండూరు తరలించారు. కుమారులు విదేశాలలో ఉండటంతో అంత్యక్రియలు ఆలస్యమయ్యాయి. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సీతాదేవి మృతదేహానికి నివాళులర్పించారు. అధికార లాంఛనాల ప్రకారం పోలీసు సిబ్బంది గాల్లోకి గౌరవ సూచకంగా కాల్పులు జరిపారు.

వాడేసిన వంట నూనెతో బయోడీజిల్ తయారీ



ఆహార భద్రతా విభాగం చర్యలు... ● రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి ఈ నూనె కొనుగోలు
2022 నుంచి 4.34 లక్షల లీటర్ల నూనె సేకరణ ● బయోడీజిల్ తయారీ పరిశ్రమలకు సరఫరా...

సాక్షి, అమరావతి: సంప్రదాయ శిలాజ ఇంధనాలకు బదులు బయో ఇంధనాల వినియోగంతో కాలుష్యాన్ని తగ్గించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. ఈ క్రమంలో వాడేసిన వంట నూనెకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోంది. ఒకసారి వాడిన వంట నూనెను మళ్లీ మళ్లీ మరిగించి రెస్టారెంట్లు, హోటళ్లలో వాడుతుంటారు. ఇలా చేయడం ఆరోగ్యానికి ఎంతో హానికరం. ఓ వైపు ఈ అంశంపై అవగాహన కల్పిస్తూనే వాడిన వంట నూనెను బయోడీజిల్ తయారీ సంస్థలకు విక్రయించేలా రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ విభాగం చర్యలు తీసుకుంటోంది. వాడిన వంట నూనెను జాతీయ ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వద్ద రీయూజ్డ్ కుకింగ్ ఆయిల్ (రూకో) కింద రిజిస్టర్ అయిన సంస్థలకు హోటళ్లు, రెస్టారెంట్లు విక్రయిస్తున్నాయి.

4.34 లక్షల లీటర్ల నూనె కొనుగోలు

రోజుకు 50 లీటర్లకు మించి వంట నూనెను వినియోగించే హోటళ్లు, రెస్టారెంట్లు ఒకసారి వాడిన నూనెను బయో డీజిల్ తయారీకి విక్రయించాలని గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. రూకో విభాగంలో బయోడీజిల్ తయారు చేసే అనుమతులు ఉన్న పరిశ్రమలు గుంటూరు, విశాఖ, కాకినాడల్లో నాలుగు ఉన్నాయి. ఈ ఏజెన్సీలు రాష్ట్రవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో వాడిన వంట నూనెను సేకరిస్తున్నాయి. ఏజెన్సీల నిర్వాహకులే హోటళ్లు, రెస్టారెంట్‌ల వద్ద ఖాళీ డబ్బాలను అందుబాటులో ఉంచుతారు. ఆ డబ్బాల్లోకి వాడిన నూనెను నింపి సమాచారమిస్తే ఆ నిర్వాహకులే తీసుకునివెళ్తారు. మార్కెట్లో నూనె ధరలకు అనుగుణంగా సేకరించే వాడిన నూనెకు ఏజెన్సీలు డబ్బు చెల్లిస్తాయి. ఇలా 2022–23లో 1,33,339 లీటర్లు, 2023–24లో 3,01,199 లీటర్‌ల వంట నూనెను పరిశ్రమలు సేకరించాయి.

వాడిన నూనెను మళ్లీ వేడి చేసి వాడితే అనర్థాలు..

వాడిన వంట నూనెను పదే పదే వేడి చేసి ఆహారం తయారీకి వినియోగిస్తే ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ఈ అంశాన్ని ఇటీవల ఐసీఎంఆర్ సైతం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అలాంటి నూనెను మళ్లీ వినియోగించకుండా హోటళ్లు, రెస్టారెంట్లకు ఫుడ్ సేఫ్టీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కువ సార్లు నూనెను మరిగించి తినుబండారాలు తయారీ చేసే సంస్థలపై కేసులు నమోదు చేస్తున్నారు. వాడిన నూనెను బయో డీజిల్ తయారీకి విక్రయించేలా యాజమాన్యాలను ప్రోత్సహిస్తున్నారు. సాధారణంగా కంపెనీ నుంచి ఉత్పత్తయి వచ్చే నూనెలో టోటల్ పోలార్ కౌంట్ (టీపీసీ) 5 నుంచి 7 శాతం ఉంటుంది. అదే నూనెను మరిగించే కొద్దీ టీపీసీ పెరుగుతూ ఉంటుంది. టీపీసీ మోతాదు 25 శాతానికి మించితే ఆరోగ్యానికి చాలా హానికరం. టీపీసీ మోతాదు పెరిగే కొద్దీ శరీరంలో ఫ్రీ రాడికల్స్ పెరుగుతాయి. దీనివల్ల రక్తనాళాలు గట్టిపడటం, అల్జీమర్స్, కాలేయ సంబంధ వ్యాధులు, హైపర్ టెన్షన్ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని ఐసీఎంఆర్ హెచ్చరిస్తోంది. ఇలా వాడటం వల్ల స్థూలకాయం, గుండె జబ్బులు, క్యాన్సర్ , మధుమేహం వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముంటుంది.

మంటలు చెలరేగడంతో రైలు నిలిపివేత

లక్ష్మీపురం : గుంటూరు శివారు మణిపురం రైల్వే క్యాబిన్ వద్ద బుధవారం సాయంత్రం సాంకేతిక లోపం తలెత్తి మంటలు చెలరేగడంతో సికింద్రాబాద్–రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలును గంటన్నరకు పైగా నిలిపివేశారు. రైలు నంబర్ 17645 సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరి గుంటూరుకు సాయంత్రం 7.15 గంటలకు చేరుకుంది. రాత్రి 7.30 గంటలకు రేపల్లెకు బయల్దేరిన సమయంలో గుంటూరు శివారు మణిపురం క్యాబిన్ వద్దకు రాగానే విద్యుత్ తీగల్లో సాంకేతిక లోపం తలెత్తి పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న గుంటూరు రైల్వే డివిజన్ ఇంజినీరింగ్ విభాగాధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైల్వే విద్యుత్ లైన్‌లో లోపాన్ని గమనించిన అధికారులు రాత్రి 8.55 గంటల సమయంలో డీజిల్ ఇంజన్ ద్వారా రైలును ముందుకు తీసుకు వచ్చారు. అక్కడ నుంచి సికింద్రాబాద్–రేపల్లె ఎక్స్‌ప్రెస్ యథావిధిగా వెళ్ళింది.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి


చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కాల్పుల్లో ఏరియా కమిటీ సభ్యురాలు మడకం మాలిని, మిలీషియా కమాండర్ కుడియం మంగ్లు కన్నుమూశారు. జిల్లాలోని మద్దేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొరంబేడా – బందెపారా అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లాకు చెందిన డీఆర్‌జీ పోలీసులు కూంబింగ్ చేపట్టిన క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి.

వ్యాధి నిరోధకతకు ఏఐ సహకారం

సీసీఎంబీ–సీఎస్ఆర్‌తో అగనిత ఫార్మా ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: మలేరియా, క్షయ, నాడీ సంబంధిత రుగ్మతల సమస్యలను పరిష్కరించేందుకు సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయోలజీ–కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీసీఎంబీ–సీఎస్ఐఆర్) నడుంబిగించాయి. ఈ మేరకు ఫార్మా కంపెనీ అగనితతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహకారంతో తొలి దశలోనే వ్యాధులను గుర్తించేందుకు, న్యూరాలజీ పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఒప్పందం తోడ్పడనుంది. ఈ వివరాలపై సీఎస్ఐఆర్–సీసీఎంబీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2024 సంవత్సరంలోనూ మలేరియాను రూపుమాపేందుకు పోరాడుతూనే ఉన్నామని, ఔషధాలు, వ్యాక్సిన్ల కొరత ఇప్పటికీ ఉందని సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త పురణ్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ కొరతను అధిగమించేందుకు ఏఐ సహకారంపై పరిశోధనలు అవసరమన్నారు. వ్యాధి నిరోధకతను పెంచడమే లక్ష్యంగా చేసుకున్న ఈ ఒప్పందం ఆదర్శవంతంగా నిలువనుందని అగనిత ఎండీ ప్రసాద్ పేర్కొన్నారు.

భారత్‌లో ఏఐ జోరు



కృత్రిమ మేధను వినియోగిస్తున్న 92% మంది

ఏఐని వినియోగించుకోవడంపై 91% మంది ఆసక్తి
ఏఐ స్కిల్స్ ఉన్నవారి వైపే 80% కంపెనీల మొగ్గు
మైక్రోసాఫ్ట్–లింక్డ్ఇన్ వర్క్ ట్రెండ్ ఇండెక్స్ సర్వే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సాంకేతికత – విజ్ఞానం ఆధారిత ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల్లో 92 శాతం మంది కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)ను వినియోగిస్తున్నారని వర్క్ ట్రెండ్ ఇండెక్స్–2024 అధ్యయనం వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, లింక్డ్ ఇన్ సంయుక్త ఆధ్వర్యంలో 31 దేశాలలో 31 వేల మందిపై చేపట్టిన ఈ సర్వే పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దాదాపు 91 శాతం మంది భారతీయులు తమ రంగాల్లో పోటీతత్వాన్ని కొనసాగించడానికి కృత్రిమ మేధను వినియోగించుకోవడానికి ఆసక్తిగా ఉండగా, 54 శాతం మంది ఉద్యోగులు వారి ఆఫీస్‌లలో ఏఐ ప్రణాళికలు లేకపోవడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు.

ఏఐ అవగాహన లేకపోతే కష్టమే

రానున్న ఏడాదిలో ఏఐ ఉద్యోగస్తుల ప్రతిభ, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపించనుంది. భారత్‌లోని 75 శాతం సంస్థలు ఏఐ పరి/జ్ఞానంపై అవగాహన లేనివారికి ఉద్యోగాలు ఇవ్వడానికి నిరాసక్తతతో ఉన్నాయని, ఈ సూచి ప్రపంచ వ్యాప్తంగా 66 శాతం మాత్రమే ఉందని సర్వే ఫలితాలు తెలిపాయి. ముఖ్యంగా 80 శాతం సంస్థలు అనుభవం తక్కువ ఉన్నా సరే ఏఐ స్కిల్స్ ఉంటే చాలని, అవి లేకుండా ఎంత అనుభవమున్నా తమకొద్దని తేల్చి చెబుతున్నాయి. మరోవైపు దేశంలోని ఉద్యోగుల్లో ఏఐ వినియోగంపై ఆసక్తి విపరీతంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 75 శాతం మంది ఉద్యోగులు వారి వృత్తిలో భాగంగా ఏఐని వాడుతుంటే, భారత్‌లో 92 శాతం మంది వినియోగించడం విశేషం. ఇది సమయాన్ని ఆదా చేయడంతో పాటు సృజనాత్మకతను పెంచుతుందని భారతీయులు భావిస్తున్నారు. ఏఐ వినియోగం కోసం 72 శాతం మంది భారతీయులు సొంత ఏఐ సాధనాలను ఆఫీస్‌లకు తీసుకువెళుతుండం గమనార్హం. ముఖ్యంగా ఉద్యోగులు కోపైలెట్, చాట్ జీపీటీ వంటి ఏఐ నైపుణ్యాలను వారి ప్రొఫైల్‌లో జోడిస్తూ అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నారు. ఈ స్కిల్స్ పెంచుకునే క్రమంలో లింక్డ్ ఇన్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ నేర్చుకునే వారి సంఖ్య 160 శాతం పెరిగిందని అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ ఇండియా–దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ ఇరినా ఘోష్ మాట్లాడుతూ.. 'వర్క్ ట్రెండ్ ఇండెక్స్ అందించిన సమాచారం ప్రకారం కృత్రిమ మేధ అన్ని రంగాల్లో భాగమైంది. ముఖ్యంగా భారత్ ఇతర దేశాల కన్నా అత్యధికంగా 92 శాతం ఆసక్తి రేటుతో ఉత్తమ భవిష్యత్‌ను నిర్మించుకుంటోంది. ఇది దాదాపు అన్ని రంగాలలో విస్తరించడం గమనించాం..' అని చెప్పారు.



మేజర్ రాధికా సేన్

భారత ఆర్మీకి చెందిన మేజర్ రాధికా సేన్‌కు ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరానికి గాను 'మిలటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును ప్రకటించింది. ప్రతిష్టాత్మక ఈ అవార్డు కాంగోలో స్త్రీలు, బాలికల పట్ల హింస చోటు చేసుకోకుండా రాధికా సేన్ చూపిన శాంతి ప్రబోధానికి, ప్రచారానికి నిదర్శనం. రాధికాసేన్ పరిచయం.

కాంగోలో శాంతిదూత

తుపాకీ పట్టుకొని శాంతి కోసం ప్రయత్నించడం జటిలమైన పని. అంతర్యుద్ధం జరిగే దేశాల్లో బయటి దేశాల నుంచి వెళ్లి ఈ పని చేయాలంటే ప్రాణాలతో చెలగాటం. కాని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని పీస్ కీపింగ్ ఫోర్స్ ఆయా దేశాలలో శాంతి కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ప్రాణాలకు తెగిస్తూనే ఉంటుంది. అందుకే ఈ శాంతి దళాలలో గొప్పగా పని చేసిన వారికి ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాలలో అవార్డులు ఇస్తుంటుంది. లింగ వివక్ష, మహిళలపై హింసను సమర్థంగా నియంత్రించడానికి పని చేసే వారికి 'మిలటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' ఇస్తోంది. 2023 సంవత్సరానికి ఆ అవార్డు మన ఆర్మీ మేజర్ రాధికా సేన్‌కు దక్కింది.

ఈ కాంగోలో ఘోరాలు

మధ్య ఆఫ్రికాలో రెండు కాంగోలు ఉన్నాయి. ఒకటి 'రిపబ్లిక్ ఆఫ్ కాంగో' (ఆర్‌ఓసి), రెండు 'డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో' (డిఆర్‌సి). ఆఫ్రికాలో రెండవ అతి పెద్ద దేశం డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో. ఒకప్పుడు బెల్జియం వలసగా ఉన్న ఈ దేశం స్వతంత్రం పొంది 'మొబుతు' అనే నియంత పాలనలో మగ్గింది. అతణ్ణి ప్రజలు కిందకు దించాక 1998 నుంచి అక్కడ అస్థిర పాలన కొనసాగుతూ ఉంది. తరచూ అంతర్యుద్ధాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఆ దేశ తూర్పు ప్రాంతాలైన ఇటురి, నార్త్ కీవోలలో రెండు సాయుధ దళాల వల్ల దాడులు జరుగుతున్నాయి. 'ఎయిడెడ్ డెమొక్రటిక్ ఫోర్సెస్' అనే గ్రూప్, 'హుతూస్' అనే మరో గ్రూప్ తమ తమ కారణాల రీత్యా తీవ్ర హింసకు పాల్పడుతుంటాయి. ఈ రెండు గ్రూపుల మధ్య సామాన్య జనం నలుగుతున్నారు. వీరిని అదుపు చేయడానికి వచ్చే సైన్యం వీరి కంటే ఎక్కువ హింసకు పాల్పడుతోంది. వీటన్నింటి మధ్య కనీస ఓదార్పుగా ఐక్యరాజ్య సమితి శాంతి దళాలు పని చేస్తున్నాయి.

అత్యాచార పర్వం

రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని దాదాపు 30 లక్షల మంది స్త్రీలు, బాలికలు ఏదో ఒక మేర హింసకు, లైంగిక హింసకు లోనయ్యారు. అర్ధరాత్రి అపరాత్రి ప్రత్యర్థి గ్రూపులు దాడి చేసి స్త్రీలు, బాలికల మీద అత్యాచారాలు చేసి మగవారిని చంపేసి పోతారు. ఇవి అక్కడ స్త్రీల మీద తీవ్రమైన మానసిక ప్రభావాన్ని ఏర్పరుస్తున్నాయి. అత్యాచారాల వల్ల



వారిలో చాలామంది హెచ్.ఐ.వి/ఎయిడ్స్ బారిన పడుతున్నారు. అక్కడి చిన్నపిల్లలైతే దారుణమైన ఆకలిని ఎదుర్కొంటున్నారు. పౌష్టికాహారం ఊసే లేదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని బాధిత స్త్రీలలో విశ్వాసం నింపుతూ వారి కోసం సమర్థంగా పని చేయడం వల్ల రాధికా సేన్‌ను అవార్డు వరించింది.

బాధితుల కోసం దూతగా వచ్చి...

ఐక్యరాజ్య సమితి శాంతి దళాలలో భాగంగా ఆర్మీ మేజర్ రాధికా సేన్ 2023 ఏప్రిల్‌లో డి.ఆర్.కాంగోకు వెళ్లింది రాధికా సేన్. 'ఇండియన్ రాపిడ్ డిప్లాయ్‌మెంట్ బెటాలియన్'కు ఆమె అక్కడ కమాండర్‌గా పని చేసింది. అక్కడ మొదటగా ఆమె చేసిన పని తన బెటాలియన్‌కు కాంగో సంస్కృతిని పరిచయం చేయడం. స్త్రీల పట్ల సుహృద్భావనతో ఎలా మెలగాలో తెలియచేయడం. వారిలో ఆత్మవిశ్వాసం ఎలా కలిగించాలో చెప్పడం. రాధికా సేన్ నార్త్ కీవోలో పని చేసింది. అక్కడ స్త్రీల కోసం హెల్త్ ఎడ్యుకేషన్, ఉపాధి, లింగ సమానత్వం, కుటుంబ నిర్ణయాల్లో స్త్రీ ప్రాధాన్యం వంటి అంశాలలో రాధికా సేన్ వర్క్‌షాప్‌లు నిర్వహించింది. భర్తలను, పిల్లలను కోల్పోయిన స్త్రీలలో ఆత్మవిశ్వాసం నింపేలా వారితో తరచూ ఆమె సంభాషణలు నిర్వహించేది. వారు మళ్లీ పనిలో పడేలా చూసింది. హింసను సమష్టిగా ఎలా ఎదుర్కొనాలో అవగాహన కల్పించింది. కాంగో మహిళలు రాధికా సేన్‌ను తమలోని మనిషిగా చూశారు. ఆమె ద్వారా వారి ముఖాల్లో చిరునవ్వులు వచ్చాయి. అందుకే ఐక్యరాజ్యసమితి సెక్రెటరి జనరల్ ఆంటోనియో గుటెరస్ రాధికా సేన్‌కు అవార్డు ప్రకటిస్తూ 'రాధికా సేన్ కాంగో మహిళలను గొంతెత్తేలా చేయగలిగింది. శాంతి కోసం వారు ముందుకొచ్చేలా ఉద్యుక్తుల్ని చేసింది' అని మెచ్చుకున్నారు. మే 30 (నేడు) రాధికా సేన్‌కు అవార్డు బహూకరించనున్నారు.

జీరో టు మ..మ.. మాస్క్

'రెస్టారెంట్ మేనేజ్‌మెంట్' అంటే రెస్టారెంట్‌కు వెళ్లి ఇష్టమైన ఫుడ్ తిన్నంత ఈజీ కాదు. ఎన్నో సవాళ్లు వేడి వేడిగా ఎదురవుతుంటాయి. చల్లని ప్రశాంత చిత్తంతో వాటిని అధిగమిస్తేనే విజయం చేతికి అందుతుంది.

'యాక్సిడెంటల్ ఎంటర్‌ప్రెన్యూర్'గా తనను తాను పరిచయం చేసుకునే అదితి దుగర్‌కు వ్యాపారంలో ఎలాంటి అనుభవం లేకపోయినా రెస్టారెంట్ బిజినెస్‌లోకి వచ్చింది. అయితే ఆమె 'జీరో' దగ్గరే ఉండిపోలేదు. కాలంతోపాటు ఎన్నో పాఠాలు నేర్చుకొని ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయ ఢంకా మోగించింది. ముంబైలో అదితి నిర్వహిస్తున్న 'మాస్క్' వరల్డ్స్ 50 బెస్ట్ రెస్టారెంట్స్ జాబితాలో చోటు సాధించింది.

మనదేశంలో నంబర్‌వన్ రెస్టారెంట్‌గా గుర్తింపు పొందింది.

కొన్ని సంవత్సరాల క్రితం...

ముంబైలోని మహాలక్ష్మి ప్రాంతంలో 'మాస్క్' పేరుతో అదితి దుగర్ ఫైన్-డైనింగ్ రెస్టారెంట్ ప్రారంభించింది. అయితే ఈ రెస్టారెంట్ వ్యవహారం ఆమె మామగారికి బొత్తిగా నచ్చలేదు. సంప్రదాయ నిబద్ధుడైన ఆయన రెస్టారెంట్‌లోకి అడుగు కూడా పెట్టలేదు.

అలాంటి మామగారు కాస్తా 'మాస్క్' రెస్టారెంట్ తక్కువ సమయంలోనే బాగా పాపులర్ కావడం గురించి విని సంతోషించడమే కాదు రెస్టారెంట్‌కి వచ్చి భోజనం చేశాడు. తన స్నేహితులను కూడా రెస్టారెంట్‌కు తీసుకు వస్తుంటాడు.

తన కోడలు గురించి ఆయన ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటాడు.

ఎప్పటికప్పుడు కొత్త కొత్త వంటకాలను పరిచయం చేయడంతో 'మాస్క్' దూసుకుపోయింది. మోస్ట్ ఫార్వర్డ్ - థింకింగ్ ఫైన్-డైనింగ్ రెస్టారెంట్‌గా పేరు తెచ్చుకుంది.

ఉమ్మడి కుటుంబ వాతావరణంలో పెరిగిన అదితి ఎన్నో వంటకాల రుచుల గురించి పెద్దల మాటల్లో విన్నది. అలా వంటలపై తనకు తెలియకుండానే ఇష్టం ఏర్పడింది.

ఇద్దరు పిల్లల తల్లిగా నాలుగు సంవత్సరాలు ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. ఆ తరువాత కేటరింగ్‌పై దృష్టి పెట్టింది.

ఇంటి నుంచే మొదలుపెట్టిన కేటరింగ్ వెంచర్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తొలి అడుగు వేసింది అదితి. ఆహా ఏమి రుచి అనిపించేలా వంటకాల్లో దిట్ట అయిన తల్లి ఎన్నో సలహాలు ఇచ్చేది. ఒకవైపు తల్లి నుంచి సలహాలు తీసుకుంటూనే మరోవైపు ప్యాకేజింగ్ నుంచి మార్కెటింగ్ వరకు ఎన్నో విషయాల్లో తీరిక లేకుండా గడిపేది అదితి.

క్యాటరింగ్ అసైన్‌మెంట్స్‌లో భాగంగా అదితి ఒక బ్రిటిష్ హోం చెఫ్‌తో కలిసి పనిచేయాల్సి వచ్చింది. అయితే ఇది తన తల్లిదండ్రులు, అత్తమామలకు ఎంతమాత్రం నచ్చలేదు. దీనికి కారణం అతడు నాన్-వెజ్ చెఫ్ కావడమే.

అయితే ఆ సమయంలో భర్త ఆదిత్య అదితికి అండగా నిలబడ్డాడు. అత్తమామలు, తల్లిదండ్రులకు నచ్చచెప్పాడు.

ఒకవేళ ఆదిత్య కూడా అసంతృప్తి బృందంలో ఉండి ఉంటే అదితి ప్రయాణం ముందుకు వెళ్లేది కాదు. అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

'ఆ సమయంలో ఆదిత్య నాకు అండగా నిలబడకుంటే ఇంత దూరం వచ్చేదాన్ని కాదు' అంటుంది అదితి.

'అదితి విషయంలో నేను ఎప్పుడూ నో చెప్పలేదు. ఎందుకంటే ఆమె తప్పు చేయదు అనే బలమైన నమ్మకం ఉంది. ఏది చేసినా ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేస్తుంది. ఆమె ఆలోచనల్లో పరిణతి ఉంది' అంటాడు మెచ్చుకోలుగా ఆదిత్య.

'కొత్తగా ఆలోచించేవాళ్లకు తగిన స్వేచ్ఛ ఇచ్చి అడిగినవి సమకూర్చితే అద్భుతమైన ఫలితాలు చూపించగలరు' అనే ఆదిత్య మాటను అక్షరాలా నిజం చేసింది అదితి.

ఫ్యామిలీ హాలిడే ట్రిప్‌లో స్పెయిన్‌లో ఉన్న అదితికి 'మాస్క్' ఐడియా తట్టింది. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తరువాత తన కలకు శ్రీకారం చుట్టింది. 'ఫలానా దేశంలో ఫలానా వంటకం అద్భుతంగా ఉంటుంది. ఆ వంటకం మీ రెస్టారెంట్‌లో అందుబాటులో ఉండే బాగుంటుంది'... ఇలాంటి సలహాలు ఎన్నో కేటరింగ్ క్లయింట్స్ నుంచి వచ్చేవి.

ఎంతోమంది సలహాలు, సూచనలతో 'మాస్క్' మొదలై విజయం సాధించింది. అయితే 'మాస్క్' వేగానికి కోవిడ్ సంక్షోభం అడ్డుపడింది.

'కోవిడ్ సంక్షోభం వల్ల ఆర్థికంగా నష్టం వచ్చినప్పటికీ విలువైన పాఠాలు ఎన్నో నేర్చుకున్నాను. ఒక్క ముక్కలో చెప్పాలంటే కోవిడ్ అనేది మా వ్యాపారానికి సంబంధించి స్పష్టతను ఇచ్చింది' అంటుంది అదితి.

ఒక్కసారి వెనక్కి వెళితే...

'మాస్క్ పేరుతో డబ్బులు వృథా చేసుకోకండి. మీకు రెస్టారెంట్ బిజినెస్‌లో జీరో అనుభవం ఉంది. వ్యాపారంలో మీకు నష్టం తప్ప ఏమీ మిగలదు' అన్నారు చాలామంది.

'దశాబ్దాల అనుభవం ఉన్న వ్యాపారులైనా జీరో నుంచే మొదలవుతారు' అనే విషయం అదితికి తెలియనిది కాదు. 'జీరో' నుంచి మొదలైన ఆమె ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్థాయికి చేరింది. అదితి దుగర్ విజయం ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది.


గెలుపు దారి

అదితి దుగర్

'దశాబ్దాల అనుభవం ఉన్న వ్యాపారులైనా జీరో నుంచే మొదలవుతారు' అనే విషయం అదితికి తెలియనిది కాదు. 'జీరో' నుంచి మొదలైన ఆమె ప్రయాణం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే స్థాయికి చేరింది.

సురక్ష

కడుపులోని బిడ్డ జాగ్రత్త

కర్ణాటక ప్రభుత్వం అల్ట్రాస్కానింగ్ గదిలోకి గర్భిణులతో పాటు వచ్చే అటెండర్స్‌ను నిషేధిస్తూ సర్క్యులర్ తెచ్చింది. ప్రతి తల్లి తన కడుపులో ఉన్న బిడ్డ ఆడపిల్లైనా మగపిల్లాడైనా కనడానికి సిద్ధంగా ఉంటుంది. కాని అటెండర్స్ రూపంలో వచ్చే అయినవాళ్లు అల్ట్రాస్కానింగ్‌ని వీడియో తీసి లింగ నిర్ధారణ చేయిస్తున్నారు. తర్వాత అబార్షన్ చేయిస్తున్నారు. ఇలా ఎన్ని రాష్ట్రాల్లో జరుగుతున్నదో. కర్ణాటక మేలుకొంది. ఆ రాష్ట్రం తీసుకున్న మరిన్ని జాగ్రత్తలు...

హర్యాణలోని జాట్ కుటుంబంలో యోగ్యుడైన వరునికి తగిన వధువు కోసం 3000 కిలోమీటర్ల దూరంలో కూడా వెతుకుతున్నారనే వార్తలు వస్తున్నా కానీ ఆడశిశువుల భ్రూణ హత్యల విషయంలో మనలో మార్పు రావడం లేదు. 2000 సంవత్సరం నుంచి 2019లోపు మన దేశంలో 90 లక్షల మంది ఆడపిల్లలు భ్రూణ హత్యల ద్వారా పుట్టకుండానే మరణించారని ఒక అధ్యయనం చెబుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం కశ్మీర్, హర్యాణ, మహారాష్ట్ర రాష్ట్రాలలో 120 మంది అబ్బాయిలకు 100 మంది అమ్మాయిలే ఉన్నారు. లెక్కలు ఇంత భయపెడుతున్నా నేటికీ



ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలలో లింగ నిర్ధారణ జరిపించి మరీ ఆడపిల్లలను ఛిద్రం చేస్తూనే ఉన్నారు. తాజాగా కర్ణాటకలోని మాండ్య జిల్లాలో ఈ రాకెట్ ఒకటి బట్టబయలు కావడంతో ప్రభుత్వం మేల్కొని కొత్త నియమ నిబంధనలు తెచ్చింది.

చట్టం ఉన్నా...

ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయగ్నొస్టిక్ టెక్నిక్స్ (పిసిపిఎన్‌డిటి) యాక్ట్ 1994 (లింగ నిర్ధారణ నిషేధ చట్టం) కింద లింగ నిర్ధారణ చేయించేవారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా ఉన్నా కొందరు ఎప్పటికప్పుడు దొంగదారులు కనిపెడుతూనే ఉన్నారు. ఇటీవల కర్ణాటకలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలులో భాగంగా రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులతో ఒక వర్క్‌షాప్ జరిగినప్పుడు వారు కొన్ని విషయాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

- పేషెంట్లతో పాటు అటెండర్ల పేరుతో బంధువులు లోపలికి వస్తున్నారు.
- అల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను తమ మొబైల్ కెమెరాలలో బంధిస్తున్నారు.
- సింగపూర్, థాయ్‌లాండ్, దుబాయ్ దేశాలలో లింగ నిర్ధారణ నేరం కాదు.
- కొందరు ఒక రాకెట్‌లాగా ఏర్పడి ఆ వీడియోలను ఈ దేశాలలోని వైద్యులకు పంపి లింగ నిర్ధారణ చేయిస్తున్నారు. ఆ తర్వాత అబార్షన్లు చేయిస్తున్నారు.

తాజాగా మాండ్యాలో ఇలాంటి రాకెట్‌ను పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. ఇంకా విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం వెంటనే కొత్త సర్క్యులర్ జారీ చేసింది.

ఇతరులు రాకూడదు

- అల్ట్రాసౌండ్ గదిలోకి గర్భిణితో పాటు ఇకపై అటెండర్లు రాకూడదు. వారికి ప్రవేశం లేదు.
- గర్భిణి తన అల్ట్రాసౌండ్ పరీక్షను గమనించేలాగా గతంలో అడిషనల్ స్క్రీన్ గదిలో ఉంచేవారు. ఇకపై ఆ స్క్రీన్ ఉండదు. అంటే గర్భిణి తన అల్ట్రాసౌండ్ పరీక్షను చూడటానికి అనుమతి లేదు. ఎందుకంటే కొందరు రేడియాలజిస్ట్‌లు డబ్బుకు కక్కుర్తి పడి ఒక మాట గాని, చర్యగాని లేకుండా గర్భిణులకు అర్థమయ్యేలా పాయింటర్‌తో చూపుతున్నారు.

ఆడపిల్లలు చదువులో అద్భుతంగా రాణిస్తున్నా, ఉపాధి అవకాశాలు పొందుతున్నా, క్రీడల్లో పతకాలతో మెరుస్తున్నా, రాజకీయ పదవులు పొందుతున్నా, ఉన్నతోద్యోగాలు చేస్తున్నా ఇంకా 'కొడుకు' కావాలనే కోరిక చాలామంది తల్లిదండ్రులను పీడిస్తోంది. ఆ భావజాలం నుంచి కొద్దిగా బయటపడినా చాలా మంది ఆడపిల్లలు బతికిపోతారు. బంగారు దేశాన్ని నిర్మిస్తారు.

బ్యూటిప్స్

తేనీటి సౌందర్యం



టీ డికాషన్‌ని ఉపయోగించడం వల్ల వేసవి తాపం నుంచి చర్మాన్ని, శిరోజాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అయితే, ఇందుకు తేయాకులను మాత్రమే ఉపయోగిస్తే సరైన ఫలితం లభిస్తుంది.

- చల్లారిన అరకప్పు టీ డికాషన్‌లో రెండు టీ స్పూన్ల బియ్యప్పిండి, అర టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, 20 నిమిషాలు ఆరనివ్వాలి. శుభ్ర పరుచుకోవడానికి ముందు కొన్ని నీళ్లు ముఖం మీద చల్లి, వేళ్లతో వలయాకారంగా రుద్దాలి.
- టీ డికాషన్‌లో ఐస్ క్యూబ్ వేసి, ఆ నీటిని ముఖానికి స్ప్రే చేసుకొని, కాసేపు సేదతీరాలి. ఎండ బారిన పడి ఇంటికి వచ్చినప్పుడు ఇలా చేయడం వల్ల కమిలిన చర్మం తిరిగి పూర్వపు స్థితికి చేరుకుంటుంది.
- టబ్ బాత్ చేసేటప్పుడు కొన్ని తేయాకులు నీటిలో వేసి, అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల ఎండవల్ల కలిగిన అలసట నుంచి చర్మం విశ్రాంతి పొందుతుంది.
- జుట్టు పొడిబారి నిర్జీవంగా మారితే తలస్నానం చేసిన తర్వాత టీ డికాషన్‌తో కడగాలి. కండిషనర్‌లా ఉపయోగపడుతుంది.

బాడీ షేమింగ్‌కి ఫిట్‌నెస్ మంత్ర

'కొన్నిసార్లు మీరు భయపడకుండా వేసే ఒక్క అడుగు జీవన గమనాన్ని మెరుగ్గా మార్చేస్తుంది' అంటుంది 24 ఏళ్ల అశ్వతి ప్రహ్లోదన్. బాడీ షేమింగ్‌ను ఎదుర్కొన్న అశ్వతి ఇప్పుడు మిస్ కేరళ ఫిజిక్‌గా టైటిల్ గెలుచుకుంది.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి ఫిట్‌నెస్ కోచ్‌గా మారింది. సోషల్ మీడియాలో లక్షమంది ఫాలోవర్లతో బిజీగా ఉంది. ఎగతాళి మాటల నుంచి పట్టిన పట్టుదల ఎందరిలోనో స్ఫూర్తిని కలిగిస్తుంది.

"ఒక దశలో నేను బాగా బరువు తగ్గిపోయాను. కారణం కొన్నిరోజుల పాటు వేధించిన జ్వరం. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గిపోయింది. సరైన ఆహారం తీసుకోలేక బాగా సన్నబడిపోయాను. కొన్నాళ్ల పాటు ఆ సమస్యను జనాల నుంచి సూటిపోటి మాటల ద్వారా ఎదుర్కొన్నాను. 'ఎందుకు ఇంత సన్నగా ఉన్నావు? ఇంట్లో వాళ్లు ఫుడ్ పెట్టడం లేదా? గాలికి ఎగిరిపోయేలా ఉన్నావ్?'.. లాంటి మాటలను ఎదురుగానే అనేవాళ్లు. చుట్టుపక్కల, బంధువులు రకరకాల సలహాలు ఇచ్చేవారు. దాంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయినా ఉద్యోగానికి వెళ్లాలంటే భయంగా ఉండేది. అమ్మాయిలు లావుగా ఉన్నా, మరీ సన్నగా ఉన్నా ఈ సమాజంలో జనం ఏదో ఒకటి అంటూ బాధించాలనే చూస్తారు. ఇదో పెద్ద మానసిక ఒత్తిడిగా అనిపించేది. ఈ ట్రామా నుంచి ఎలాగైనా బయట పడాలనుకున్నాను. అప్పుడే ఫిట్‌నెస్‌లోకి రావాలనుకున్నాను.

నన్ను నేను ప్రేమించుకుంటూ..

జనాలు ఎగతాళిగా అనే బాడీ షేమింగ్ వ్యాఖ్యలను అసలు పట్టించుకోవడం మానేశాను. నన్ను నేను ప్రేమించుకోవడం ప్రారంభించాను. నాలా బాధపడేవారికి ఓ రోల్ మోడల్‌గా ఉండాలని జిమ్‌లో చేరాను. నా జీవనశైలిలో మార్పులు చేసుకున్నాను. సమతుల ఆహారంపై అవగాహన పెంచుకుని, దానిని తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాను. ఫలితంగా ఆరోగ్యంలో మార్పు వచ్చింది. మానసిక ఆరోగ్యమూ మెరుగుపడింది. దీంతో ఫిట్‌నెస్‌లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నాను. ఎంతగా సాధన చేస్తూ వచ్చానంటే బాడీ షేమింగ్ బాధితులకు కేరళ ఫిజిక్ టైటిల్‌ను అంకితం చేసేవరకు నన్ను నేను మలుచుకోవడంలో ఒక తపస్సే చేశాను.

విమర్శలను పట్టించుకోను..

'ఏమీ చేయని వ్యక్తులే జీవితంలో ఏదైనా సాధించాలని ప్రయత్నించేవారిని నిందిస్తుంటారు. మొదట్లో వారి మాటలకు నేను కూడా ఎదురు సమాధానం చెప్పేదాన్ని. ఇప్పటికి కూడా సోషల్‌మీడియాలో ఫేక్ అకౌంట్లతో నన్ను నిందించే ప్రయత్నం చేసేవాళ్లున్నారు.

టైటిల్ సాధనతో ఇప్పుడు చెడు వ్యాఖ్యలు చేసేవారి సంఖ్య తగ్గి, పాజిటివ్ కామెంట్స్ హైలైట్ అవుతున్నాయి.

అపోహలు వద్దు

మగవారిలాగా తమ శరీరం కూడా కండలు తిరిగిపోతుందేమోనన్న భయంతో వర్కవుట్ చేయని మహిళలు ఉన్నారు. మరోవైపు వర్కవుట్ చేస్తూ బరువు తగ్గుతూ ఉంటే, ఏదైనా కారణాలతో మధ్యలో జిమ్ ఆపేస్తే మళ్లీ బరువు పెరుగుతామేమోనని అంటూ ఆందోళనపడేవారూ ఉన్నారు. ఇలాంటి అపోహలు మన సమాజంలో చాలా ఉన్నాయి. అలాంటి వారికి చెప్పేది ఏమిటంటే 'జిమ్‌లోనూ, ఇంట్లోనూ మంచి జీవనశైలిని పాటించకుండా ఈ దురభిప్రాయాలకు రావద్దు. ముప్పై ఏళ్లు దాటిన తర్వాత మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గి, కండరాలు ద్రవ్యరాశిని కోల్పోయే అవకాశం ఉంది. కండర నిర్మాణానికి వ్యాయామం ఆరోగ్యకరం. కండరాలను నిర్మించడం అంటే శరీరం అంతా కండరాలుగా మారడం కాదు. ఫిట్‌నెస్‌ను ప్రాక్టీస్ చేస్తే మానసిక, శారీరక ఆరోగ్యంతో సహా అన్ని విషయాలు మెరుగుపడతాయి. అందుకని, అపోహలతో ఫిట్‌నెస్‌లోకి రావద్దు. మన వెనక జనాలు ఏదో మాట్లాడుతున్నారని వెనకడుగు వేయద్దు. నా విషయంలో అయితే ఈ రంగంలోకి రావడమే మంచి నిర్ణయం అయింది. అందరూ ఈ విషయాన్ని అంగీకరించారు కూడా. మన శరీరానికి సరైన రీతిలో శిక్షణ ఇస్తే మరిన్ని అద్భుతాలను మనమే చేయచ్చు.

నా జీతం మొత్తం...

ఏడాదిన్నర క్రితం ఇన్ఫోపార్క్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడే ఫిట్‌నెస్‌ను కూడా నా జీవితంలో భాగం చేసుకున్నాను. కానీ, పనిలో చాలా ఒత్తిడి ఉండేది. ఒక్కోసారి తొమ్మిది నుంచి పదకొండు గంటలు పని చేయాల్సి వచ్చేది. ఆ పనుల మధ్య జిమ్‌కి వెళ్లేందుకు సమయం దొరకడం కష్టమైంది. కుటుంబం నుంచి మద్దతు లభించింది. నా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంది మా అమ్మ. కానీ... వృత్తిని, అభిరుచిని కలపడం చాలా కష్టం అని గ్రహించాను. ఫిట్‌నెస్‌లో పోషకాహారం ఖరీదైనది. నాకు ఉద్యోగం ఉంది కాబట్టి నా అభిరుచిని కొనసాగించగలిగాను. జీతం నా పోషణకు సరిపోయేది. కొన్ని సంప్లిమెంట్ల కోసం స్పాన్సర్లను వెతికాను. కానీ, లభించలేదు. దీంతో నా జీతం మొత్తం నా పౌష్టికాహారం కోసమే కేటాయించే దాన్ని. మరి ప్రయోజనాలు ఏంటి అని ఎవరైనా అడగచ్చు. ఈ రంగంలోకి వచ్చినతర్వాత నేనెవరో నాకు అర్థమైంది. పాటలు పాడతాను, డ్యాన్స్ చేస్తాను. ఫిట్‌నెస్ నన్ను ఎప్పుడూ ఉల్లాసంగా ఉంచుతుంది. ఇది విజయంగా భావిస్తున్నాను. అంతేకాదు, నా ఫిట్‌నెస్ ఇప్పుడు నా ఆదాయ వనరు కూడా. అందుకే, ఉద్యోగాన్ని మానేసి బిజీ ట్రైనర్‌గా మారిపోయాను' అంటూ తన ఫిట్‌నెస్ రహస్యాలను చెబుతుంది అశ్వతి.




అశ్వతి ప్రహ్లోదన్







గుకేశ్-డింగ్ లిరెన్ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌కు భారత్ బిడ్

ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌లలో జరిగే పురుషుల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఆతిథ్య హక్కుల కోసం అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) బిడ్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ధ్రువీకరించింది. ఇప్పటికైతే కేవలం భారత్ నుంచి మాత్రమే బిడ్‌ను అందుకున్నామని, మరో రెండు రోజుల్లో బిడ్‌ను స్వీకరించే తుది గడువు ముగియనుందని ఫిడే సీఈఓ ఎమిల్ సుతోవ్‌స్కీ తెలిపారు. ఏప్రిల్‌లో టొరంటోలో జరిగిన క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ప్రస్తుత విశ్వ విజేత డింగ్ లిరెన్ (చైనా)తో తలపడతాడు. ఒకవేళ భారత్‌కు ఆతిథ్య హక్కులు లభిస్తే 14 రౌండ్‌లపాటు జరిగే ఈ మెగా మ్యాచ్‌కు నవంబర్ 20 నుంచి డిసెంబర్ 15 వరకు గుకేశ్ సొంత నగరం చెన్నై వేదికగా నిలుస్తుంది. ఈ మెగా మ్యాచ్‌ను నిర్వహించేందుకు సింగపూర్ కూడా సుముఖంగా ఉందని, అయితే అధికారికంగా ఇంకా బిడ్ దాఖలు చేయలేదని తెలిసింది.





టైటిల్ వేట మొదలైంది...

జొకోవిచ్ శుభారంభం ● రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంపియన్

పారిస్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గాలనే లక్ష్యంతో ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) తొలి రౌండ్‌ను దాటాడు. ప్రపంచ 142వ ర్యాంకర్ హెర్బర్ట్ (ఫ్రాన్స్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 2 గంటల 31 నిమిషాల్లో 6-4, 7-6 (7/3), 6-4తో గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ నెట్ వద్ద 19 పాయింట్లు గెలిచాడు. మరోవైపు మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా), తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్, సిట్సిపాస్‌లకు తమ ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురు కాగా... రుబ్లెవ్ వరుస సెట్‌లలో విజయాన్ని అందుకున్నాడు. అల్‌కరాజ్ 3 గంటల 9 నిమిషాల్లో 6-3, 6-4, 2-6, 6-2తో జెస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై, సిట్సిపాస్ 2 గంటల 43 నిమిషాల్లో 6-3, 6-2, 6-7 (2/7), 6-4తో అల్ట్‌మెయిర్ (జర్మనీ)పై, రుబ్లెవ్ 2 గంటల 1 నిమిషంలో 6-3, 6-4, 6-3తో పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)పై గెలుపొందారు. జాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో అల్‌కరాజ్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేశాడు. 35 విన్నర్స్ కొట్టిన ఈ స్పెయిన్ స్టార్ ఏకంగా 47 అనవసర తప్పిదాలు చేయడం గమనార్హం. మహిళల సింగిల్స్‌లో 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా), ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సోఫియా 6-3, 6-3తో 21వ సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్)పై, ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-3, 1-6, 6-3తో కామిలా ఒసోరియో (కొలంబియా)పై గెలుపొందారు. భారీ వర్షాల కారణంగా బుధవారం ఏకంగా 23 సింగిల్స్ మ్యాచ్‌లను వాయిదా వేశారు.



పారిస్ ఒలింపిక్స్‌కు విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో అంకుశిత, నిశాంత్





బ్యాంకాక్: పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లను ఖరారు చేసుకోవడానికి భారత బాక్సర్లు అంకుశిత బోరో (60 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) విజయం దూరంలో నిలిచారు. వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో వీరిద్దరూ తమ విభాగాల్లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ యూత్ మాజీ చాంపియన్ అంకుశిత 4-1తో ఆసియా చాంపియన్ రిమా వొలోసెంకో (కజకిస్తాన్)పై నెగ్గగా... నిశాంత్ 5-0తో పీరాపట్ యెసుంగ్‌నోయెన్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేశాడు. మహిళల 66 కేజీల విభాగంలో అరుంధతి 5-0తో స్టెఫానీ పీనీరో (ప్యూర్టోరికో)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. అయితే పురుషుల ప్లస్ 92 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో నరేందర్ 2-3తో గిల్మర్ కాంగో (ఈక్వెడార్) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే పురుషుల 57 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్లో బతుహాన్ సిఫ్టిసి (టర్కీ)తో సచిన్ సివాచ్... 51 కేజీల రెండో రౌండ్‌లో రూయిజ్ (మెక్సికో)తో అమిత్.. 92 కేజీల రెండో రౌండ్‌లో లూయిస్ (వెనిజులా)తో సంజీత్... మహిళల 57 కేజీల రెండో రౌండ్‌లో మసాతి (అజర్‌బైజాన్)తో జైస్మిన్ తలపడతారు.

సింధు, ప్రణయ్ ముందుకు...

సింగపూర్: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-12, 22-20తో ప్రపంచ 21వ ర్యాంకర్ లినె హొమార్క్ జార్స్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రణయ్ 21-9, 18-21, 21-9తో జూలియన్ కరాగి (బెల్జియం)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన అగ్రశ్రేణి ఆటగాళ్లు లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లక్ష్య సేన్ 13-21, 21-16, 13-21తో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోగా... కొడాయ్ నరోకా (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ తొలి గేమ్‌ను 14-21తో కోల్పోయి రెండో గేమ్‌లో 3-11తో వెనుకబడ్డాడు. ఈ దశలో మోకాలి గాయంతో శ్రీకాంత్ వైదొలిగాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కరోలినా మారిన్ (స్పెయిన్)తో సింధు; కెంటా నిషిమోటో (జపాన్)తో ప్రణయ్ తలపడతారు. ముఖాముఖి రికార్డులో సింధు 5-11తో, ప్రణయ్ 2-3తో వెనుకబడి ఉన్నారు.



అశ్విని-తనీషా జోడీ ఓటమి

పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ ఈ టోర్నీలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పొలీనా బురోవా-యెవెనియా (ఉక్రెయిన్) జంటతో జరిగిన మ్యాచ్‌లో అశ్విని-తనీషా ద్వయం 21-18, 19-21, 19-21తో ఓడిపోయింది. పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట 21-7, 21-14తో చెంగ్ యు పె-సస్ యు సింగ్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో బేక్ హా నా-లీ సో హీ (దక్షిణ కొరియా)లతో గాయత్రి-ట్రెసా పోటీపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి (భారత్) జోడీ 18-21, 19-21తో గో సూన్ హువాట్-లాయ్ షెవోన్ జేమీ (మలేసియా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, లక్ష్య సేన్

● ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా జోడీ



వైశాలి చేతిలో హంపి ఓటమి

స్టావెంజర్: నార్వే చెస్ మహిళల టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత స్టార్ కోనేరు హంపి తొలి ఓటమిని చవిచూసింది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలితో జరిగిన రెండో రౌండ్ క్లాసికల్ గేమ్‌లో హంపి 44 ఎత్తుల్లో ఓడిపోయింది. క్లాసికల్ గేమ్‌లో నెగ్గినందుకు వైశాలికి మూడు పాయింట్లు లభించాయి. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో రెండో రౌండ్ తర్వాత వైశాలి నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో వైశాలి తమ్ముడు ప్రజ్ఞానందకు రెండో రౌండ్ అర్మగెడాన్ గేమ్‌లో ఓటమి ఎదురైంది. ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్‌తో జరిగిన రెండో రౌండ్ క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఇద్దరి మధ్య విజేతను నిర్ణయించడానికి అర్మగెడాన్ గేమ్ నిర్వహించగా తెల్ల పావులతో ఆడిన డింగ్ లిరెన్ 51 ఎత్తుల్లో ప్రజ్ఞానందను ఓడించాడు.



కసరత్తులు షురూ!

మైదానంలో శ్రమించిన భారత క్రికెటర్లు ● తొలి రోజు ఫిట్‌నెస్‌పై దృష్టి

న్యూయార్క్: టి20 ప్రపంచకప్ వేటలో అమెరికా గడ్డపై అడుగు పెట్టిన భారత క్రికెట్ బృందం మొదటి రోజు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మినహా మిగతా ఆటగాళ్లంతా ఇందులో పాల్గొన్నారు. కోహ్లి ఇంకా న్యూయార్క్ చేరుకోలేదు. టీమిండియా స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్ ఈ ట్రయినింగ్ సెషన్‌ను పర్యవేక్షించారు. ముఖ్యంగా భారత్‌తో పోలిస్తే పూర్తిగా భిన్నమైన యూఎస్ వాతావరణానికి అలవాటు పడటంపై ఆటగాళ్లు దృష్టి సారించారు. ఐపీఎల్ కారణంగా మన క్రికెటర్లంతా 90 శాతంకి పైగా డే అండ్ నైట్ మ్యాచ్‌లే ఆడారు. కానీ వరల్డ్ కప్ లీగ్ దశలో అమెరికా వేదికపై జట్టు 25-27 డిగ్రీల వాతావరణంలో అన్నీ డే మ్యాచ్‌లే (ఉదయం గం. 10:30 నుంచి) ఆడబోతోంది. ట్రయినింగ్ సెషన్‌లో క్రికెటర్లు స్వల్ప జాగింగ్, రన్నింగ్‌తో పాటు కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడారు. 'టైమ్ జోన్‌కు అలవాటు పడటం అన్నింటికంటే ముఖ్యం. జట్టు సభ్యులంతా కూడా దాదాపు రెండున్నర నెలల తర్వాత మళ్లీ ఒక్క చోటికి చేరారు. వారి ఫిట్‌నెస్ స్థితి ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దానిని బట్టి ముమ్ముందు రోజుల కోసం ప్రణాళికలు రూపొందిస్తాను' అని దేశాయ్ చెప్పారు. వాతావరణం చాలా బాగుందని హార్దిక్ పాండ్యా అభిప్రాయపడగా... న్యూయార్క్‌లో తొలిసారి ఆడనుండటం పట్ల రవీంద్ర జడేజా ఉత్సాహంగా ఉన్నాడు. నగర శివార్లలోని నాసా కౌంటీ స్టేడియంలో జూన్ 1న బంగ్లాదేశ్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచ్ వరకైనా కోహ్లి జట్టుతో చేరతాడా లేదా అనే విషయంలో బీసీసీఐ స్పష్టతనివ్వలేదు. జూన్ 5న అసలు పోరులో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.



న్యూయార్క్‌లో '2023 ఐసీసీ టి20 ప్లేయర్ ఆఫ్ ఇయర్' అవార్డుతో సూర్యకుమార్

'నంబర్‌వన్' ర్యాంక్‌తో ప్రపంచకప్‌లోకి...

టి20 ప్రపంచకప్ టోర్నీలో టీమిండియా నంబర్‌వన్ ర్యాంకర్‌గా బరిలోకి దిగనుంది. బుధవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 ర్యాంకింగ్స్‌లో భారత్ 264 రేటింగ్ పాయింట్లతో తమ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. రెండుసార్లు టి20 వరల్డ్ చాంపియన్ వెస్టిండీస్ రెండు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరుకుంది. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను వెస్టిండీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంతో ఆ జట్టు ర్యాంక్ మెరుగైంది. దక్షిణాఫ్రికా నాలుగు స్థానాలు పడిపోయి ఏడో ర్యాంక్‌లో నిలిచింది.

సినిమా



ఈ కథలో ఆ పదాలు ఆకట్టుకున్నాయి
- ఆనంద్ దేవరకొండ

''**మ**నుషుల్లో భయం, అత్యాశ, కుట్ర అనే లక్షణాలుంటాయి. అవి కొందరి జీవితాలను ఎలా ప్రభావితం చేశాయి? అనేది 'గం.. గం..గణేశా'లో చూపిస్తున్నాం. వినాయకుడి విగ్రహం చుట్టూ జరిగే కథ ఇది. ఆ విగ్రహం దక్కించుకోడానికి కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ విగ్రహంలో అంత విలువైనది ఏముంది? అనేది చిత్ర కథాంశం'' అన్నారు హీరో ఆనంద్ దేవరకొండ. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'గం..గం..గణేశా'. వంశీ కారుమంచి, కేదార్ సెలగంశెట్టి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతున్న సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఉదయ్ 'గం..గం..గణేశా' స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆ కథలోని అత్యాశ, భయం, కుట్ర అనే మూడు పదాలు నన్ను అట్రాక్ట్ చేశాయి. 'స్వామి రారా' వంటి క్రైమ్ కామెడీ మూవీ చూసినప్పుడు తెలుగులో ఇలాంటి చిత్రాలు మరికొన్ని చేయొచ్చు కదా? అనిపించేది. 'గం..గం..గణేశా' అలాగే ఉంటుంది. ఇందులో నేను ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటాను. ఇటీవల ఫ్యామిలీ, యూత్ ఆడియన్స్ కోసం 'గం..గం..గణేశా' షోస్ వేశాం. వాళ్ల స్పందన చూసి మాకు సినిమా విజయంపై మరింత నమ్మకం వచ్చింది. ఈ కథలో పదిహేను కీలక పాత్రలు ఉంటాయి. ఇంతమందితో నటన రాబట్టుకోవడంలో ఒక కొత్త డైరెక్టర్‌గా ఉదయ్ సక్సెస్ అయ్యాడు. నా ఫ్రెండ్స్ కేదార్, వంశీ ఈ సినిమా కోసం చాలా సపోర్ట్ చేశారు. రష్మికా మందన్న మా ఫ్యామిలీ ఫ్రెండ్.. అందుకే నా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి వచ్చారు. నాకు రా యాక్షన్ మూవీస్ చేయడం ఇష్టం. వినోద్ అనంతోజు దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో చేస్తున్న మూవీ అలానే ఉంటుంది. ప్రస్తుతం 'డ్యూయెట్' సినిమాలో నటిస్తున్నాను'' అన్నారు.



● అల్లు అర్జున్, రష్మికా మందన్న

సంటోడే నా సామీ...

పుష్పరాజ్, శ్రీ వల్లి కలిసి చిందేస్తే థియేటర్ విజిల్స్‌తో మోత మోగిపోద్ది. 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో ఇదే కనిపించింది. మళ్లీ అదే జోష్‌తో వస్తున్నారు ఈ ఇద్దరూ. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీ వల్లి పాత్రలో రష్మికా మందన్న నటిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్'. 'పుష్ప' ఫ్రాంచైజీ మలి భాగం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ఈ సినిమా నుంచి 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ..' అనే పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. 'వీడు మొరటోడు అని వాళ్లు వీళ్లు.. ఎన్నెన్ని అన్న పసిపిల్లవాడు నా వాడు..' అంటూ మొదలయ్యే ఈ పాట 'మెత్తానీ పత్తి పువ్వులా మరి సంటోడే నా సామీ...' అంటూ సాగుతుంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా శ్రేయా ఘోషల్ పాడారు. ఫాహద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్.



ట్రైలర్‌లో ఉన్నవి సినిమాలో వినిపించవు
- డైరెక్టర్ కృష్ణ చైతన్య

''**గ్యాం**గ్స్ ఆఫ్ గోదావరి' నాకు చాలా ఇష్టమైన కథ. ఆ ఇష్టంతోనే ఈ సినిమా చేశాను. నేను అనుకున్న భావోద్వేగాలు తెరమీద చక్కగా పలికాయి. ముఖ్యంగా పతాక సన్నివేశాలు ప్రేక్షకుల మనసుల్ని హత్తుకుంటాయి'' అని డైరెక్టర్ కృష్ణ చైతన్య అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణ చైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ– ''ఛల్ మోహన్‌రంగ' తర్వాత దర్శకుడిగా నా ప్లానింగ్‌లో ఉన్న చిత్రాలు ఆలస్యం అవటంతో మరీ గ్యాప్ ఎక్కువైపోతోందనే భయం నాలో మొదలైంది. ఆ విషయాన్ని మా గురువు త్రివిక్రమ్‌గారితో పంచుకున్నాను. ఆయన సూచనతో విశ్వక్ సేన్‌కి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' కథ చెప్పాను. తనకి నచ్చడంతో ఈ సినిమా ప్రయాణం మొదలైంది. గోదావరి అనగానే కొబ్బరి చెట్లు చూపించి అంతా ప్రశాంతంగా ఉంది అన్నట్టుగా సినిమాల్లో చూపిస్తారు. కానీ మా ప్రాంతంలో కూడా మనుషులను బట్టి నేరాలు జరుగుతాయి. ఆ ఆలోచన నుంచి పుట్టిన కల్పిత కథ ఇది. అయితే పూర్తిగా గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు. విశ్వక్ సేన్ కోసం కథలో ఎటువంటి మార్పులు చేయలేదు. ట్రైలర్‌లో కొన్ని సంభాషణలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అయితే సినిమాలో మాత్రం ఆ పదాలు వినిపించవు. కుటుంబమంతా కలిసి చూడొచ్చు. చినబాబు, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు ప్రేక్షకులకు మంచి సినిమాని అందించాలని భావించే నిర్మాతలు. నేహా శెట్టి, అంజలి పాత్రలు ఆకట్టుకుంటాయి'' అన్నారు.

ప్రేక్షకులు అప్పుడే హీరోలా చూస్తారు
- కార్తికేయ గుమ్మకొండ



''ఇప్పుడున్న నా ఇమేజ్‌కు సరైన మూవీ 'భజే వాయు వేగం'. హీరో అంటే మనం పోల్చుకునేలా ఉండాలి. అతనికి ఎదురయ్యే సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు ఎంచుకునే మార్గాలు స్ఫూర్తిదాయకంగా ఉండాలని భావిస్తాను. అప్పుడే అతన్ని ప్రేక్షకులు హీరోలా చూస్తారు. హీరోగా నాకు కొంచెం సామాజిక బాధ్యత ఉంది. అది నేను చేసే పాత్రల మీద రిఫ్లెక్ట్ అవుతుంటుంది'' అని హీరో కార్తికేయ గుమ్మకొండ అన్నారు. ప్రశాంత్ రెడ్డి దర్శకత్వంలో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన చిత్రం 'భజే వాయు వేగం'. 'హ్యాపీడేస్' ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్ర చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రం రేపు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ– ''లాక్ డౌన్ టైమ్‌లో 'భజే వాయు వేగం' కథ వినిపించాడు ప్రశాంత్ రెడ్డి. ఈ కథ వినగానే కార్తీ హీరోగా నటించిన 'ఖైదీ' టైపులో ఊహించుకున్నాను. 'ఖైదీ'లో ఉన్నంత యాక్షన్ ఉండదు కానీ, హీరోయిజం, యాక్షన్, సెంటిమెంట్, ఎమోషన్, లవ్ అన్నీ కుదిరాయి. యూవీ క్రియేషన్స్‌లో సినిమా అనగానే మేకింగ్, పోస్ట్ ప్రొడక్షన్, రిలీజ్ అన్నీ సరిగ్గా జరుగుతాయనే నమ్మకం వచ్చింది. 'భజే వాయు వేగం'లో ఫస్టాఫ్‌లో ఎమోషన్ ఉన్న హీరోను చూస్తారు. సెకండాఫ్‌లో ఆ ఎమోషన్ వల్ల ఎలాంటి స్టెప్స్ తీసుకున్నాడనేది చూపించాం. ఈ సినిమా క్రెడిట్ వంద శాతం దర్శకుడిదే. హీరోగా చేస్తున్న టైమ్‌లో 'గ్యాంగ్ లీడర్, వలిమై' చిత్రాల్లో విలన్‌గా నటించినందుకు ఫీల్ అవడం లేదు. ఆ సినిమాల ద్వారా నాకు అమెరికాలో, తమిళ పరిశ్రమలో గుర్తింపు దక్కింది. 'గ్యాంగ్ లీడర్' తర్వాత తెలుగు, తమిళంలో విలన్‌గా చాన్స్ వచ్చినా పాత్రలు నచ్చక చేయలేదు. నా తర్వాతి సినిమాని కూడా ప్రశాంత్ రెడ్డితోనే చేయాలనుకుంటున్నాను'' అన్నారు.



● సిద్ధార్థ్, రకుల్ ప్రీత్

నీ రాకతో జయం...

'**చెం**గల్వ చేయందేనా... చెలికాని చేరేనా..' అంటూ సాగే 'చెంగల్వ..' పాట 'భారతీయుడు 2' చిత్రంలోనిది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇండియన్' ('భారతీయుడు'). ఈ సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' కమల్‌హాసన్-శంకర్ కాంబినేషన్‌లోనే రూపొందాయి. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్‌పై సుభాస్కరన్ నిర్మించిన 'ఇండియన్ 2' తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూలై 12న విడుదల కానుంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రల్లో నటించారు. ఇక 'ఇండియన్ 2' సినిమాలోని మరో పాటను బుధవారం తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేశారు. 'చెంగల్వ చేయందేనా...' అంటూ మొదలయ్యే తెలుగు వెర్షన్ పాట 'సమీప దూరాల నిర్ణయం.. గతాల గాయం.. ఈవేళ నీ రాకతో జయం నిరంతరాయం..' అంటూ సాగుతుంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను అబ్బి, శ్రుతికా సముద్రాల పాడారు. సిద్ధార్థ్, రకుల్ కాంబినేషన్‌లో ఈ పాట ఉంటుంది. ఇక 'ఇండియన్ 2' విడుదలైన ఆరు నెలలకు 'ఇండియన్ 3' విడుదలయ్యే అవకాశం ఉంది.

లక్కీ భాస్కర్ డేట్ ఫిక్స్

థియేటర్స్‌లోకి 'లక్కీ భాస్కర్' వచ్చే సమయం ఖరారైంది. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా పీరియాడికల్ ఫిల్మ్ 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమాను ఈ ఏడాది సెప్టెంబరు 27న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను కూడా బుధవారం విడుదల చేశారు మేకర్స్. ''1980- 1990 కాలంలో నాటి బొంబాయి (ముంబై) నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఓ సాధారణ బ్యాంకు క్యాషియర్ అయిన లక్కీ భాస్కర్ అసాధారణ ప్రయాణాన్ని ఆసక్తికరంగా చూపిస్తున్నాం. ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: నిమిష్ రవి.



● దుల్కర్ సల్మాన్

'గాడ్ ఫాదర్' నిర్మాత ఆల్బర్ట్ కన్నుమూత



హాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఆల్బర్ట్ ఎస్. రడ్డీ (94) కన్నుమూశారు. లాస్ ఏంజెల్స్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఇటీవల తుది శ్వాస విడిచారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఆయన 1930 మార్చి 28న జన్మించారు. పెరిగింది, చదువుకున్నది అమెరికాలో. డిగ్రీ పూర్తి చేశాక సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 1965లో వచ్చిన హాలీవుడ్ చిత్రం 'వైల్డ్ సీడ్'కు ఓ నిర్మాత ఆల్బర్ట్. ఇదే సినిమాకు ఆయన లిరిక్స్ అందించారు. ఆ తర్వాత హాలీవుడ్ ఐకానిక్ హిట్ ఫిల్మ్ 'గాడ్‌ఫాదర్' (1972)తో నిర్మాతగా మంచి పేరు సంపాదించుకున్నారు. 2004లో విడుదలైన ఆస్కార్ విన్నింగ్ ఫిల్మ్ 'మిలియన్ డాలర్ బేబీ'కూ ఆల్బర్ట్ ఓ నిర్మాత. ఉత్తమ చిత్రం విభాగంలో 'ఆస్కార్' అవార్డు అందుకున్న రెండు సినిమా (గాడ్‌ఫాదర్, మిలియన్ డాలర్ బేబీ)లను నిర్మించిన అతి కొద్దిమంది హాలీవుడ్ నిర్మాతల్లో ఆల్బర్ట్ ఒకరు. 'ది గాడ్‌ఫాదర్ సాగ', 'మ్యారీడ్ టు ఏ స్ట్రేంజర్' వంటి టీవీ సిరీస్‌లనూ నిర్మించారు. 'హోగన్స్ హీరోస్' అనే టెలివిజన్ షోకు కో రైటర్‌గా ఆల్బర్ట్‌కు మంచి పేరొచ్చింది. ఇక నటుడిగా పొలిటికల్ కామెడీ డ్రామా 'రన్నింగ్ మేట్స్' (2000) చేశారు. 'క్రై మాచో' (2021) తర్వాత ఆల్బర్ట్ మరో సినిమా నిర్మించలేదు. ఆల్బర్ట్ మృతిపట్ల పలువురు హాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
30-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	668	74,503
నిఫ్టీ ▽	183	22,705

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,977	▽ 4
డోజోన్స్	38,509	▽ 344
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,183	▽ 71
డాక్స్	18,473	▽ 205
షాంఘై	3,111	△ 1
నికాయ్	38,557	△ 298

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	72,413 △	222
బంగారం (99.5 స్వచ్ఛత)	72,123 △	221
వెండి (కిలో)	94,118 △	3,307

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.82	83.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.97	107.52
€	యూరో	ఎస్‌బీఐ	89.22	91.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.39	53.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.45	56.38
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.63	63.86
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.81	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.36

వెండే బంగారమాయెగా..

- న్యూఢిల్లీల్లో కేజీ రూ.97,100
- కొన్ని నగరాల్లో రూ.లక్ష పైకి..!



న్యూఢిల్లీ: వెండి ధర దేశంలో సరికొత్త రికార్డులను చూస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో కేజీ ధర క్రితం ముగింపుతో పోల్చితే బుధవారం రూ.1,150 ఎగిసి రూ.97,100కి ఎగసింది. ఆర్థిక రాజధాని ముంబైలో రూ. 3,707 ఎగసి రూ.94,118కి చేరింది. చెన్నైసహా పలు నగరాలు, కొన్ని పట్టణాల స్పాట్ మార్కెట్లలో ఏకంగా రూ.లక్ష దాటినట్లు కూడా సమాచారం అందుతోంది. గడచిన పది రోజుల్లో వెండి ధర దాదాపు రూ.11,000 పెరిగింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం భయాలు విలువైన మెటల్స్ ధర పెరగడానికి కారణమన్న విశ్లేషణలు ఉన్నాయి. ఢిల్లీలో పసిడి 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత ధర క్రితంతో పోల్చితే రూ.250 పెరిగి రూ.73,200కు చేరగా, ముంబైలో రూ.222 ఎగసి రూ.72,413కి చేరింది.

హైదరాబాద్‌లో కంట్రోల్‌ఎస్ మూడో డేటా సెంటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్స్ సంస్థ హైదరాబాద్‌లో తాజాగా మూడో డేటాసెంటర్‌ను ప్రారంభించింది. బీఎస్‌ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి దీన్ని ప్రారంభించారు. సుమారు రూ. 500 కోట్లు పైగా ఇన్వెస్ట్‌మెంట్‌తో దీన్ని ఏర్పాటు చేయడం జరిగింది.



రేపు 2023-24 జీడీపీ గణాంకాలు

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 6.1-6.7% పరిధిలో వృద్ధి చెందుతుందని పలువురు ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7.6-7.8% శ్రేణిలో ఉంటుంది. ఆర్‌బీఐ అంచనా 7 శాతంగా ఉంది. క్యూ4 సహా మొత్తం ఆర్థిక సంవత్సరం వృద్ధి గణాంకాలు 31వ తేదీన విడుదల కానున్నాయి.

భారత్ అవుట్‌లుక్.. పాజిటివ్

- 'స్టేబుల్' నుంచి అప్‌గ్రేడ్ చేసిన ఎస్అండ్‌పీ
- మరో రెండేళ్లలో రేటింగ్ కూడా అప్‌గ్రేడ్ చేసే వీలుందని సూచన
- ఆర్థిక నిర్వహణ బాగుందని విశ్లేషణ
- 6 బ్యాంకుల బ్యాంకుల రేటింగ్ అవుట్‌లుక్ కూడా పెంపు



న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు భరోసా ఇస్తూ పది సంవత్సరాల విరామం తర్వాత అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం–ఎస్అండ్‌పీ గ్లోబల్ భారతదేశ సార్వభౌమ (సావరిన్) రేటింగ్ అవుట్‌లుక్‌ను 'స్టేబుల్' నుంచి 'పాజిటివ్'కు మెరుగుపరిచింది. గత ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ వ్యయ నిర్వహణ బాగుందని, ద్రవ్య విధానాల్లో సంస్కరణలు విస్తృత స్థాయిలో కొనసాగుతాయని భావిస్తున్నామని ఎస్అండ్‌పీ ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అంతా బాగుంటే రెండేళ్లలో సావరిన్ రేటింగ్‌నూ పెంచుతామని పేర్కొంది. కాగా, ఆరు బ్యాంకులు–ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండియాన్ బ్యాంకులు సహా ప్రభుత్వ రంగ సంస్థలు ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్‌లకు సంబంధించీ ఇదే అవుట్‌లుక్ పెంపు నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఇమామీ లాభం ప్లస్

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ క్యూ4 నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 147 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం పుంజుకుని రూ. 891 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 7 శాతం పెరిగి రూ. 680 కోట్లను తాకాయి.పూర్తి ఏడాదికి ఇమామీ కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతంపైగా ఎగసి రూ. 724 కోట్లను దాటింది. 2022-23లో రూ. 627 కోట్ల లాభం ప్రకటించింది. మొత్తం ఆదాయం 5 శాతం బలపడి రూ. 3,578 కోట్లను తాకింది.

ఇమామీ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 516 వద్ద ముగిసింది.

టాటా స్టీల్ డీలా



న్యూఢిల్లీ: టాటా స్టీల్ క్యూ4 కన్సాలిడేటెడ్ నికర లాభం 65 శాతం క్షీణించి రూ. 555 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం రూ. 63,131 కోట్ల నుంచి రూ. 58,863 కోట్లకు తగ్గింది. వ్యయాలు సైతం రూ. 59,918 కోట్ల నుంచి రూ. 56,497 కోట్లకు వెనకడుగు వేశాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

నిధుల సమీకరణ

దశలవారీగా లేదా ఒకేసారి ఎన్‌సీడీల జారీ(ప్రయివేట్ ప్లేస్‌మెంట్) ద్వారా రూ. 3,000 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు టాటా స్టీల్ పేర్కొంది. అంతేకాకుండా ఈ ఏడాది విదేశీ అనుబంధ సంస్థ టీ స్టీల్ హోల్డింగ్స్ ఈక్విటీ షేర్ల సబ్‌స్క్రిప్షన్ ద్వారా 211 కోట్ల డాలర్ల(రూ. 17,405 కోట్లు) పెట్టుబడులు అందించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది. నిధులను విదేశీ అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. టాటా స్టీల్ యూకే పునర్వ్యవస్థీకరణ వ్యయాలకు సైతం నిధులు వెచ్చించనుంది. టీఎస్‌హెచ్‌పీలో కంపెనీకిగల 56.5 కోట్ల డాలర్ల(రూ. 4,661 కోట్లు) రుణ సెక్యూరిటీలను ఈక్విటీగా మార్పు చేసేందుకు బోర్డు ఓకే చెప్పింది. మార్చికల్లా కంపెనీ నికర రుణ భారం రూ. 77,550 కోట్లుగా నమోదైంది.

టాటా స్టీల్ షేరు బీఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 174 వద్ద ముగిసింది.

ఇంటీరియర్స్‌కూ ఎల్అండ్‌టీ ఫైనాన్స్ రుణాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గృహరుణాలతో పాటు ఇంటీరియర్స్, గృహోపకరణాల అవసరాల కోసం కూడా రుణాలు అందిస్తున్నట్లు ఎల్అండ్‌టీ ఫైనాన్స్ (ఎల్‌టీఎఫ్) సీఈవో (అర్బన్ ఫైనాన్స్) సంజయ్ గర్యాలీ తెలిపారు. తీసుకున్న గృహ రుణం మొత్తంలో 15 శాతం వరకూ, పదేళ్ల దాకా కాలవ్యవధితో వీటిని పొందవచ్చని పేర్కొన్నారు. వడ్డీ రేటు 10.75 శాతం నుంచి ఉంటుందని బుధవారమిక్కడ జరిగిన కార్యక్రమంలో చెప్పారు. గృహ రుణాలను సమగ్రంగా అందించేందుకు దికంప్లీట్ హోమ్ లోన్ సర్వీసులను ప్రవేశపెట్టినట్లు గర్యాలీ వివరించారు. డిజిటల్ విధానంలో రుణ ప్రక్రియ, ప్రత్యేక రిలేషన్‌షిప్ మేనేజర్, హోమ్ డెకార్ ఫైనాన్స్ అన్నీ ఇందులో ఉంటాయన్నారు. తమ గృహ రుణాల పోర్ట్‌ఫోలియో రూ. 18,500 కోట్లుగా ఉండగా, ఇందులో తెలంగాణ వాటా దాదాపు ఆరు శాతం ఉందని పేర్కొన్నారు. రిటైల్ రుణాల పోర్ట్‌ఫోలియో రూ. 80,037 కోట్లని తెలిపారు.



సంజయ్ గర్యాలీ

డల్లాస్‌లో జోయాలుక్కాస్ షోరూం ప్రారంభం



ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ అమెరికాలోని డల్లాస్‌లో మొదటి షోరూంను ప్రారంభించింది. కొత్త షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జాయ్ అలుక్కాస్, కౌంటీ కమీషనర్ సుసాన్ ఫ్లెచర్, డిప్యూటీ మేయర్ టోనీ సింగ్, కౌన్సిల్ విమెన్ టమ్మీ మీనర్ షగెన్‌లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రామ్‌కీ లాభం రూ.57 కోట్లు



వై.ఆర్.నాగరాజ, ఎన్.ఎస్.రావు (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ నిర్మాణ సంస్థ రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.1,077 కోట్ల నుంచి రూ.57 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 15 శాతం ఎగసి రూ.138 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.601 కోట్ల నుంచి రూ.624 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం రూ.1,140 కోట్ల నుంచి రూ.308 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.1,866 కోట్ల నుంచి రూ.2,320 కోట్లను తాకింది. ఈపీఎస్ రూ.44.48 నమోదైంది. ఆర్డర్ బుక్ ప్రస్తుతం రూ.9,300 కోట్లు ఉందని రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వై.ఆర్.నాగరాజ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. ఈ ప్రాజెక్టులు 3 నుంచి 15 ఏళ్లలో పూర్తి అవుతాయని చెప్పారు. కొత్త ప్రాజెక్టుల కోసం ఆరు నెలల్లో రూ.280 కోట్ల నిధులు సమీకరిస్తామని రామ్‌కీ గ్రూప్ సీఎఫ్‌వో ఎన్.ఎస్.రావు వెల్లడించారు.

రామ్‌కీ షేరు ధర బీఎస్ఈలో బుధవారం 7.66% ఎగసి రూ.527.85 వద్ద స్థిరపడింది.

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ లాభం డౌన్

న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 70 శాతం పతనమై రూ. 140 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 468 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,938 కోట్ల నుంచి రూ. 2,236 కోట్లకు క్షీణించింది. అయితే పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం రూ. 942 కోట్ల నుంచి రూ. 1,374 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం ఆదాయం రూ. 8,772 కోట్ల నుంచి రూ. 9,425 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 22 శాతం వృద్ధితో రూ. 11,954 కోట్ల వసూళ్లు అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. 34 శాతం అధికంగా 20.25 మిలియన్ చదరపు అడుగులమేర అమ్మకాల బుకింగ్స్ పరిమాణాన్ని సాధించినట్లు పేర్కొంది. ఒక్కో చదరపు అడుగుకు రూ. 10,410 చొప్పున సగటు ధరను సాధించినట్లు తెలియజేసింది. ఇవన్నీ రికార్డులని పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ప్రెస్టీజ్ ఎస్టేట్స్ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 1,506 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.65

75,000 దిగువకు సెన్సెక్స్

23,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ • ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు • సూచీలకు నాలుగో రోజూ నష్టాలే



ముంబై: స్టాక్ సూచీలు నాలుగోరోజూ నష్టాలతో ముగిశాయి. మే డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు(గురువారం), ఏడో విడత పోలింగ్ (శనివారం), సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి(జూన్ 4న)కి ఇన్వెస్టర్లు ముందు అప్రమత్తత వహించారు. భారీ అమ్మకాలతో సెన్సెక్స్ 668 పాయింట్లు పతనమై 74,503 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 183 పాయింట్లు నష్టపోయి 22,705 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 716 పాయింట్లు తగ్గి 74,455 వద్ద, నిఫ్టీ 203 పాయింట్లు పతనమై 22,685 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.

- అదానీ గ్రూప్ కొనుగోలు చేస్తుందన్న వార్తలతో పేటీఎం షేర్ బీఎస్ఈలో 5% పెరిగి రూ.359కి చేరింది. కాగా, ఈ వార్తలను ఆ సంస్థలూ ఖండించాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఎన్‌లో 44 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(నిన్).. టెక్నికల్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ అటెండెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 44
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్–8 పోస్టులు, టెక్నీషియన్ 1–14 పోస్టులు, ల్యాబొరేటరీ అటెండెంట్ 1– 22 పోస్టులు
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: టెక్నికల్ అసిస్టెంట్‌కు నెలకు రూ.35,400 -రూ.1,12,400, టెక్నీషియన్‌కు రూ.19,900 - రూ.63,200, ల్యాబొరేటరీ అటెండెంట్‌కు రూ.18,000 -రూ.56,900 వేతనం అందుతుంది.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 23.05.2024
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 16.06.2024
» పరీక్ష తేది: 2024, జూలైలో ఉంటుంది.
» వెబ్‌సైట్: www.nin.res.in

ఎన్ఐసీహెచ్‌డీఆర్‌లో కొలువులు

న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ (ఎన్ఐసీహెచ్‌డీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 4
» పోస్టుల వివరాలు: సైంటిస్ట్–సి: 01, అసిస్టెంట్(మల్టీపర్పస్): 01, టెక్నీషియన్–సి(ల్యాబ్ టెక్నీషియన్): 01, డేటా ఎంట్రీ ఆపరేటర్: 01.
» అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు సైంటిస్ట్ పోస్టుకు రూ.67,000, అసిస్టెంట్‌కు రూ.31,000, టెక్నీషియన్‌కు రూ.20,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.20,000.
» జాబ్ లొకేషన్: పంజాబ్, న్యూఢిల్లీ.
» దరఖాస్తు చివరి తేది: 16.06.2024
» దరఖాస్తు పంపాల్సిన చిరునామా: nip.mrhrubhunga@gmail.com
» వెబ్‌సైట్: https://main.icmr.nic.in

హైదరాబాద్ డిఫెన్స్ ల్యాబొరేటరీస్ స్కూల్‌లో 15 పోస్టులు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ ల్యాబొరేటరీస్ స్కూల్, ఆర్‌సీఐ.. అడ్‌హాక్ ప్రాతిపదికన టీచింగ్, అడ్మిన్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15

పోస్టుల వివరాలు

» ప్రైమరీ టీచర్ (మ్యాథ్స్, ఈవీఎస్, ఇంగ్లిష్, మ్యూజిక్, డ్యాన్స్): 05 పోస్టులు.
» ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) (మ్యాథ్స్, సోషల్, ఇంగ్లిష్, ఫిజిక్స్, సంస్కృతం): 05 పోస్టులు.
» ల్యాబ్ ఇంచార్జ్ (ఏటీఎల్ ల్యాబ్ ఇంచార్జ్)–01 పోస్టు, ఏఐ టీచర్ (టీజీటీ)–01 పోస్టు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్–02పోస్టులు, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్–01 పోస్టు.
» అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, టెట్, సీటెట్ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ భాష, కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్/పోస్టు/కొరియర్ ద్వారా దరఖాస్తులు స్కూలు చిరునామాకు పంపించాలి.
చిరునామా: డిఫెన్స్ ల్యాబొరేటరీస్ స్కూల్, విజ్ఞానకంచ, ఆర్‌సీఐ, హైదరాబాద్.
» దరఖాస్తు చివరి తేది:10.06.2024
» వెబ్‌సైట్: https://www.dlsrci.in

ప్రిలిమ్స్.. సక్సెస్ మంత్ర!

సివిల్ సర్వీసెస్ పరీక్ష.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి పోస్టుల భర్తీకి నిర్వహించే ఎంపిక ప్రక్రియ! మూడు దశల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో.. అత్యంత కీలకమైంది తొలిదశ ప్రిలిమినరీ పరీక్ష! దేశవ్యాప్తంగా దాదాపు అయిదు లక్షల మంది హాజరయ్యే ప్రిలిమ్స్‌లో నెగ్గితేనే.. మలిదశ మెయిన్స్‌కు అర్హత లభిస్తుంది!! సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2024కు సంబంధించి తొలిదశ ప్రిలిమ్స్ జూన్ 16న జరుగనుంది. ఈ నేపథ్యంలో.. ప్రిలిమ్స్‌లో విజయానికి ప్రిపరేషన్ టిప్స్..

» జూన్ 16న సివిల్స్-2024 ప్రిలిమ్స్
» రెండు పేపర్లుగా 400 మార్కులకు పరీక్ష
» అయిదు లక్షల మంది హాజరయ్యే అవకాశం
» రివిజన్‌తోపాటు ప్రాక్టీస్ కీలకమంటున్న నిపుణులు
» ఈజీ టు డిఫికల్ట్ విధానంలో సమాధానాలు ఇవ్వాలి.

సివిల్స్ ప్రిలిమ్స్‌ను వడపోత పరీక్ష అని చెప్పొచ్చు. ఎందుకంటే.. దాదాపు ఐదు లక్షల మంది పరీక్ష రాస్తే.. అందులో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపికయ్యే వారి సంఖ్య సుమారు 13 వేలు మాత్రమే! లక్షల మంది పోటీ పడే ప్రిలిమ్స్ నుంచి వేల సంఖ్యలోని జాబితాలో చోటు సంపాదించి మలి దశకు అర్హత పొందాలంటే.. అత్యంత మెరుగైన ప్రిపరేషన్‌తోనే సాధ్యం.

21 సర్వీసులు.. 1,056 పోస్టులు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా మొత్తం 21 సర్వీసుల్లో 1,056 పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రిలిమినరీ పరీక్షను జూన్ 16న నిర్వహించనున్నారు. ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు.. పేపర్ 1 జనరల్ స్టడీస్(200 మార్కులు), పేపర్ 2 సీశాట్(200 మార్కులు) ఉంటాయి. పేపర్1లో వచ్చిన మార్కులు మెయిన్స్‌కు ఎంపికలో అత్యంత కీలకం. పేపర్ 2 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది.

సమయ పాలన

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో అభ్యర్థులు నిత్యం పునశ్చరణ, ప్రాక్టీస్‌తో తమ ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టుకోవాలి. మెయిన్స్ ఎంపికకు నిర్ణయాత్మకమైన పేపర్-1 జనరల్ స్టడీస్‌కు సంబంధించి అన్ని ముఖ్యమైన టాపిక్స్‌ను తరచూ రివైజ్ చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. అందుకోసం ప్రతి రోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటల సమయం కేటాయించుకోవాలి. దీంతోపాటు ప్రతి వారం సెల్ఫ్ టెస్టులు, మాక్ టెస్టులు రాయడం ఉపయుక్తంగా ఉంటుంది.

సమకాలీనంతో సమ్మిళితం

ఇటీవల కాలంలో ప్రిలిమ్స్ ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ సమ్మిళితంగా ఉంటున్నాయి. కాబట్టి ఈ ఏడాది మే ముందు నుంచి ఏడాది, ఏడాదిన్నర కాలంలోని ముఖ్యమైన కరెంట్ ఈవెంట్స్‌పై దృష్టిపెట్టాలి. వాటిని సంబంధిత సబ్జెక్ట్ స్టాటిక్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. నేపథ్యం, ప్రభావం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అంచనా..వంటి అంశాలను విశ్లేషించుకుంటూ చదవాలి.

రెండుసార్లు పునశ్చరణ



ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు ఆయా సబ్జెక్టులను అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఎకానమీ–పాలిటీ, ఎకానమీ–జాగ్రఫీ, జాగ్రఫీ–ఎకాలజీ; జాగ్రఫీ–సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే.. ప్రిపరేషన్ పరంగా కొంత సమయం కలిసొస్తుంది. ప్రిలిమ్స్ అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకొని ఉంటారు. కాబట్టి ప్రస్తుత సమయంలో వారు పూర్తిగా రివిజన్‌కు సమయం కేటాయించుకోవాలి. కనీసం రెండుసార్లు రివిజన్ చేసేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఎక్కువ మంది అభ్యర్థులు రివిజన్‌కు ఉపకరించే విధంగా ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్‌నోట్స్ సిద్ధం చేసుకుంటారు.

సొంత నోట్స్ ఎంతో మేలు

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు సబ్జెక్ట్ వారీగా ముఖ్యాంశాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇందుకోసం ఇప్పటికే వారు రాసుకున్న సొంత నోట్స్‌ను అనుసరించాలి. ప్రిపరేషన్‌లో భాగంగా సొంతంగా రాసుకున్న నోట్స్‌ను తరచూ తిరగేస్తూ ఉండాలి. ముఖ్య టాపిక్స్‌కు సంబంధించి హెడ్డింగ్స్, సబ్ హెడ్డింగ్స్, అండర్‌లైన్ చేసినవి సాధ్యమైనన్ని ఎక్కుసార్లు చూసుకోవాలి. ఇది ఆయా అంశాలను పరీక్ష సందర్భంగా అవసరమైన సమయంలో గుర్తుకు తెచ్చుకునేందుకు దోహదపడుతుంది. వీటితోపాటు సొంతంగా సిద్ధం చేసుకున్న నోట్స్‌లో ఉన్న ఫ్లోచార్ట్స్, న్యూమానిక్స్, గ్రాఫ్స్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సబ్జెక్ట్‌ను ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేయాలి.

ప్రీవియస్ పేపర్స్ ప్రాక్టీస్

గత ఐదారేళ్ల పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయాలి. ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్ ప్రాక్టీస్ సందర్భంగా ప్రశ్న–సమాధానం గుర్తించడం అనే విధానం కాకుండా.. ఆయా ప్రశ్నలకు ఆప్షన్లుగా ఇచ్చిన వాటిపైనా దృష్టిపెట్టాలి. ఎందుకంటే.. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు యథాతథంగా రిపీట్ అవడం అరుదుగా జరుగుతుంది. కాని థీమ్స్‌పై ప్రశ్నలు రిపీట్ అవుతుంటాయి. ఉదాహరణకు ఇన్‌ఫ్లేషన్, ఫారిన్ ట్రేడ్, ఎల్ నినో, లా నినో, బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ యాక్ట్స్‌పై వివిధ కోణాల్లో ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

కీలక గణాంకాలు

హిస్టరీ నుంచి ఎకానమీ వరకూ ఆయా సబ్జెక్టుల్లో కొన్ని కీలకమైన గణాంకాలను గుర్తుపెట్టుకోవడం మేలు చేస్తుంది. ఇందుకోసం ప్రతి సబ్జెక్టు నుంచి ముఖ్యమైన ఫ్యాక్టువల్ డేటాను గుర్తించి.. ఒక ప్రత్యేకమైన నోట్స్‌లో రాసుకుని.. వాటిని పరీక్షకు ముందు రోజు వరకూ తరచూ రివైజ్ చేసుకుంటూ ఉండాలి. ఇలా అత్యంత కీలకమైన డేటాను గుర్తుపెట్టుకోవడం ప్రశ్నలకు సమాధానాలను గుర్తించడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు హిస్టరీలో ముఖ్యమైన రాజ వంశం, వారి పాలనా కాలం, రాజధాని, ముఖ్యమైన రాజు పాలనాకాలం; ముఖ్యమైన రచయితలు–వారి గ్రంథాలు; ముఖ్యమైన విదేశీ యాత్రికులు–వారు ఎవరి కాలంలో భారత్‌ను సందర్శించారు,వారి గ్రంథాలు వంటివి. ఎకానమీలో రెపో రేటు,తాజా వృద్ధి రేట్లు, ఫిజికల్ డిఫిసిటీ, కరెంట్ అకౌంట్ డిఫిసిటీ, విదేశీ మారక ద్రవ్య నిల్వలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి తదితరాలను తప్పనిసరిగా గుర్తుపెట్టుకోవాలి.

పేపర్-2కు కూడా సమయం

అభ్యర్థులు పేపర్-2 (సీశాట్)కు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. దీన్ని అర్హత పేపర్‌గానే పేర్కొన్నప్పటికీ.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1 మూల్యాంకన చేస్తారు. కాబట్టి పేపర్-2లో అర్హత మార్కులు సాధించేందుకు ప్రధానంగా మ్యాథమెటిక్స్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

సబ్జెక్ట్ వారీగా దృష్టిపెట్టాల్సినవి

కరెంట్ అఫైర్స్-ఎన్విరాన్‌మెంట్

అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న గాజా–ఇజ్రాయెల్, రష్యా–ఉక్రెయిన్, నాటో, జీ 20, బ్రిక్స్, దక్షిణ చైనా సముద్రం, ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం, బ్లాక్ సీ, చాబహార్ పోర్టు వంటి వాటితోపాటు ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ నివేదికలు, వివిధ అంతర్జాతీయ ఇండెక్స్‌లపైనా దృష్టిపెట్టాలి. అదేవిధంగా వార్తల్లో ఉన్న జంతువులు, పక్షులు.. ఉదాహరణకు చీతా, టైగర్, డాల్ఫిన్, ఎలిఫెంట్, గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ వంటి వాటి ఐయూసీఎన్' స్టేటస్, అవి ఏ ప్రాంతంలో ఎక్కువగా లభిస్తాయి, వాటి సెన్సెస్,వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, పర్యావరణ చట్టాలు వంటి వాటిని తెలుసుకోవాలి. ప్రభుత్వ స్కీమ్స్‌తోపాటు కరెంట్ అఫైర్స్‌కు సోర్స్ కూడా ముఖ్యమే. ఇందుకోసం పీఐబీతోపాటు ప్రామాణిక దిన పత్రికలు, వెబ్‌సైట్స్‌ను అనుసరించవచ్చు.

చరిత్ర

ప్రాచీన చరిత్రలో సింధూ నాగరికత, బౌద్ధం, జైన మతాలు, మౌర్యులు, గుప్తుల పాలన, శాసనాలు, ముఖ్య ఘట్టాలపై దృష్టిపెట్టాలి. అదేవిధంగా మధ్యయుగంలో ఢిల్లీ సుల్తానులు, మొఘలులు, విజయనగర సామ్రాజ్యం కాలంలో జరిగిన కీలక పరిణామాలను గుర్తుపెట్టుకోవాలి. ప్రాచీన, మధ్య యుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ–సామాజిక–ఆర్థిక అంశాలను రివైజ్ చేసుకోవాలి. ఆధునిక చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన -పరిపాలన విధానాలు; బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు–ఉద్యమాలు(గిరిజన ఉద్యమాలు, రైతాంగ ఉద్యమాలు), సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం–గాంధీ,అంబేద్కర్ తదితరుల పాత్ర కీలకంగా నిలుస్తాయి.

పాలిటీ

రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ, పీఠిక, తాజా రాజ్యాంగ సవరణలు -వాటికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు, పార్లమెంటరీ వ్యవస్థ, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల కమిషన్, ఆర్థిక కమిషన్, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్, పంచాయతీ రాజ్ వ్యవస్థ, 5వ, 6వ షెడ్యూల్స్, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, మహిళా రిజర్వేషన్ చట్టం, తాజా సుప్రీం కోర్టు తీర్పులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలపైనా దృష్టిపెట్టాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ

గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు; చంద్రయాన్-3, గగన్‌యాన్, ఆదిత్య,రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు, అగ్ని-5, ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు–కారకాలు, వ్యాక్సిన్‌లు, సైబర్ సెక్యూరిటీ,ఏఐ,సోలార్ ఎనర్జీ,సస్టైయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్స్, బయోఫ్యూయల్స్ తదితరాల గురించి తెలుసుకోవాలి.

జాగ్రఫీ

ఇండియా ఫిజికల్ ఫీచర్స్, నదీ వ్యవస్థ, భౌగోళిక వనరులు, సహజ వనరులు, సెన్సెస్ 2011, సౌర వ్యవస్థ, భూమి అంతర్ నిర్మాణం, శిలలు, రుతుపవనాలు, పంటలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, భూకంపాలు, సునామీలు, మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ, జలాల పంపిణీ–వివాదాలు, ముఖ్యమైన ప్రాజెక్టులు వంటి వాటిపై దృష్టిపెట్టాలి.

క్లుప్తంగా...

ఏపీ పీజీఈసెట్-24 ప్రవేశ పరీక్షలు ప్రారంభం



ప్రవేశ పరీక్ష కోడ్‌ను విడుదల చేస్తున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఏపీ ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఎస్వీయూ ఆధ్వర్యంలో ఏపీ పీజీ ఈసెట్-2024 ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంటెక్, ఎం ఫార్మసీ, ఫార్మడీ కోర్సుల్లో ప్రవేశానికి జరిపే పీజీ ఈసెట్ పరీక్షలు ఈ నెల 31 వరకు జరగనున్నాయి. ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి ప్రవేశ పరీక్షకు సంబంధించిన కోడ్‌ను పీజీ ఈసెట్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం పీజీ ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.రమాశ్రీ మాట్లాడుతూ ఏపీ పీజీ ఈసెట్ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా 20 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు 5,095 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 82.11 శాతం మాత్రమే పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. పరీక్షలను ప్రొఫెసర్ కె.మల్లికార్జునరావు, వి.దివాకర్‌రెడ్డి బృందం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పు

- జూన్ 6న సర్టిఫికెట్ల పరిశీలన
- 7-10 వరకు ఆప్షన్ల నమోదు

సాక్షి, అమరావతి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పాలిసెట్-2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జూన్ మొదటి వారంలో ఓట్ల లెక్కింపు సందర్భంగా 3 రోజులపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఈ నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా పాలిసెట్ ప్రవేశాల ప్రక్రియలో మార్పులతో సవరణ నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసినట్లు చెప్పారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ..ముందుగా ప్రకటించినట్టే ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి ఆన్‌లైన్ ప్రక్రియకు జూన్ 2వరకు అవకాశం ఉంటుందన్నారు. జూన్ 3న జరగాల్సిన సర్టిఫికెట్ పరిశీలనను 6వ తేదీకి (ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు సైతం), 7 నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు చేసుకోవాలన్నారు. 11న ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తామన్నారు. 13న తుది సీట్లు కేటాయిస్తామని వివరించారు. 14 నుంచే రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభమవుతాయని, 19లోగా సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయాలని చెప్పారు. సాంకేతిక విద్య శాఖ జేడీ వెలగా పద్మారావు, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, చీఫ్ క్యాంప్ ఆఫీసర్ విజయకుమార్, ఉపసంచాలకులు విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

2 వరకు 'సీపెట్' కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: సీపెట్ డిప్లొమా కోర్సులకు జూన్ 2లోగా దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ సీపెట్ సంస్థ జేడీ సీహెచ్ శేఖర్ కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మూడేళ్ల వ్యవధితో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్థులకు రెండేళ్ల వ్యవధితో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ, విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి, ప్రభుత్వం నుంచి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉందన్నారు. జూన్ 9న విజయవాడ, అనంతపురంలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తామన్నారు. విజయవాడ కేంద్రంలోని 150 సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి బహుళజాతి, వాటి అనుబంధ సంస్థల్లో రూ.16,000-20,000 ప్రారంభ వేతనం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, 7893586494లో సంప్రదించాలని కోరారు.

స్వీడన్ సదస్సుకు వైవీయూ ఆచార్యుడు

ఆలూరు వాసి జయరాజ్‌కు అరుదైన అవకాశం



ఆలూరు: వైఎస్సార్ కడప జిల్లాలోని యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.జయరాజ్ స్వీడన్ దేశం నోర్కోపింగ్‌లో ఈ నెల 27-30 వరకు నిర్వహిస్తోన్న వాతావరణ సంస్థ కార్యశాలలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈయన స్వస్థలం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని హత్తిబెళగల్ గ్రామం. పుష్పరత్నం, సరోజమ్మ దంపతులకు ఐదుగురు సంతానంలో ఈయన మూడోవారు. ఆలూరులోనే ఇంటర్ పూర్తి చేశారు. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, తిరుపతి ఎస్వీ వర్సిటీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ అభ్యసించారు. పలు కళాశాలల్లో అధ్యాపకుడిగా పనిచేసి ప్రస్తుతం వైవీయూలో భూ విజ్ఞాన శాస్త్ర ఆచార్యునిగా సేవలందిస్తున్నారు. స్వీడన్ సదస్సులో జయరాజ్ భారత్‌లోని బంగాళాఖాతం, హిందూ మహా సముద్రం, ఉష్ణ మండల వాతావరణ వైవిధ్యంపై కార్యశాలలో పత్ర సమర్పణ చేయనున్నారు. జయరాజ్ ఇప్పటికే 70 దేశాలలో క్షేత్ర సందర్శనలను చేశారు.

ప్రతి విద్యార్థికీ 'పెన్'

ఆధార్‌లాగే పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ కేటాయింపు

సాక్షి, అమరావతి: కాకినాడ నగరంలోని ఓ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలకృష్ణ కుటుంబం చెన్నైకి వలస వెళ్లింది. బాలుడు ఇక్కడ టీసీ తీసుకోలేదు. అయితే, ఆ విద్యార్థి అక్కడ బడిలో చేరినట్టు ఎక్కడా వివరాలు లేవు. ఇలాంటి పరిస్థితి విద్యాశాఖకు సవాలే. బడి ఈడు పిల్లలు ఎంతమంది బడిలో ఉంటున్నారు, ఎంతమంది బడికి వెళ్లడంలేదో తెలుసుకునేందుకు ఇంటింటికీ సర్వే చేయడం తప్ప ఇప్పటివరకు మరో మార్గం లేదు. 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్)'తో దీనికి పరిష్కారం లభిస్తుంది. నూతన జాతీయ విద్యావిధానం-2020 (ఎన్ఈపీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని విద్యార్థులందరికీ ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్య పెన్‌ను తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో ఈ విధానాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరం నుంచే ఇదే తరహా విధానం అమలు చేస్తోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి దేశవ్యాప్తంగా తప్పనిసరి చేసింది.



విద్యార్థులకు కేటాయించిన పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్

'పెన్' అంటే..

ప్రి ప్రైమరీలో అడ్మిషన్ తీసుకున్న సమయంలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, కులం, ఇంటి అడ్రస్ వంటి అన్ని వివరాలను డిజిటలైజ్ చేసి కేంద్ర పాఠశాల విద్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్)'లో నమోదు చేస్తారు. ఒకటో తరగతిలో విద్యార్థుల వివరాలు నమోదు చేసే సమయంలోనే ప్రతి ఒక్కరికీ డిజీ లాకర్‌ను ఓపెన్ చేసి, అన్ని సర్టిఫికెట్లను అందులో ఉంచుతారు. ఆ తర్వాత 11 అంకెల పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ వస్తుంది. ఈ నంబరు ఆధార్ నంబరులాగానే విద్యార్థికి జీవితాంతం చెల్లుబాటు అవుతుంది. ఒక ప్రభుత్వ లేదా ప్రైవేటు స్కూలు నుంచి మరొక ప్రభుత్వ లేదా ప్రైవేటు స్కూలుకు బదిలీ అయినప్పుడు, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రంలోని స్కూలు లేదా కాలేజీలో చేరే సమయంలో టీసీలు, మైగ్రేషన్ సర్టిఫికెట్లు అవసరం లేకుండా చేరొచ్చు. ఈ పెన్ నంబరు ఇవ్వగానే ఆన్‌లైన్‌లో ఆ విద్యార్థికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు అందులో వస్తాయి. దీనిద్వారా విద్యార్థి ఒక విద్యా సంస్థ నుంచి మరొక విద్యా సంస్థకు సులభంగా ట్రాన్స్‌ఫర్ అవ్వొచ్చు. చదువు పూర్తయిన అనంతరం వారు ఏ స్థాయిలో ఉన్నారనే విషయాన్ని సులువుగా తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు పిల్లలను పాఠశాలలో చేర్చుకునేటప్పుడు ఆధార్ నంబర్ నమోదు చేసేవారు. అయితే, ఈ వివరాలు ఆ జిల్లా, రాష్ట్రం వరకే తెలిసేవి. ఒకవేళ విద్యార్థి రాష్ట్రం వెలుపల మరోచోట చదువుతున్నా తెలుసుకోవడం కష్టం. అయితే పెన్ ద్వారా విద్యార్థి ఎక్కడున్నా ఇట్టే తెలిసిపోతుంది. చిరునామా వంటి వివరాలు మారినప్పుడు పెన్ నంబర్‌కు కూడా అప్‌డేట్ చేస్తారు. దాంతో దేశవ్యాప్తంగా విద్యార్థి ఎక్కడున్నా సులువుగా తెలుసుకోవచ్చు.



పత్రాలు లేకుండానే బదిలీ

రాష్ట్రంలో ప్రస్తుతం స్కూల్ స్థాయి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 86 లక్షల మందికి, ఈ విద్యా సంవత్సరం ప్రి ప్రైమరీలో చేరే విద్యార్థులకు కూడా 'పెన్' కేటాయిస్తారు. దీని ద్వారా జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే 2024-25 విద్యా సంవత్సరంలో ఒక తరగతి నుంచి మరొక తరగతికి వెళ్లే విద్యార్థులు, ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలలో చేరే విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఒకప్పటి నిబంధనల ప్రకారం ఒక పాఠశాల నుంచి వేరొక పాఠశాలలో చేరే విద్యార్థికి టీసీ, స్టడీ సర్టిఫికెట్ కుల ధ్రువీకరణ పత్రం.. ఇలా అనేక సర్టిఫికెట్లను సమర్పించాలి. ఇప్పుడు ఆ సర్టిఫికెట్ల అవసరం లేకుండా విద్యార్థి 'పెన్' నంబర్‌తో పాత శాల ప్రధానోపాధ్యాయుడు ఒక్క క్లిక్‌తో విద్యార్థిని బదిలీ చేయొచ్చు.

పాఠశాలలకు విద్యార్థుల మ్యాపింగ్

వచ్చే నెలలో ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల బదిలీ ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ సులభతరం చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5, 7 తరగతులు పూర్తి చేసిన విద్యార్థులను పై తరగతులు ఉన్న పాఠశాలలకు ట్యాగింగ్ చేస్తారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థికి అవసరమైన స్కూళ్లను ఆన్‌లైన్‌లో చూపిస్తే తల్లిదండ్రులు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకుంటారు. ఇలాంటి విద్యార్థులందరినీ మ్యాప్ చేసిన తర్వాత ఆ డేటాను విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి నేరుగా విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలకు బదిలీ చేస్తారు. విద్యార్థి ప్రత్యేకంగా సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం ఉండదు. ఉన్నత తరగతులకు ప్రమోట్ చేసేటప్పుడు కూడా ఇదే విధానం అనుసరిస్తారు. అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలల్లో ఇదే తరహా విధానం అనుసరిస్తారు. గత ఏడాది వరకు పాఠశాలలో ప్రవేశానికి తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికెట్, నివాస సర్టిఫికెట్ వంటివి తప్పనిసరి. కానీ ఈ విద్యా సంవత్సరం నుంచి ఆ విధానానికి స్వస్తి పలకనున్నారు.

'పెన్'పై అవగాహన

ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థికి 'పెన్' నంబర్ కేటాయించాలని పాఠశాల విద్య కమిషనర్ సురేష్ కుమార్ జిల్లా, మండల విద్యా శాఖాధికారులు, పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులను చేర్చుకునే సమయంలో పర్మినెంట్ నంబర్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, సర్టిఫికెట్ల పేరిట తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయొద్దని చెప్పారు.

పర్యాటకరంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

- ఎంఎస్ఎంఈల ద్వారా పెట్టుబడులను ప్రోత్సహిస్తే మరింత ఊతం
- జూన్ 15, 16 తేదీల్లో బెంగళూరు వేదికగా పెట్టుబడుల సదస్సు
- కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీస్ సమాఖ్య టూరిజం కమిటీ చైర్మన్ శివషణ్ముగం

సాక్షి, అమరావతి : దేశవ్యాప్తంగా విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించే సత్తా ఒక్క పర్యాటక రంగానికే ఉందని కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, టూరిజం కమిటీ చైర్మన్, సలహాదారు కె.శివషణ్ముగం అన్నారు. పర్యాటక రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ద్వారా పెట్టుబడులను ప్రోత్సహించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే కర్ణాటక పర్యాటక మంత్రిత్వశాఖ సహకారంతో కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీ సమాఖ్య 'దక్షిణ్ భారత్ ఉత్సవ్-2024'కు శ్రీకారం చుట్టిందని తెలిపారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన ఉత్సవ్ రోడ్ షో సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15, 16 తేదీల్లో బెంగళూర్ వేదికగా 'దక్షిణ భారత్ ఉత్సవ్'ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లోని అపార పర్యాటక సామర్థ్యాన్ని చాటిచెప్పడమే తమ లక్ష్యమన్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పర్యాటక శాఖ మంత్రులు, అధికారులు, పెట్టుబడిదారులు, విదేశీ పర్యాటక ప్రతినిధులు సైతం హాజరవుతారని చెప్పారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లను దక్షిణాది పర్యాటకానికి సెవన్ సిస్టర్స్‌గా అభివర్ణించారు. సులభతర వాణిజ్యం చేసుకునేలా దక్షిణ్ భారత్ ఉత్సవ్ దోహదపడుతుందని వెల్లడించారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు మాట్లాడుతూ సుదీర్ఘ తీర ప్రాంతం, అరకులోయల అందాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలతో దేశీయ పర్యాటకులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచిందన్నారు. గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోట, లేపాక్షి, బుద్ధిస్టు సర్క్యూట్లతో ప్రపంచ పర్యాటకాన్ని ఆకర్షించే సామర్థ్యం ఏపీ సొంతమన్నారు. ఈ క్రమంలోనే దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో క్రాస్ బోర్డర్ పర్యాటకానికి బాటలు వేయాలని కోరారు. ఏపీలోని పర్యాటక పాలసీ కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందన్నారు. కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీస్ సమాఖ్య ప్రస్తుత మాజీ అధ్యక్షుడు బీవీ గోపాల్‌రెడ్డి, దక్షిణ్ భారత్ ఉత్సవ్ చీఫ్ కో-ఆర్డినేటర్ జీకే శెట్టి, ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు ఎం.మురళి తదితరులు పాల్గొన్నారు.



'దక్షిణభారత్ ఉత్సవ్-2024' లోగోను ఆవిష్కరిస్తున్న శివషణ్ముగం తదితరులు

విద్యార్థులకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్

- కేజీబీవీ, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్ల 9వ తరగతి విద్యార్థులకు అవకాశం
- 2024-25 విద్యా సంవత్సరం నుంచి అమలు
- జీవో విడుదల చేసిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ పరిధిలోని కేజీబీవీ, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం గ్లోబల్ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తెచ్చింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి వీరిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆయా రెసిడెన్షియల్ స్కూళ్లకు కొద్దిరోజులు పంపించనున్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించేందుకు, వేగంగా మారుతున్న ప్రపంచంలో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అందుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు విజయవంతమైన సంస్కరణలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని 352 కేజీబీవీలు, 50 ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 17,221 మంది 9వ తరగతి విద్యార్థులకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు విభిన్న విద్యా వాతావరణాలను తెలుసుకునే అవకాశం, వివిధ ప్రాంతాల విద్యార్థుల మధ్య పరస్పర అవగాహన ఏర్పడుతుందని, తద్వారా వారి ఆలోచనా పరిధి పెరుగుతుందని విద్యాశాఖ భావిస్తోంది. ఒక్కో స్కూల్ నుంచి 10 శాతం లేదా నలుగురు చొప్పున విద్యార్థుల ఆసక్తి మేరకు ఈ ప్రోగ్రామ్ కింద ఎంపిక చేస్తారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాక 15వ తేదీ నుంచి విద్యార్థుల మార్పిడి ప్రోగ్రామ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ డైరెక్టర్లను ఆదేశించారు.

శ్రీసిటీలో తొలి రష్యన్ పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభం

- రూ.95 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు
- వివిధ రకాల ఇంజినీరింగ్ ప్లాస్టిక్ ఉత్పత్తులే లక్ష్యం

శ్రీసిటీ (వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): శ్రీసిటీలో రష్యాకు చెందిన ప్రముఖ కుయిబిషెవ్ అజోట్ పీజేఎస్సీ అనుబంధ సంస్థ అయిన కుయిబిషెవ్ అజోట్ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నూతన పరిశ్రమ బుధవారం ప్రారంభమైంది. మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.95 కోట్ల తొలి విడత ప్రారంభ పెట్టుబడితో 15 వేల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటైంది. చెన్నైలోని రష్యన్ కాన్సూల్ జనరల్ ఓలేగ్ ఎన్ అవదీవ్ పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కుయిబిషెవ్ అజోట్ (శ్రీసిటీ) మేనేజింగ్ డైరెక్టర్ అలెగ్జాండర్ గెరాసిమెంకో, డైరెక్టర్ పి.బి.రమేష్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అవదీవ్ మాట్లాడుతూ.. శ్రీసిటీ పారిశ్రామిక నగరం ప్రత్యేకతలు, వ్యాపార అనుకూల వాతావరణం అద్భుతమని కొనియాడారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కుయిబిషెవ్ అజోట్ ఇంజినీరింగ్ ప్లాస్టిక్ పరిశ్రమ శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబంలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇది మొదటి రష్యన్ కంపెనీగా పేర్కొన్న ఆయన కాన్సూల్ జనరల్ చొరవతో మరిన్ని రష్యన్ కంపెనీలు రానున్న రోజుల్లో ఇక్కడకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గెరాసిమెంకో మాట్లాడుతూ.. దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో పాలిమైడ్ వివిధ రకాల ఇంజినీరింగ్ ప్లాస్టిక్‌లను ఉత్పత్తి చేయడానికి ఈ పరిశ్రమ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఉత్పత్తులను ఆటోమోటివ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కన్జూమర్ గూడ్స్, డిఫెన్స్, రైల్వే తదితర రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తారని పేర్కొన్నారు.



శ్రీసిటీలో ప్లాస్టిక్స్ పరిశ్రమను ప్రారంభిస్తున్న రష్యన్ కాన్సూల్ జనరల్ ఒలేగ్ ఎన్ అవదీవ్

'మోడల్' స్కూల్‌ను సందర్శించిన మధ్యప్రదేశ్ అధికారులు



పీపీ1, పీపీ2 తరగతులను పరిశీలిస్తున్న బృందం

గన్నవరం: కృష్ణా జిల్లాలో మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపికైన గన్నవరం మండలంలోని దావాజిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం సందర్శించింది. మధ్యప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రష్మి అరుణ్‌షమీ నేతృత్వంలోని 10 మందితో కూడిన బృందం పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించింది. స్కూల్ నిర్వహణపై మధ్యప్రదేశ్ అధికారులు సమగ్రశిక్షా అభియాన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను బోధించేందుకు అన్ని సదుపాయాలతో మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఈ పాఠశాలను పూర్తి స్థాయిలో ఆధునీకరించినట్లు బృందానికి ఏఎస్‌డీపీ శ్రీనివాసులరెడ్డి వివరించారు. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మోడల్ ఫౌండేషన్ పాఠశాలను అభివృద్ధి చేయడం పట్ల ఈ బృందం అభినందనలు తెలిపింది. పీపీ1, పీపీ2 తరగతి గదుల్లో అత్యాధునిక సదుపాయాలను చూసి హర్షం వ్యక్తం చేసింది.

ఉమ్మడి రాజధానిని మరో ఐదేళ్లు కొనసాగించాలి

ఓపెన్ మైండ్స్ ప్రెసిడెంట్ రాజశేఖరరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో ఐదేళ్ల పాటు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఓపెన్ మైండ్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజశేఖరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గవర్నర్‌కు రాసిన లేఖను ఆయన మీడియాకు బుధవారం విడుదల చేశారు. విభజన చట్టం ప్రకారం హైదరాబాద్‌ను 2024 జూన్ 2 వరకు ఉమ్మడి రాజధానిగా ప్రకటించారని గుర్తు చేశారు. హైదరాబాద్ ఎదగడంలో తెలంగాణతో పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజల కష్టం ఎంతో ఉందన్నారు. విభజన పూర్తిగా ఆంధ్రప్రజల మనోభావాలకు విరుద్ధంగా జరిగిందన్నారు. ఇంకా పూర్తిగా విభజిత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలదొక్కుకోలేని ప్రస్తుత తరుణంలో హైదరాబాద్‌పై ఎలాంటి హక్కులు లేవని చెప్తే ఆంధ్ర యువత తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఇప్పటికీ ఆస్తుల బదలాయింపు పూర్తిగా జరగలేదని, ఏపీకి బకాయిలు కూడా తెలంగాణ పూర్తిగా చెల్లించలేదన్నారు. 9, 10 షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రధాన సంస్థల బదలాయింపు, ఉద్యోగుల విభజన కూడా పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న, ఇచ్చిన హామీలన్నీ అపరిష్కృతంగానే ఉన్న నేపథ్యంలో హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని పేర్కొన్నారు.

తెలంగాణ

'స్కూటీ' అయితే పాప.. 'బైక్' అయితే బాబు

- కోడ్ భాషలో పసికందుల విక్రయాలు
- ఉత్తరాది రాష్ట్రాల్లో హైదరాబాద్ పోలీసుల తనిఖీలు
- ఢిల్లీ, యూపీ, పుణే నగరాల్లోని ముఠాపై ఆరా

సాక్షి, న్యూఢిల్లీ: పసికందుల విక్రయానికి అంతర్ రాష్ట్ర ముఠా కోడ్ భాష వినియోగించినట్టు రాచకొండ పోలీసులు గుర్తించారు. పాపను 'స్కూటీ'గా, బాబును 'బైక్'గా పిలుస్తూ ఇలా కోడ్ భాష ఎంచుకున్నట్లు స్పష్టమైంది. చిన్నారులను రాష్ట్రాలు దాటించి పిల్లలు లేని దంపతులకు అమ్ముతున్న అంతర్‌రాష్ట్ర ముఠా గుట్టును రాచకొండ పోలీసులు భగ్నం చేసిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో పోలీసులు మరింత దూకుడుగా ముందుకెళుతున్నారు. బుధవారం ఢిల్లీతోపాటు పుణే, యూపీ, నోయిడా, హర్యానాల్లోని పలు సిటీల్లో రాచకొండ పోలీసులు బృందాలుగా తనిఖీలు చేశారు. స్థానిక పోలీసుల సహకారంతో కొందరిని అదుపులోకి తీసుకొని విచారించినట్టు తెలుస్తోంది.



వాట్సాప్‌లో మెసేజ్‌లు

పాప కావాలి అంటే 'స్కూటీ' కావాలా?, బాబు కావాలి అంటే మీకు 'బైక్' కావాలా అని ముఠా సభ్యులు వాట్సాప్‌లో పిల్లలు లేని దంపతులకు మెసేజ్‌లు పంపేవారు. డైరెక్టుగా పాప కావాలా లేదా బాబు కావాలా అని మెసేజ్‌లు చేస్తే పోలీసులకు దొరికిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముఠాసభ్యులు ఈ కోడ్ భాషను వినియోగించినట్టు పోలీసులు గుర్తించారు. ఎవరైనా తెలియక పాప లేదా బాబు కావాలి అని మెసేజ్ చేస్తే వారికి వాట్సాప్ కాల్ చేసి మరీ ఈ కోడ్ భాష గురించి చెప్పేవారని, అనంతరం పిల్లలు లేని దంపతులు కూడా కోడ్ భాషను వినియోగించే వారని తెలిసింది. ఈ రకంగా పలు ప్రాంతాల్లో పసికందులను విక్రయించినట్టు సమాచారం. ప్రస్తుతం రాచకొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన వారి వివరాలతోపాటు వీరికి సంబంధించిన ప్రతి ఒక్క కదలికలపై నిఘా పెంచారు. కొంతకాలంగా వీరు ఎవరెవరితో మాట్లాడుతున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. వీటితో పాటు వాట్సాప్/టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా చాట్ చేసిన వివరాలు సేకరించారు. ఈ చాటింగ్‌లలో పోలీసులకు క్లూ లభించినట్టు తెలుస్తోంది. ఈ క్లూతోనే ఢిల్లీ, పుణే, హర్యానా వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు కొందరికి నోటీసులు కూడా జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

ఆ చిన్నారులు మా వద్ద క్షేమంగా ఉన్నారు

పెంపుడు తల్లిదండ్రులకు పిల్లలను ఇచ్చేది లేదు: కాంతి వెస్లీ

వెంగళరావునగర్(హైదరాబాద్): రాచకొండ పోలీసులు 11 మంది చిన్నారులను శిశువిహార్‌కు అప్పగించారని, వారంతా తమ వద్ద క్షేమంగా ఉన్నారని మహిళ,శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ చెప్పారు. బుధవారం కొందరు తల్లిదండ్రులు, మీడియా మహిళ, శిశు సంక్షేమశాఖ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అయితే దాదాపు రెండు గంటలపాటు ఎదురు చూసినా ఎవరినీ లోపలకు అనుమతించలేదు. ఆ తర్వాత కాంతి వెస్లీ బయటకు వచ్చి మీడియాకు పలు విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను విక్రయించడం, కొనడం చట్టరీత్యా నేరం.. వారికి కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ఆ విధంగా తీసుకొని పెంచుకోవడం కూడా తప్పేనన్నారు. చిన్నారులను కొని పెంచిన వారు ఇప్పుడు వచ్చి మా పిల్లలను మాకివ్వండి అని అడుగుతున్నారని, వారికి పిల్లలను ఇవ్వడం ఎట్టి పరిస్థితుల్లో కుదరదని తేల్చిచెప్పారు. అలాంటి తల్లిదండ్రులు ఎవరూ ఇక్కడకు రావొద్దని పేర్కొన్నారు. సంతానం లేనివారు ఎవరైనా పిల్లలు కావాలంటే మా వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే విచారణ అనంతరం దత్తత ఇస్తామన్నారు. పెంపుడు తల్లిదండ్రులు దత్తత కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి ఈ పిల్లలను మ్యాచ్ చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

అధికారుల బదిలీపై నిరసన



ఆందోళన చేస్తున్న మహిళలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ జిల్లాలో నియమితులైన ఐఏఎస్, ఐపీఎస్, కేఏఎస్, జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేయడం తగదని గ్రామీణ కూలీ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన సంచాలకుడు బసవరాజ్ మాట్లాడారు. వరి పండించే, విద్యుత్ అందించే జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు తమ లాభం కోసం అధికారులను బదిలీ చేసి నూతన అధికారులు జిల్లా విషయాలను అర్థం చేసుకొనే లోపే వారిని బదిలీ చేస్తే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధికారులను బదిలీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి

హుబ్లీ: బైక్ అదుపు తప్పి వంతెనను ఢీకొనడంతో భారతీయ నౌకాదళానికి చెందిన జవాన్ ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జిల్లాలోని నవలగుంద తాలూకా అణ్ణిగేరి పట్టణ సమీపంలోని అరెరా వంతెన వద్ద జరిగింది. మృతుడిని తెలంగాణకు చెందిన సైనికుడు మారడ్డి సందీపరెడ్డి(26)గా గుర్తించారు. ఈయన గదగ్ నుంచి అణ్ణిగేరి మీదుగా హుబ్లీకి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనపై అణ్ణిగేరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఏసుక్రీస్తు చిత్రపటాల కోసం వాగ్వాదం



ఆర్టీసీ అధికారులతో వాదిస్తున్న జీసస్ ప్రచారకర్త

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లాలో బసవేశ్వరుడి చిత్రపటాలకు బదులుగా ఏసు క్రీస్తు చిత్రపటాలు పెట్టాలని ఓ వ్యక్తి గొడవ చేసిన ఘటన సురపుర బస్టాండ్‌లో చోటు చేసుకుంది. బుధవారం ఆర్టీసీ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన ఏసు క్రీస్తు ప్రచారకర్త క్రైస్తవ మతస్తులకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ బసవేశ్వరుడి చిత్రపటాలను తొలగించి జీసస్ చిత్రపటాలను పెట్టాలని వాదిస్తున్న వీడియో వైరల్ కావడం గమనార్హం.

వీల్‌చైర్ల పంపిణీ



లబ్ధిదారుడికి వీల్‌చైర్ పంపిణీ చేసిన దృశ్యం

బళ్లారిఅర్బన్: శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన ద్వారా జిల్లాలోని సండూరు తాలూకా కురేకుప్ప గ్రామంలో జయవర్ధన, బడా పీరాసాబ్ అనే దివ్యాంగులకు బుధవారం సంస్థ జిల్లా డైరెక్టర్ రోహితాక్ష రెండు వీల్‌చైర్లను అందజేశారు. కౌన్సిలర్ కల్లు గుడియప్ప, హొసగేరప్ప, యోజనాధికారి సతీష్, అధ్యక్షురాలు లక్ష్మమ్మ, పదాధికారిణి శ్యామల, సేవా ప్రతినిధి విజయలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడదాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి శ్రీనివాస్ నవలి తదితరులు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడదామని కలబుర్గి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ నవలి పిలుపునిచ్చారు. బుధవారం కలబుర్గి సేట్ శంకర్‌లాల్ న్యాయ శాస్త్ర కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరంలో విద్యార్థులు తమ ఇంటి చుట్టుపక్కల మొక్కలు నాటాలన్నారు. మంచి గాలి, వాతావరణం, వర్షాలు కురవడానికి వీలు ఉంటుందన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇల్లు కట్టేవారు చెట్లు పెంచకుండా నిర్లక్ష్యంతో నేడు వేడి అధికమైందన్నారు. కార్యక్రమంలో విజయపుర మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం అధికారి మహేష్, సేట్ శంకర్‌లాల్, న్యాయ శాస్త్ర కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి, జ్యోతి, లక్ష్మి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సిలిండర్ రీఫిల్లింగ్

- కానరాని భద్రతా ప్రమాణాలు
- అప్రమత్తంగా లేని అధికారులు
- స్థానికుల సమాచారంతో దాడులు



అధికారులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు, క్యాంటర్ వాహనం(ఫైల్)

కేజీఎఫ్ : నగరంలో సిలిండర్ రీఫిల్లింగ్ దందా జోరుగా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సిలిండర్ల రీఫిల్లింగ్ సమయంలో భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్ల భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ ధరలతో లభించే గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేయడం ద్వారా లాభాలు సంపాదించ వచ్చనే ఆశతో పలువురు ఈ దందా నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి కాస్తంత ఎక్కువ డబ్బులతో వంట గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేసి అనంతరం ఆ గ్యాస్‌ను వేరే సిలిండర్‌లోకి నింపి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే వారికి అధిక ధరలకు విక్రయిస్తారు. ఈ క్రమంలో ఎలాంటి భద్రతా చర్యలను చేపట్టరు. రీఫిల్లింగ్ చేస్తున్నప్పుడు గ్యాస్ సిలిండర్లు పేలి ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. నిత్యావసర వస్తువుల చట్టం–1955 ప్రకారం పెట్రోలియం ఉత్పత్తులను అనధికారికంగా నిల్వ చేయడం, రవాణా చేయడం నిషేధం. ఇందుకు కఠిన శిక్షలు ఉన్నాయి. అయినా వీటిని బేఖాతరు చేసి పలువురు ఈ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు.

దాడుల్లో భారీగా సిలిండర్లు స్వాధీనం

ఇటీవల కేజీఎఫ్‌లో జరుగుతున్న బృహత్ గ్యాస్ రీఫిల్లింగ్ దందాపై దాడులు నిర్వహించిన ఆహార శాఖ అధికారులు భారీ ఎత్తున గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 80 వాణిజ్య ఉపయోగ సిలిండర్లు, 60 గృహ వినియోగ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని అండర్‌సన్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదేవిధంగా కుప్పం రహదారిలో రషీద్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో రీఫిల్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు భారత్ కమర్షియల్ సిలిండర్లు 51, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లు 50, ఇండేన్ సిలిండర్లు 10, హెచ్‌పీ సిలిండర్లు 13, ఖాళీ సిలిండర్లు 10, ఒక మొబైల్ ఫోన్, సిలిండర్లు రవాణా చేసే క్యాంటర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

త్వరలో చర్యలు తీసుకుంటాం

అక్రమ సిలిండర్ రీఫిల్లింగ్ దందాపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కేసులు నమోదు చేశాం, పరారీలో ఉన్న రీఫిల్లింగ్ నిర్వాహకుల కోసం గాలింపు చేపట్టాం. త్వరలో నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకుంటాం.

–శాంతరాజు, ఎస్పీ, కేజీఎఫ్

యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా



అక్రమ ఇసుక నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో కృష్ణా నది తీర ప్రాంతం వెంట అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోందని అంబేడ్కర్ సేన అధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి ఆరోపించారు. మంగళవారం తాలూకాలోని కరేకల్ వద్ద నిల్వ ఉంచిన ఇసుక నిల్వల వద్దకు అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో యథేచ్ఛగా ఇసుక రవాణా దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందన్నారు. టిప్పర్ల ద్వారా రాత్రికి రాత్రే ఇసుకాసురులు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయన్నారు. అక్రమ ఇసుక రవాణాదారులపై పోలీస్, రెవిన్యూ, ఆర్టీఓ అధికారులు దాడి చేసి 50 టన్నుల మేర ఇసుకను స్వాధీనం చేసుకున్నారన్నారు. జేసీబీలు, హిటాచీల గర్జన, ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో యాదగిరి, రాయచూరు జిల్లాల్లోని గూగల్, గుర్జాపూర్, దేవదుర్గ, వడగేర, సురపుర, భీమరాయన గుడి, శహాపురలతో పాటు తెలంగాణలోని జూరాల వంటి ప్రాంతాల్లో చెక్‌పోస్టులున్నా వాటి కళ్లుగప్పి అక్రమ ఇసుక రవాణా సాగుతోందన్నారు. ఒక టిప్పర్ ధర రూ.55 వేల నుంచి రూ.60 వేలు, కలబుర్గి జిల్లాలో రూ.80 వేలు, ఇతర రాష్ట్రాలకైతే రూ.1.50 లక్షల వరకు ధర ఉంది. నిత్యం 400 టిప్పర్ల మేర రవాణా అవుతోంది. ప్రతి టిప్పర్‌లో 35 టన్నుల మేర ఇసుక రవాణాతో రోజు రూ.2 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. యాదగిరి జిల్లా ఇంచార్జి మంత్రి శరణ బసప్ప దర్శనాపుర, దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా వాహనాల సంచారం అధికమైందన్నారు.

విత్తనాల ధరల పెంపు తగదు

హుబ్లీ: ఈ సారి రాయితీ ధరలతో పంపిణీ చేస్తున్న సాగు విత్తనాల ధరలు భారీ ప్రమాణంలో పెరిగాయి. గత ఏడాది కరువుతో విలవిలాడిన అన్నదాతలపై ఈసారి విత్తనాల ధర పెంపు పుండు మీద కారం చల్లినట్లుగా ఉందని బీజేపీ నేత, రైతు పోరాట యోధుడు పీహెచ్ నేరళకేరి ఆరోపించారు. బుధవారం ఆయన ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సాగు విత్తనాల ధరలను 60 నుంచి 70 శాతం పెంచిందని తెలిపారు. ఉత్తర కర్ణాటక ప్రముఖ పంటలైన కంది, పెసలు, మొక్కజొన్న విత్తనాల ధరలు పెంచారని తెలిపారు. గత ఏడాది సబ్సిడీ పోను జనరల్ వర్గాలకు మొక్కలను 5 కేజీల ప్యాకెట్‌కు రూ.501, ఎస్టీ, ఎస్సీ వర్గాలకు రూ.438 ధర ఉండగా ఈసారి రూ.805, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.742గా ధర నిర్ణయించారని, దీంతో రైతులు విత్తనాలు కొనుగోలు చేయలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ఏడాది వానలు లేక సరిగా పంటల దిగుబడి రాలేదని, ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని కోరారు. అలా చేయకుండా విత్తనాల ధర పెంచడం రైతులకు తీరని శరాఘాతం అన్నారు. గత ఏడాది కరువు తీవ్రత వల్ల రైతులు ఇక్కట్ల పాలయ్యారని, సబ్సిడీని పెంచి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హత్యోదంతాలపై సీఐడీ డీజీపీ సమీక్ష

హుబ్లీ: స్థానిక బీవీబీ కళాశాల ఆవరణలో గత ఏప్రిల్ 18న విద్యార్థిని నేహా హిరేమఠ హత్యకు గురైన స్థలంతో పాటు ఆమె నివాసాన్ని రాష్ట్ర సీఐడీ డీజీపీ ఎంఏ సలీం బుధవారం సందర్శించి కేసు గురించి వివరాలు తెలుసుకున్నారు. రెండు రోజులకే నేహా, అంజలి హత్య కేసుల దర్యాప్తు బృందానికి డీజీపీ సలీం తగిన మార్గదర్శనం చేశారు. మంగళవారం అంజలి నివాసానికి వెళ్లిన ఆయన బుధవారం నేహా హత్య స్థలాన్ని దర్యాప్తు బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలమహజరు, ఫైళ్లు, నిందితుల వాంగ్మూలం, సేకరించిన శాస్త్రీయ సాక్ష్యాధారాలు, సాక్షుల వివరాల గురించి సమీక్షించారు. అనంతరం స్థానిక బిన్నాళలోని నేహా నివాసానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసు గురించి నేహా తండ్రి నిరంజనయ్య హిరేమఠను అడిగి ఘటన వివరాలను తెలుసుకున్నారు. నిందితుడు ఫయాజ్ గురించి సీఐడీ బృందం ఇప్పటికే సేకరించిన వివరాల ఆధారంగా కొంత సమాచారాన్ని తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం నిరంజనయ్య మీడియాతో మాట్లాడుతూ నేహా హిరేమఠ హత్య ప్రణాళికాబద్ధంగా జరిగిన హత్య అని ప్రారంభం నుంచి చెబుతున్నానన్నారు. సీఐడీ విచారణ వేళ కూడా అదే విషయాన్ని పునరుద్ఘాటించానన్నారు. సీఐడీ బృందం అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతుందని భావిస్తున్నానన్నారు. సీఐడీ డీజీపీ సలీం కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కేసు ఉదంతాన్ని ఒక నమూనాగా తీసుకొని సమాజానికి హెచ్చరిక సందేశం ఇవ్వడంతో పాటు త్వరలో కోర్టుకు చార్జిషీట్ సమర్పిస్తామని, ఆశించినట్లుగా దర్యాప్తు జరుగుతోందని డీజీపీ తెలిపినట్లు వివరించారు. కాగా అంజలి హత్య గురించి 2021లో బెండిగేరి స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి సమతాసేన, వివిధ దళిత సంఘాల నేతలు డీజీపీ సలీంకు విజ్ఞప్తి చేసిన తక్షణమే ఆయన స్పందించి అతిథిగృహంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార, డీసీపీలు కుశాల్ చౌక్సీ, రవీశ్ సీఆర్, ఏసీపీ శివప్రకాష్ నాయక్‌తో చర్చించారు. అనంతరం 2020–21 నాటి కేసు దర్యాప్తు ఫైళ్లను పరిశీలించి అవసరమైన సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది.

అక్రమాల్లో మంత్రి పాత్ర లేదు



మాట్లాడుతున్న ముండ్రగి నాగరాజ్ తదితరులు

బళ్లారిఅర్బన్: ఎస్టీ మండలిలో జరిగిన అక్రమాలను ప్రతిపక్ష నేతలు మంత్రి నాగేంద్రకు అంటగడుతూ లేని పోని ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ రంగు పులమడం సరికాదని రాష్ట్ర లిడ్కర్ సంస్థ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజ్ మండిపడ్డారు. బుధవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రముఖ వాల్మీకి నాయకుడిగా చెప్పుకుంటున్న శ్రీరాములు అసెంబ్లీ ఎన్నికల్లో నాగేంద్ర చేతిలో ఓటమి చవిచూశారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా శ్రీరాములుకు ఓటమి తప్పదన్నారు. ఈ కారణాలతోనే రాష్ట్ర, జిల్లా బీజేపీ నేతలు అనవసరంగా మంత్రి నాగేంద్రపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. నాగేంద్రకు చెడ్డ పేరు తేవడానికే ఈ కుట్రలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆత్మహత్య కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ దర్యాప్తునకు అప్పగించిందన్నారు. డెత్‌నోట్‌లో పేర్కొన్న ముగ్గురు అధికారులపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. అంతేగాక రూ.87.62 కోట్ల నిధుల దుర్వినియోగంపై సంబంధిత బ్యాంక్ అధికారులపై కేసులు నమోదయ్యాయన్నారు. తక్షణమే ఆ సొమ్మును కార్పొరేషన్ ఖాతాకు తిరిగి చెల్లించేలా బ్యాంక్ అధికారులకు ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన మంత్రి నాగేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యులు ఎంత పెద్దవారైనా కూడా తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారన్నారు. విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ఆ పార్టీ ప్రముఖులు హుమయూన్‌ఖాన్, హుస్సేన్ పీరా, అభిలాష్, మేయర్ శ్వేత, ఉపమేయర్ జానకమ్మ, మాజీ మేయర్ రాజేశ్వరి, కార్పొరేటర్ రాజశేఖర్, మానయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో నరేగ కూలి మృతి



మహంతేష్(ఫైల్)

రాయచూరు రూరల్: జిల్లాలో నరేగ పథకంలో పనులు చేస్తున్న కూలి వడదెబ్బతో మృతి చెందిన ఘటన జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో జరిగింది. బుధవారం ఈచనాళలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగ) పనుల్లో ఉన్న మహంతేష్(34) అనే వ్యక్తి ఆకస్మికంగా స్పృహ తప్పి కుప్పకూలాడు. వెంటనే కూలీలు అతనిని లింగసూగూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని పోలీసులు తెలిపారు. కాగా మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నా హస్తం ఏమీ లేదు: ఎమ్మెల్యే

హొసపేటె: తాగునీటి సరఫరాకు వచ్చిన ట్యాంకర్ లారీని నగరసభ అధికారి అడ్డుకోవడం వెనుక తన హస్తం ఏమీ లేదని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ విషయాన్ని జిల్లాధికారి చూసుకుంటారని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చిత్తవాడిగి జాతీయ రహదారి బైపాస్ రహదారిలో ఉన్న మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ ట్యాంకర్ లారీ మంచి నీరు తీసుకెళ్లేందుకు రాగా నగరసభ అధికారి చంద్రప్ప అడ్డుకోగా మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ ట్యాంకర్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం లేదన్నారు. తాను అధికారం చేపట్టినప్పటి నుంచి ఇంతవరకు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనుల గురించి త్వరలో క్షుణ్ణంగా తెలియజేస్తానన్నారు.

విద్యాశాఖ ప్రాధికార ఏర్పాటుకు డిమాండ్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో విద్యాశాఖ ప్రాధికారను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి వేదిక సంచాలకురాలు విద్యా పాటిల్ డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024–25వ విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కొన్ని సర్కారీ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో జూన్ 1 నుంచి పాఠశాలలను ఏ విధంగా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. జిల్లాలో 160 పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే అవకాశాలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రుల వెంట కూలి పనులకు వెళుతున్నారన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. మోక్షమ్మ, శివరామరెడ్డి, మారెమ్మ, హఫీజుల్లాలున్నారు.

మమతా బెనర్జీ వ్యాఖ్యలు ఖండనీయం

హుబ్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓబీసీ రిజర్వేషన్లను అక్కడి హైకోర్టు రద్దు చేసినా కొనసాగిస్తామని సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ బీసీ వర్గాల మోర్చా జిల్లా శాఖ పదాధికారులు బుధవారం ఆందోళన చేపట్టి మమతకు వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆక్రోశం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఓబీసీ కోటా–2010 ద్వారా కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించడం చట్ట వ్యతిరేకం అని కోల్‌కతా హైకోర్టు వాటిని రద్దు చేసిందన్నారు. అయినా కోర్టు ఆదేశాలను అమలు చేయబోమంటూ అక్కడి సీఎం చెప్పడం ఖండనీయం అని మోర్చా నేతలు సతీష్, రత్నమూర్తి కులకర్ణి, ప్రభు, మల్లప్ప తెలిపారు. ఆందోళనలో అరుణ, వినాయక ఆశ్వా, బసవరాజ్, లక్ష్మీకాంత్, అనురాధ, జగదీష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ భీమాకు శ్రీకారం



భీమా నదిని శుభ్రం చేస్తున్న బ్రిగేడ్ సభ్యులు

రాయచూరు రూరల్: భీమా నదిలో స్వచ్ఛతకు యువ బ్రిగేడ్ శ్రీకారం చుట్టింది. బుధవారం కలబుర్గి జిల్లా అఫ్జల్‌పుర వద్ద భీమా నదిలో పడి ఉన్న చెత్త చెదారం, ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు, పాత దుస్తులు, ఇతరత్ర వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. వర్షాకాలం ప్రారంభానికి మునుపే వర్షపు నీరు వచ్చి బ్యారేజీలో చేరక ముందే 15 మందితో కూడిన బృందం నదితో పాటు తీర ప్రాంతాన్ని శుభ్రపరిచినట్లు అఫ్జల్‌పుర యువ బ్రిగేడ్ సంచాలకుడు రాజేంద్ర తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గిరియప్ప(ఫైల్)

రాయచూరు రూరల్: అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని సింధనూరు తాలూకా సాలగుందలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గిరియప్ప(45) అనే రైతు వ్యవసాయం కోసం ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.18 లక్షలు, బూదివాళ బ్యాంక్‌లో రూ.2 లక్షలు, మహేంద్ర ఫైనాన్స్‌లో రూ.లక్ష, చేబదులు కింద రూ.7 లక్షలు అప్పులు చేశాడు. అయితే పంట నష్టం వాటిల్లడంతో చేసిన అప్పులు తీర్చే దారి కానరాక అప్పులిచ్చిన వారి వేధింపులు అధికమై జీవితంపై విరక్తి చెంది పొలంలో విషం తాగాడు. ఆయనను టీపీ మాజీ సభ్యుడు వెంకోబ, జీపీ సభ్యుడు నిరుపాది తదితరులు కలిసి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై అధికారులతో జిల్లాధికారి మాటామంతీ

రాయచూరు రూరల్: జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారి, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బుధవారం నగరంలోని ఎల్‌వీడీ కళాశాలలో ఈవీఎం యంత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లాధికారి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సలహా సూచనలు చేశారు.

మంత్రిని తొలగించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్‌లో జరిగిన రూ.187 కోట్ల అవకతవకలకు బాధ్యతగా రాష్ట్ర మంత్రి బీ.నాగేంద్రను కేబినెట్ నుంచి తొలగించాలని జిల్లా బీజేపీ శాఖ కార్యకర్తలు బుధవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లాధికారికి వినతిపత్రం అందజేశారు. ముందుగా నగర ఆరాధ్య దేవత కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి రాయల్ సర్కిల్ మీదుగా జిల్లాధికారి కార్యాలయం వరకు ఈ ప్రదర్శన జరిపారు. ఆ కార్పొరేషన్ అకౌంటెంట్ చంద్రశేఖర్ ఆత్మహత్యకు మంత్రి నాగేంద్ర నేరుగా కారకులైనందున ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ రాయల్ సర్కిల్ వద్ద నాగేంద్ర దిష్టిబొమ్మను దహనం చేసి ఆక్రోశం వెళ్లగక్కారు. పార్టీ ప్రముఖులు రవికుమార్, గురులింగనగౌడ, ఓబులేష్, గుత్తిగనూరు విరుపాక్షి గౌడ, రామలింగప్ప, సాధన హిరేమఠ, డాక్టర్ మహిపాల్, సోమశేఖర్‌గౌడ, నాగవేణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క–కలో భారీగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

- పదిలో తక్కువ శాతం ఫలితాలే నిదర్శనం
- మౌనం దాల్చిన అమాత్యులు, ఎమ్మెల్యేలు



కళ్యాణ కర్ణాటక జిల్లాల చిత్రపటం

రాయచూరు రూరల్: విద్యా రంగంలో వెనుక బడిన కళ్యాణ కర్ణాటక(క-క)లో మంచి ఫలితాలు సాధించాలనే తపన కలగానే మిగిలింది. కళ్యాణ కర్ణాటకలోని బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలకు గాను కలబుర్గి జిల్లాలో హైస్కూళ్లు 450, ప్రాథమిక పాఠశాలలు 1640, రాయచూరు జిల్లాలో హైస్కూళ్లు 826, ప్రాథమిక పాఠశాలలు 3304, యాదగిరి జిల్లాలో హైస్కూళ్లు 661, ప్రాథమిక పాఠశాలలు 2363, కొప్పళ జిల్లాలో హైస్కూళ్లు 489, ప్రాథమిక పాఠశాలలు 1852, బీదర్ జిల్లాలో హైస్కూళ్లు 330, ప్రాథమిక పాఠశాలలు 497, బళ్లారి జిల్లాలో హైస్కూళ్లు 396, ప్రాథమిక పాఠశాలలు 1250, విజయనగర జిల్లాలో హైస్కూళ్లు 343, ప్రాథమిక పాఠశాలలు 760 ఉండగా పీఈటీ, డ్రాయింగ్ ఉపాధ్యాయులు 2645, విషయ పరిశీలకుల పోస్టులు 398తో కలిపి మొత్తం 17443 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతంలో ఉపాధ్యాయుల పోస్టులను పొందిన ఏడాదికే మైసూరు, తుమకూరు, విజయపుర, బాగల్‌కోటె, గదగ్, హాసన్, హావేరి, మండ్య, రామనగర, శివమొగ్గ, దావణగెరె వంటి జిల్లాలకు తిరిగి బదిలీలపై వెళ్లిన వారి స్థానంలో కొత్తగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ ఉదాసీనత వల్ల నేడు పదవ తరగతిలో ఫలితాలు తక్కువగా వచ్చాయి. కళ్యాణ కర్ణాటకలో 48 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు మంత్రులున్నా విద్యా రంగం అభివృద్ధిపై చిత్తశుద్ధిని చూపడంలో నిరాసక్తతను కనబరుస్తుండటం శోచనీయం.

పల్లెల్లో దాహాకారాలు



చేదబావి వద్ద నీటిని తోడుకుంటున్న ప్రజలు

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా కాళాపూర్‌లో తాగునీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండగా మరోవైపు నీటి ఎద్దడి అధికమైంది. సమస్య నివారణపై అధికారులు మౌనం వహిసున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు తాగునీటి ఎద్దడి సమస్య తీర్చే విషయంలో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బుధవారం తాలూకాలోని కాళాపూర్‌లో వారం రోజులుగా కొళాయిల్లో తాగునీరు సరఫరా కాకపోవడంతో చేదబావి వద్ద నీటిని తోడుకుని పట్టుకెళ్లారు. చేసేది లేక ప్రజలు నీటి కోసం చేదబావిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రుతుక్రమంపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ నాయక్

హొసపేటె: 11 నుంచి 14 ఏళ్ల వయస్సులో వచ్చే రుతుక్రమంపై బాలబాలికలందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ శంకర్ నాయక్ అన్నారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. బహిష్టు సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా నిర్వహించే ఈ దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ జంబయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాలను వీడాలన్నారు. జిల్లా డీఎంఓ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కమలమ్మ ప్రత్యేక ఉపన్యాసం చేస్తూ బాలికలు యుక్తవయస్సులో వచ్చే రుతుక్రమాన్ని తెలుసుకోవాలన్నారు. మహిళలు పౌష్టికాహారం తినాలని అన్నారు. బహిష్టు సమయంలో పాత దుస్తులను వాడకూడదన్నారు. ముఖ్యంగా పరిశుభ్రతను పెంపొందించుకోవాలన్నారు.